నినాదం
నిఖార్సైన జర్నలిజం

బుధవారం, అక్టోబర్ 15, 2025 | సంపుటి - 20 | సంచిక 35 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.

# సామాన్యులకు చుక్కలు చూపుతున్న బంగారం

**సంపన్నులను కలవర పెడుతున్న ధరలు**

**లక్షా 30 వేలు దాటేసిన బంగారు తులం ధర**



హైదరాబాద్ : సామాన్యులను దూరం చేసుకుంటున్న బంగారం సంపన్నులనూ సవాల్ చేస్తున్నది. కనీవినీ ఎరుగని రీతిలో రికార్డుల్ని బద్దలుకొడుతున్న పసిడి ధరలు.. రాకెట్ వేగంతో పైపైకి పరుగులు పెడుతున్నాయి. దేశీయ మార్కెట్‌లో బంగారం ధర చుక్కలు తాకుతోంది. 2లో



# మాగంటి సునీతకు బిఫామ్ అందించిన కెసిఆర్

హైదరాబాద్ : జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉపఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలో దిగిన మాగంటి సునీతా గోపీనాథ్ కు పార్టీ అధినేత కేసీఆర్ బీ ఫామ్ అందజేశారు. అదేవిధంగా ఎన్నికల ఖర్చు నిమిత్తం పార్టీ తరపున రూ.40 లక్షల చెక్కును కూడా అందించారు. ఈ సందర్భంగా మాగంటి సునీతా గోపినాథ్ వెంట ఆమె కూతుళ్లు, కుమారుడు, మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, మాజీ మంత్రి, సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్, అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే నలమోతు భాస్కర్ రావు తదితరలు ఉన్నారు. మాగంటి గోపీనాథ్ అకాల మరణంతో జూబ్లీహిల్స్‌లో ఉపఎన్నిక జరుగుతున్నది. ఈ సందర్భంగా కెసిఆర్ వారిని ఆశీర్వదించారు.



# బనకచర్లపై ఎపిని నిరోధించండి

**కేంద్రానికి మరోమారు తెలంగాణ లేఖ**

హైదరాబాద్ : పోలవరం- బనకచర్ల లింకు ప్రాజెక్టు విషయంలో ఏపీ ప్రభుత్వాన్ని నిలువరించాలని తెలంగాణ ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. ఈ మేరకు కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శికి రాష్ట్ర నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా లేఖ రాశారు. బనకచర్ల లింక్ ప్రాజెక్టు విషయంలో గతంలోనే ఫిర్యాదు చేసినట్లు లేఖలో గుర్తు చేశారు. డీపీఆర్ తయారీ కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం టెండర్ నోటిఫికేషన్ జారీ చేసిందని తెలిపారు. తెలంగాణ ప్రయోజనాలకు నష్టం కలిగించే, నిబంధనలు, విభజన చట్టానికి వ్యతిరేకంగా బనకచర్ల లింక్ ప్రాజెక్టు చేపట్టకుండా చూడాలని కోరారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే కేంద్ర జలసంఘం, పోలవరం ప్రాజెక్టు అథారిటీ, గోదావరి, కృష్ణా నదీ యాజమాన్య బోరులకు లేఖ రాసింది. తాజాగా కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శికి లేఖ రాశారు. 2లో

# మంత్రుల మధ్య విభేదాలు అబద్ధం

## మీడియా చిట్‌చాట్‌లో మంత్రి ఉత్తమ్



**ఇరిగేషన్ శాఖలో అవినీతి ఆరోపణలు అవాస్తవమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. తన శాఖ, తన జిల్లా అభివృధి పనులపై తాను ఫోకస్ పెట్టానని వ్యాఖ్యానించారు. మంత్రుల మధ్య సమన్వయం ఉందని.. విబేధాలు లేవని క్లారిటీ ఇచ్చారు. మంగళవారం ఉత్తమ్ కుమార్ రెడ్డి మీడియాతో చిట్ చాట్ చేశారు.**

నల్గొండ : తన శాఖలో బదిలీలు నిబంధనల ప్రకారం జరిగాయని.... ప్రాసెస్ అంతా తానే దగ్గరుండి చూశానని చెప్పుకొచ్చారు. నీటి వాటాల్లో తెలంగాణ హక్కుల కోసం పోరాటం చేస్తూనే ఉన్నామని ఉద్ఘాటించారు. కర్ణాటకలో కాంగ్రెస్, మహారాష్ట్రలో బీజేపీ, ఏపీలో టీడీపీ ఉన్నా తమ హక్కులను వదులుకోబోమని స్పష్టం చేశారు. బనకచర్ల, ఆల్మట్టిపై తాము నిబంధనల ప్రకారం ఫైట్ చేస్తున్నామని తెలిపారు. కృష్ణా, గోదావరిలో నీటి వాటాల కోసం తమ ప్రభుత్వం కమిట్‌మెంట్‌తో పనిచేస్తోందని పేర్కొన్నారు. త్వరలోనే తాము మహారాష్ట్ర వెళ్తున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పుకొచ్చారు. కేసీఆర్ పదేళ్లలో చేసింది ఏమీలేదని ఆక్షేపించారు. కాళేశ్వరం పేరుతో మిగతా ప్రాజెక్టులను కేసీఆర్ పట్టించుకోలేదని ఫైర్ అయ్యారు. కాళేశ్వరం నీళ్లు లేకున్నా... భారతదేశ చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా పంటలు పండాయని నొక్కిచెప్పారు. ధాన్యం కొనుగోలు కోసం రూ.25 వేల కోట్లు రైతులకు కేటాయిస్తున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.



## బిసి రిజర్వేషన్లు అడ్డుకున్న బిజెపి, బిఆర్ఎస్

**అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుతో తట్టుకోని బిఆర్ఎస్**

**మంత్రి కొండా సురేఖ మండిపాటు**

వరంగల్కాం : కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై బీఆర్ఎస్ శ్రేణులు సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తున్నారని మంత్రి కొండా సురేఖ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళ వారం వరంగల్ తూర్పు నియోజకవర్గంలో మంత్రి కొండా సురేఖ పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి కొండా మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్, బీజేపీ రెండు పార్టీల నేతలు కలిసి స్థానిక ఎన్నికలని అడ్డుకున్నారని ఆరోపించారు. బీసీ రిజర్వేషన్‌కి కట్టుబడి 42శాతం రిజర్వేషన్లు ఇస్తున్నామని.. తెలంగాణ అసెంబ్లీలో చర్చ జరిపి ఆమోదించామని పేర్కొన్నారు. 2లో



## రిజర్వేషన్లు బిసిల హక్కు

**ఎవరి దయాదాక్షిణ్యాలతో ఇచ్చేవి కావు**

**తెలంగాణ జనసమితి అధ్యక్షుడు కోదండరాం**

హైదరాబాద్ : రిజర్వేషన్లు బీసీల హక్కు అని, ఎవరి దయా దాక్షిణ్యాల మీద ఇచ్చేవి కాదని తెలంగాణ జనసమితి అధ్యక్షుడు కోదండరాం అన్నారు. జనాభా దామాషా పద్ధతిలో వారికి రావాల్సిన హక్కు ఉందన్నారు. ఎంతోకాలంగా వారు రాజకీయంగా అవకాశాలు అందిపుచ్చుకోలేక పోతున్నారని అన్నారు. రిజర్వేషన్లు మాత్రమే ఈ సమస్యకు పరిష్కారం చూపగలవని అన్నారు. మానత్వపు పునాదులపై కొత్త సమాజం ఏర్పాటు చేసేందుకే అవి ఉన్నట్లు చెప్పారు.



## కదులుతున్న బస్సులో మంటలు

**ప్రయాణికుల్లో 15మంది సజీవ దహనం**

జైసల్మేర్ : రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లో మంగళవారంనాడు ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. థైయాట్ ప్రాంతంలోని మిలటరీ స్టేషన్ సమీపంలో కదులుతున్న ప్రైవేటు ట్రావెల్ బస్సులో మంటలు చెలరేగి 15 మంది సజీవదహనమయ్యారు. మరో 25 మంది గాయపడ్డారు.

**ఆనాడు హైదరాబాద్‌కు మైక్రోసాఫ్ట్**

# ఇప్పుడు విశాఖకు గూగుల్

**సాంకేతికతలో నూతన ఆవిష్కరణలు వస్తున్నాయి**

**ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో చంద్రబాబు**



న్యూఢిల్లీ : ఐటీ దిగ్గజ సంస్థ గూగుల్ విశాఖలో అడుగుపెడుతోందని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. గతంలో హైదరాబాద్‌లో హైటెక్ సిటీని అభివృద్ధి చేశామని.. ప్రస్తుతం విశాఖను ఐటీ హబ్‌గా తీర్చిదిద్దబోతున్నట్లు చెప్పారు. విశాఖపట్నంలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుపై దిల్లీలో ఆ సంస్థతో ఏపీ ప్రభుత్వం ఒప్పందం సందర్భంగా 'భారత్ ఏఐ శక్తి' పేరిట నిర్వహించిన కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, అశ్వినీ వైష్ణవ్, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్, గూగుల్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఆనాడు హైదరాబాద్‌కు మైక్రోసాఫ్ట్ తీసుకొచ్చాం. ప్రస్తుతం విశాఖకు గూగుల్‌ను తీసుకొస్తున్నాం. సాంకేతికతలో నూతన ఆవిష్కరణలు వస్తున్నాయి. డిజిటల్ కనెక్టివిటీ, డేటా సెంటర్, ఏఐ, రియల్‌టైమ్ డేటా కలెక్షన్లు ముఖ్యమైనవి. సాంకేతికను అందిపుచ్చుకోవడంలో ఏపీ ముందుంటుంది. 2047 నాటికి వికసిత్ భారత్ మనందరి లక్ష్యం. హార్డ్ వర్క్ కాదు.. స్మార్ట్ వర్క్ నినాదం తీసుకొచ్చాం. ఐదేళ్లలో గూగుల్ 15 బిలియన్ డాలర్లు ఖర్చు పెడతామనడం సంతోషదాయకం. 2లో



## తుమ్మల, పొన్నంలకు మానవత్వం ఉందా

**మాగంటి సునీతను అవమాన పరుస్తారా**

**మండిపడ్డ మాజీమంత్రి శ్రీనివాస గౌడ్**

హైదరాబాద్ : మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్‌లకు మానవత్వం ఉందా? వాళ్లు మనుషులేనా? అని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ప్రశ్నించారు. ఆడబిడ్డ అయిన మాగంటి సునీతను అవమానించడం ఎంతవరకు సమంజసం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ భవన్‌లో శ్రీనివాస్ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ.. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్‌లపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

# సుప్రీంలో అనుకూల తీర్పురావచ్చు

**హైకోర్టు జీవోను కొట్టేయడం బాధాకరం**

**సుప్రీంలో గట్టిగా వాదనలు వినిపించేందుకు సిద్ధం**

**అభిషేక్ మను సంఘ్వీతో చర్చించామన్న పిసిసి చీఫ్**

**ఎస్ఎల్‌పి విచారణ రేపు వచ్చే ఛాన్స్**

**మీడియాతో పిసిసి చీఫ్ మహేశ్ గౌడ్ వెల్లడి**



**తెలంగాణ ప్రభుత్వం ఓబీసీలకు 42 శాతం రిజర్వేషన్ తీసుకొచ్చిందని.. ఇందుకోసం తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన జీవో చారిత్రాత్మకమని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. ప్రజల జీవితాలు బాగుపరచాలని చిత్తశుద్ధితో కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలు చేపట్టిందని తెలిపారు. అడుగడుగున బీజేపీ, బీఆర్ఎస్ వ్యతిరేకిస్తూ వచ్చినప్పటికీ తెలంగాణ ప్రభుత్వం ఎక్కడ వెనక్కు తగ్గలేదన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృతంలో ముందుకు వెళ్లామని చెప్పారు.**

న్యూఢిల్లీ : పాత పద్ధతిలోనే ఎన్నికలు వెళ్లాలంటూ హైకోర్టు ఇచ్చిన తీర్పు బాధాకరమని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. బీసీ రిజర్వేషన్ల అంశంలో హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సుప్రీం కోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసినట్లు పేర్కొన్నారు. దిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎస్ఎల్‌పీ గురువారం నాడు విచారణకు వస్తుందని భావిస్తున్నట్లు చెప్పారు. సుప్రీం కోర్టులో తమకు న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆర్డినెన్స్ తీసుకొచ్చి జీవో ఇచ్చి ఎన్నికలకు వెళ్లేందుకు పూర్తి వివరాలతో హైకోర్టులో వాదించామని.. కానీ రాష్ట్ర హైకోర్టు జీవో 9 పై స్టే విధించిందన్నారు. పాత రిజర్వేషన్ల ప్రకారమే ఎన్నికలకు వెళ్లాలని హైకోర్టు తీర్పు ఇవ్వడం బాధాకరమని పీసీసీ చీఫ్ అన్నారు. పూర్తి వివరాలతో హైకోర్టులో వాదించినప్పటికీ స్టే విధించారని తెలిపారు. హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో తెలంగాణ ప్రభుత్వం తరపున ఎస్ఎల్పీ దాఖలు చేశామని.. సీనియర్ న్యాయవాది మిగతా 2లో

**జూబ్లీహిల్స్‌లో బిఆర్ఎస్‌కు**

## గుణపాఠం తప్పదు

**మంత్రి పొన్నం ప్రభాకర్ హెచ్చరిక**



హైదరాబాద్ : జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికలో భారత రాష్ట్ర సమితి గూబ గుయ్యిమనేట్లు ఓటర్లు తీర్పు ఇవ్వబోతున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఈ ఉప ఎన్నికలో ఆ పార్టీ చిరునామా గల్లంతవుతుందని జోస్యం చెప్పారు. 2లో

# రిజర్వేషన్ల ఆశలపై నీళ్లు చల్లారు

**హైకోర్టు ఏకపక్షంగా స్టే ఇచ్చింది**

**బంద్‌తో బిసిల ఆకాంక్షను వెల్లడిస్తాం**

**బంద్ పోస్టర్ ఆవిష్కరణలో ఆర్.కృష్ణయ్య**



హైదరాబాద్ : బీసీల వాదన వినకుండా తెలంగాణ హైకోర్టు ఏకపక్షంగా స్టే ఇచ్చిందని బీసీ రిజర్వేషన్స్ సాధన సమితి కన్వీనర్ ఆర్.కృష్ణయ్య వ్యాఖ్యానించారు. తామంతా రిజర్వేషన్ల కోసం ఎదురు చూస్తున్న తరుణంలో నోటికాడ బుక్క ఎత్తిపోయిందన్నారు. ఇది తమను ఎంతగానో ఆందోళనకు గురిచేసిం దన్నారు. మంగళవారం బీసీ సంఘాల తెలంగాణ బంద్ పోస్టర్స్‌ని ఆర్.కృష్ణయ్య, కోదండరాం, జాజుల శ్రీనివాస్ గౌడ్, బీసీ సంఘాల నేతలు ఆవిష్కరించారు. 2లో



**గ్రూప్-2 విజేతలకు 18న**

## నియామక పత్రాలు

**సిఎం రేవంత్ చేతుల మీదుగా శిల్పకళా వేదికలో అందచేత**

**ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించిన సిఎస్ రామకృష్ణారావు**

హైదరాబాద్ : తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా ఎంపికైన గ్రూప్-2 అభ్యర్థులకు ఈనెల 18 తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిచే నియామక పత్రాలు అందించనున్నట్టు 2లో

## సామాన్యులకు చుక్కలు చూపుతున్న బంగారం

అంతర్జాతీయ పరిణామాలు, పండగల సీజన్ కలిసొచ్చి పసిడి దూసుకెళ్తోంది. హైదరాబాద్‌లో రూ.1.30 లక్షలు దాటి పరుగులు పెడుతోంది.మంగళవారం ఒక్కరోజే తులం రేటు దాదాపు రూ.3,000 ఎగబాకింది. ఫలితంగా తులం బంగారం రూ.1.30 లక్షలు దాటి సరికొత్త రికార్డు సృష్టించింది.మార్కెట్ వర్గాల ప్రకారం.. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో తులం బంగారం ధర రూ.2,720 పెరిగి మునుపెన్నడూ లేనివిధంగా 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,30,830కి ఎగబాకింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,21,150గా ఉంది. ఇక హైదరాబాద్‌లో కిలో వెండి ఒక్కరోజులోనే రూ.3వేలు పెరిగి రూ.1,86,200కి చేరింది. 2025లో బంగారం ధరలు రాకెట్ వేగంతో దూసుకెళ్తున్నాయి. ఈ ఏడాది ఇప్పటికే దాదాపు 50 శాతానికి పైగానే ధరలు పెరిగాయి. 2022తో పోలిస్తే మొత్తం పెరుగుదల 140 శాతానికి చేరుకుంది. ఈ నెల 18న ధనత్రయోదశి వస్తున్నది. ఈ రోజున బంగారం, వెండి కొనుగోళ్లు శుభప్రదమని దేశంలోని మెజారిటీ ప్రజల విశ్వాసం. అయితే మార్కెట్‌లో ఇప్పుడున్న పరిస్థితుల దృష్ట్యా.. అప్పటికల్లా రేట్లు ఇంకా పెరిగిపోవచ్చన్న అంచనాలైతే ఉన్నాయి. ఇదే జరిగితే 24 క్యారెట్ గోల్డ్ 10 గ్రాములు రూ.1,50,000 దాటిపోవచ్చన్న అభిప్రాయాలైతే బలంగా వినిపిస్తున్నాయి. అటు వెండి ధర కూడా భారీగా పెరుగుతోంది. దాదాపు రూ.2 లక్షలకు చేరువైంది. హైదరాబాద్ మార్కెట్‌లో కిలో వెండి ధర రూ.1,85,763గా ఉంది. అంతర్జాతీయ విపణిలోనూ పసిడి ధర విపరీతంగా పెరుగుతోంది. ఔన్సు ధర 4,115 డాలర్లుగా ఉంది. ఔన్సు వెండి ధర 51 డాలర్లు దాటింది. అమెరికా షట్‌డౌన్ ఎత్తివేతపై అనిశ్చితి, యూఎస్-చైనా వాణిజ్య ఉద్రిక్తతలు వంటి పరిణామాలతో బంగారంలో పెట్టుబడులకు మదుపర్లు మొగ్గు చూపుతున్నారు. ఈక్రమంలోనే గోల్డ్ ఈటీఎఫ్‌లకు గిరాకీ విపరీతంగా ఉంటోంది. సెప్టెంబరులో గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్ల (గోల్డ్ ఈటీఎఫ్)లో నిధుల ప్రవాహం పెరిగింది. ఆగస్టులో వీటిలోకి రూ.2,190 కోట్ల పెట్టుబడులు రాగా, సెప్టెంబరులో ఈ మొత్తం నాలుగింతలై రూ.8,363 కోట్లకు చేరింది. మరోవైపు, ధనత్రయోదశితో పాటు రాబోయే పెళ్లిళ్ల సీజన్ నేపథ్యంలో దేశీయ మార్కెట్‌లో పసిడికి మరింత డిమాండ్ ఉంటుందని బులియన్ వర్గాలు అంచనా వేశాయి. వచ్చే ఏడాది ఆరంభం నాటికి బంగారం ధర రూ.1.50 లక్షలకు చేరొచ్చని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు.

## జూబ్లీహిల్స్‌లో బిఆర్ఎస్‌కు గుణపాఠం తప్పదు

పదేళ్లలో ఆ పార్టీ పాలనలో జూబ్లీహిల్స్‌లో ఏం అభివృద్ధి జరిగిందో చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఇప్పటికే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఆ పార్టీని ఓడగొట్టారు. పార్లమెంట్ ఎన్నికల్లో సున్నా సీట్లు ఇచ్చారు. కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో బుద్ధి చెప్పారు. జూబ్లీహిల్స్‌లో దొంగ ఓట్ల నమోదుకు భారత రాష్ట్ర సమితి, భాజపాలదే బాధ్యతని అన్నారు. మాగంటి సునీతతో కన్నీరు పెట్టిస్తూ.. గులాబీ పార్టీ ఓట్లు దండుకోవాలని చూస్తోందని పొన్నం విమర్శించారు. ఈ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ గట్టి బుద్ధి చెప్పబోతున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. గత పదేళ్లుగా ఆ పార్టీ పాలనలో జూబ్లీహిల్స్ నియోజకవర్గం అభివృద్ధి పరంగా ఏ మాత్రం ముందుకు సాగలేదని, ఇప్పుడు ప్రజలే ఆ విఫలతకు తీర్పు ఇవ్వబోతున్నారని అన్నారు. పదేళ్ల పాలనలో అభివృద్ధి పేరుతో ఒక్క రోడ్డు సరిచేయలేని బీఆర్ఎస్ నేతలు ఇప్పుడు ఓట్ల కోసం నటన చేస్తున్నారని ఎద్దేవా చేశారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు ఇప్పటికే ఆ పార్టీకి గట్టి షాక్ ఇచ్చారని గుర్తుచేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్, బీజేపీ రెండు పార్టీలకూ ప్రజలు సరైన పాఠం చెప్పబోతున్నారని ఆయన స్పష్టం చేశారు. ఈసారి ఓటర్లు మోసపోవడం లేదని తీవ్ర విమర్శలు గుప్పించారు.

## బిసి రిజర్వేషన్లు అడ్డుకున్న బిజెపి, బిఆర్ఎస్

రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా తూర్పు నియోజకవర్గంలో సీఎంఆర్ఎఫ్ నిధులు అందించామని స్పష్టం చేశారు. ప్రతి నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ పాఠశాల కోసం రూ.200 కోట్ల నిధులను తమ ప్రభుత్వం కేటాయించిందని ప్రకటించారు మంత్రి కొండా సురేఖ. త్వరలోనే ఇంటిగ్రేటెడ్ పాఠశాలలకి భూమి పూజ చేస్తామని వివరించారు. అర్హులైన లబ్దిదారు లందరికీ రేషన్ కార్డులు అందించామని స్పష్టం చేశారు. త్వరలోనే వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ప్రారంభోత్సవం చేస్తామని వెల్లడించారు. దేశంలో ఎక్కడ లేని విధంగా సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని ఉద్ఘాటించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులకు పెద్దపీట వేశామని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు.

## శ్రీసన్ ఫార్మసీ కంపెనీ లైసెన్సు రద్దు

### తగ్గు మందు మరణాలతో తమిళనాడు నిర్ణయం

చెన్నై,అక్టోబర్14 : శ్రీసన్ ఫార్మసీ కంపెనీ లైసెన్సును తమిళనాడు డ్రగ్స్ కంట్రోల్ శాఖ రద్దు చేసింది. కోల్డ్‌రిఫ్ దగ్గు మందు తయారీ చేస్తున్న ఆ కంపెనీ లైసెన్సును రద్దు చేస్తున్నట్లు డ్రగ్స్ శాఖ వెల్లడించింది. కోల్డ్రిఫ్ దగ్గుమందులో ప్రాణాంతకమైన డైఇథలీన్ గ్లైకాల్ ఉన్నట్లు గుర్తించారు. ఇటీవల మధ్యప్రదేశ్‌లోని చింద్వారా జిల్లాలో 21 మంది చిన్నారుల మృతికి కారణమైన ఆ ప్రాణాంతక ఔషధం ఆ దగ్గుమందులో ఉన్నట్లు గుర్తించారు. తమిళనాడు సర్కారు 2011లో శ్రీసన్ ఫార్మసీ కంపెనీకి దగ్గుమందు తయారీకి లైసెన్సు జారీ చేసింది. 2016లో ఆ లైసెన్సుకు రెన్యూవల్ చేశారు. శ్రీసన్ కంపెనీ లైసెన్సు రద్దు చేసి, దాన్ని పూర్తిగా మూసివేసినట్లు ప్రభుత్వం ఓ ప్రకటనలో తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఇతర డ్రగ్ తయారీ కంపెనీలపై తనిఖీలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. మరో వైపు శ్రీసన్ ఫార్మసిట్యూకల్స్‌తో పాటు కొందరు డ్రగ్ అధికారులపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ సోదాలు చేపట్టింది. మధ్యప్రదేశ్ డ్రగ్స్ కంట్రోల్ శాఖ అక్టోబర్ ఒకటో తేదీన తమిళనాడు అధికారులకు ఆ దగ్గుమందుపై అలర్ట్ జారీ చేసింది. కోల్డ్రిఫ్‌తో పాటు అయిదు రకాల ఉత్పత్తులను చెన్నై ల్యాబ్‌లో పరిశీలించారు. దగ్గు సిరప్‌లో ప్రాణాంతకమైన డీఈజీ ఉన్నట్లు గుర్తించారు. అక్టోబర్ 9వ తేదీన మధ్యప్రదేశ్ పోలీసులు కంపెనీ ఓనర్ రంగనాథన్‌ను అరెస్టు చేశారు. 2023లో సరైన రీతిలో తనిఖీలు నిర్వహించని ఇద్దరు తమిళనాడు డ్రగ్ ఇన్‌స్పెక్టర్లను కూడా సస్పెండ్ చేశారు.

## మాగంటి సునీతపై అనుచిత వ్యాఖ్యలు

### మహిళలకు పొన్నం, తుమ్మల క్షమాపణలు చెప్పాలి

ఎమ్మెల్సీ తాతా మధు డిమాండ్

హైదరాబాద్,అక్టోబరు14 : 'మీరు చనిపోతే మీ భార్యలు ఏడవరా..?' అని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్‌పై ఎమ్మెల్సీ తాతా మధు మండిపడ్డారు. వాళ్లు చనిపోతే వాళ్ల భార్యలు ఏడుస్తారో లేదో మంత్రులే చెప్పాలన్నారు. తెలంగాణ మహిళలకు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఓటమి భయంతో మంత్రులకు, కాంగ్రెస్ పార్టీ నాయకులకు వెన్నులో వణుకుపుడుతోందని అన్నారు. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్ మహిళా లోకాన్ని అవమానించే విధంగా, చిల్లరగా మాట్లాడారని తాతా మధు విమర్శించారు. ఇలాంటి నికృష్టమైన మంత్రులు తెలంగాణలో ఉండటం దురదృష్టకరమన్నారు. ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ చనిపోతే అందరూ సానుభూతి చూపారని, కానీ ఇలా నీచంగా మాట్లాడలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్.. మేయర్ విజయలక్ష్మిని, విజయారెడ్డిని పక్కన పెట్టుకుని మాగంటి సునీతపై కామెంట్స్ చేశారని మధు మండిపడ్డారు. పాలేరు ఉప ఎన్నికల్లో తుమ్మల నాగేశ్వరరావు.. రాంరెడ్డి వెంకట్ రెడ్డి సతీమణి సుచరితపై గెలిచారని గుర్తుచేశారు. ఆడబిడ్డలు, భర్తలు చనిపోయిన వారిని అవమానించే విధంగా మంత్రులు మాట్లాడారని ఆరోపించారు.

# సుప్రీంలో అనుకూల తీర్పు రావచ్చు

అభిషేక్ మను సింఘ్వీతో దాదాపు గంట పాటు చర్చించినట్లు చెప్పారు. అన్ని విషయాలను కూలంకుషంగా చర్చించామన్నారు. గురువారానికి కేసు విచారణకు వచ్చే అవకాశం ఉందని అన్నారు. హైకోర్టు పాత రిజర్వేషన్లతోనే ఎన్నికలకు వెళ్లాలని చెప్పిన నేపథ్యంలో బాధతో సుప్రీంకోర్టుకు వచ్చినట్లు వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వం తరపున సుప్రీంకోర్టులో పిటిషన్ వేశామని.. న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను నిలుపుకునే విధంగా అసెంబ్లీలో బిల్లు పెడితే అన్ని పార్టీలు మద్దతు తెలిపాయని.. కానీ ఇప్పుడు మాట మార్చి బీజేపీ, బీఆర్ఎస్ వ్యతిరేకిస్తున్నాయని మండిపడ్డారు. 42? రిజర్వేషన్లు ఎక్కడా తగ్గకుండా ముందుకు వెళ్తున్నామని.. సుప్రీంకోర్టులో న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నామన్నారు. తమది న్యాయబద్ధమైన కోరిక అని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. కాగా.. సుప్రీంకోర్టులో సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీతో మహేష్ గౌడ్ మంగళవారం భేటీ అయ్యారు. 42 శాతం రిజర్వేషన్లపై ప్రభుత్వం తరఫున గట్టి వాదనలు వినిపించాలని సీనియర్ న్యాయవాదిని మహేష్ కుమార్ గౌడ్ కోరారు.

## రిజర్వేషన్ల ఆశలపై నీళ్లు చల్లారు

ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మీడియాతో మాట్లాడారు. బీసీ రిజర్వేషన్స్‌పై హైకోర్టు స్టే ఇవ్వడంతో న్యాయం జరుగలేదని పేర్కొన్నారు. హైకోర్టు స్టే ఇచ్చి బీసీల నోటికాడి ముద్దను లాక్కుందని విమర్శించారు. బీసీలకు అవమానం, అన్యాయం జరిగిందని ఆర్.కృష్ణయ్య ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ సంఘాలు చెప్పిన అంశాలు ఆమోదయోగ్యంగా ఉన్నాయని టీజేఎస్ అధ్యక్షులు, ప్రొఫెసర్ కోదండరాం తెలిపారు. బీసీ బంద్‌కి ఇప్పటికే సంపూర్ణ మద్దతు ప్రకటించామని కోదండరాం పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్స్‌ని అడ్డుకోవద్దని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ కోరారు. ఈ నెల 18వ తేదీన నిర్వహించే తెలంగాణ బంద్‌కి సంపూర్ణ మద్దతు తెలపాలని బీసీ జేఏసీ తెలంగాణ జన సమితి నేతలు తమ కార్యాలయానికి వచ్చి అడిగారని తెలిపారు. తమ కంటే ముందే బంద్‌కి కోదండరాం సంపూర్ణ మద్దతు తెలిపారని గుర్తుచేశారు. కోదండరాం మద్దతుతో బంద్ వందశాతం సక్సెస్ అయినట్లేనని చెప్పుకొచ్చారు. తెలంగాణ ఉద్యమాన్ని నడిపించిన నాయకుడు కోదండరాం అని ప్రశంసించారు. తెలంగాణలోని రెండున్నర కోట్ల బీసీల హక్కుల కోసం ఈ బంద్ చేస్తున్నట్లు వివరించారు. తెలంగాణ సమాజం ఈ బంద్‌లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కులగణన చేపట్టిందని గుర్తుచేశారు. తెలంగాణ అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్స్ కోసం బిల్లు రూపకల్పన చేశారని జాజుల శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. బీసీల నోటికాడి ముద్దను కొంతమంది లాక్కుంటున్నారని ఆరోపించారు. బీసీ రిజర్వేషన్స్ వ్యతిరేకులారా.. జనాభా దామాషా ప్రకారం తమ వాటా తమకు కావాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని సూచించారు. అఖిల పక్షాన్ని రాష్ట్రపతి, ప్రధానిని కల్పించాలని కోరారు. రాష్ట్రపతి, ప్రధాని అపాయింట్‌మెంట్ ఇవ్వకపోతే.. వారి ఇళ్ల ముందు ధర్నా చేపట్టాలని జాజుల శ్రీనివాస్ గౌడ్ సూచించారు.

## ఆనాడు హైదరాబాద్‌కు మైక్రోసాఫ్ట్ ఇప్పుడు విశాఖకు గూగుల్

విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటులో ప్రధాని మోదీ కీలకంగా వ్యవహరించారు. ప్రధానితో పాటు కేంద్రమంత్రులు అశ్వినీ వైష్ణవ్, నిర్మలా సీతారామన్‌కు ధన్యవాదాలు తెలిపారు. గూగుల్ డేటా సెంటర్‌ను విశాఖకు తీసుకురావడంలో లోకేశ్ ప్రధాన పాత్ర పోషించారు. హైదరాబాద్‌లో హైటెక్ సిటీ నిర్మాణం, ఐటీ రంగాన్ని ప్రోత్సహించా. ఐటీతో చాలా కాలంగా అనుసంధానమై ఉన్నా. రియల్‌టైమ్ డేటా, హిస్టారికల్ డేటా సాయంతో వేగంగా నిర్ణయాలు తీసుకునేందుకు అవకాశం కలుగుతుంది. ఇతర దేశాలతో పోలిస్తే టెక్నాలజీని అందిపుచ్చుకోవడంలో భారత్ ప్రత్యేకం. వన్ ఫ్యామిలీ-వన్ ఎంటర్‌ప్రెన్యూర్ ద్వారా రాష్ట్రంలో పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం అందిస్తాం. ప్రతి కుటుంబానికి ఏఐని దగ్గరచేసేలా ప్రయత్నిస్తాం అని చంద్రబాబు అన్నారు. ముఖ్యంగా ప్రధాని మోదీ మద్దతుతో ఇది సాధ్యం అయ్యిందన్నారు. తాను చూసిన ప్రధాన మంత్రులలో మోదీ ప్రత్యేకమన్నారు. విజినరీ, ఆలోచన తీరు, నిర్ణయాలు తీసుకోవడంలో ఆయనను ఎవరూ అందుకోలేరని కొనియాడారు. ప్రధాని సారథ్యంలో 2047 కంటే ముందుగానే భారత దేశం అభివృద్ధి చెందిన దేశంగా అవతరిస్తుందని స్పష్టం చేశారు. కేంద్ర ఆర్థికమంత్రి నిర్మల సీతారామన్ , కేంద్ర ఐటీ మంత్రి అశ్విని వైష్ణవ్ సహకారం అందించారన్నారు. విశాఖపట్నానికి గూగుల్ రావడంతో విప్లవాత్మక మార్పులు వస్తాయని తెలిపారు. గూగుల్ డాటా సెంటర్‌కు అన్ని విధాల ఏపీ ప్రభుత్వం సహకరిస్తుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఐటీ రంగంలో అనేక మార్పులు వస్తాయని... పలు కంపెనీలు గూగుల్ బాటలో పయనించే అవకాశం ఉందన్నారు. నైతిక విలువలతో కూడిన ఏఐ టెక్నాలజీ అవసరమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. కొత్త ఆవిష్కరణలు అందిపుచ్చుకోవడంలో చంద్రబాబు ప్రభుత్వం ముందంజలో ఉందని కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీ దూరదృష్టితో అనేక సంస్కరణలు వచ్చాయని చెప్పారు. కొత్త ఆవిష్కరణలను అందిపుచ్చుకోవడంలో చంద్రబాబు ప్రభుత్వం ముందుందన్నారు. అభివృద్ధి చెందిన దేశంగా భారత్‌ను 2047నాటికి సగర్వంగా నిలబెట్టాలన్న కల సాకారమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సాంకేతికత ప్రపంచాన్నే మార్చేస్తోందని మరో కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ అన్నారు. ఈ రంగంలో ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని చెప్పారు. నైపుణ్యం ఉన్న యువతకు మరిన్ని అవకాశాలు రాబోతున్నాయన్నారు.

## గ్రూప్-2 విజేతలకు 18న నియామక పత్రాలు

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు వెల్లడించారు. 18 తేదీ సాయంత్రం శిల్పకళా వేదికలో నిర్వహించనున్న ఈ కార్యక్రమం ఏర్పాట్లపై సంబంధిత ఉన్నతాధికారులతో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మంగళవారం సి.ఎస్. సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రూప్-2 ద్వారా ఎంపికైన 783 మంది అభ్యర్థులకు రాష్ట్ర ముఖ్యమంత్రి నియామక పత్రాలు అందిస్తారని తెలిపారు. వీరిలో దాదాపు 16 శాఖలకు చెందిన అభ్యర్థులు ఉన్నారని. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులందరినీ ఆహ్వానిస్తున్నట్లు సి.ఎస్ తెలిపారు. ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన కార్యక్రమం త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమానికి అభ్యర్థితో పాటు వారి కుటుంబ సభ్యులను సాయంత్రం 4 గంటల లోపు శిల్పకళా వేదికలో అనుమతించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ నియామకాల్లో అత్యధికంగా, సాధారణ పరిపాలన, రెవిన్యూ, వాణిజ్య పన్నుల శాఖ, ఎక్సైజ్ శాఖ, పంచాయతీరాజ్ శాఖలకు చెందిన వారే అధికంగా ఉన్నందున, రెవిన్యూ, హోం, జిఎడి కార్యదర్శులు ఈ కార్యక్రమ నిర్వహణలో సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలని సి.ఎస్. ఆదేశించారు. నియామక పత్రాలు పొందే అభ్యర్థులు రాబోయే 30 సంవత్సరాలలో సర్వీస్ లో ఉంటారు కాబట్టి, వీరికి ప్రభుత్వ సర్వీస్ పట్ల ఉన్నత భావన కలిగేలా కార్యక్రమాన్ని నిర్వహించాలని అందుకు తగు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో డీజీపీ శివధర్ రెడ్డి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ముఖ్య కార్యదర్శులు బెనహర్ మహేష్ దత్ ఎక్కా, రిజ్వి, సందీప్ కుమార్ సుల్తానియా, కార్యదర్శులు లోకేష్ కుమార్, టీకే శ్రీదేవి, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్, సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ప్రియాంక తదితర అధికారులు పాల్గొన్నారు.

## హర్యానా కొత్త డీజీపీగా ఓం ప్రకాశ్ సింగ్

### తాత్కాలిక బాధ్యతలు అప్పగించిన ప్రభుత్వం

చండీఘుడ్,అక్టోబర్14 : హర్యానా కొత్త డీజీపీగా ఓం ప్రకాశ్ సింగ్‌ను ఆ రాష్ట్ర ప్రభుత్వం తాత్కాలికంగా నియమించింది. ప్రస్తుతం హర్యానా పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఏండీగా ఓం ప్రకాశ్ సింగ్ విధులు నిర్వహిస్తున్నారు. ఆయనకు రాష్ట్ర డీజీపీగా అదనపు బాధ్యతలను అప్పగించింది. ఈ మేరకు హర్యానా ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఉన్నతాధికారులు కుల వివక్ష, అవమానాలు, వేధింపులు తట్టుకో లేక హర్యానా కేడర్‌కు చెందిన సీనియర్ ఐపీఎస్ అధికారి పూరన్ కుమార్ ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే. ఆయన.. తన సూసైడ్ నోట్‌లో హర్యానా డీజీపీ శత్రుజీత్ కపూర్, రోహ్‌తక్ ఎస్పీ బిజార్ణియా సహా 8 మంది సీనియర్ ఐపీఎస్ అధికారుల పేర్లు రాశారు. వారి వేధింపులే తన ఈ ఆత్మహత్యకు కారణమంటూ ఆయన రాసిన లేఖలో స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ఈ వ్యవహారంలో రాష్ట్ర ప్రభుత్వంపై ప్రతిపక్షాల నుంచే కాకుండా.. పూరన్ కుమార్ కుటుంబం నుంచి తీవ్ర ఒత్తిడి పెరిగింది. దాంతో రోహ్‌తక్ ఎస్పీ బిజార్ణియాపై ప్రభుత్వం ఇప్పటికే బదిలీ వేటు వేసింది. అలాగే డీజీపీ శత్రుజీత్ కపూర్‌ను సెలవుపై ప్రభుత్వం పంపించింది. దీంతో కొత్త డీజీపీగా తాత్కాలిక నియామకం అనివార్యమైంది. వైపు అక్టోబర్ 7వ తేదీన ఆత్మహత్య చేసుకున్న పూరన్ కుమార్ కుటుంబం.. తమకు న్యాయం చేయాలంటూ దేశ రాజధాని న్యూఢిల్లీలోని ప్రముఖ రాజకీయ పార్టీల అధినేతలతో వరుస భేటీ అవుతుంది. ఈ ఆత్మహత్య కేసును నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని.. అలాగే పూరన్ కుమార్ మరణించే ముందు పేర్కొన్న ఉన్నతాధికారులను కఠినంగా శిక్షించాలని ఆ కుటుంబం కోరుతుంది. పూరన్ కుమార్ భార్య అమ్నేతి కుమార్.. అదే రాష్ట్రంలో సీనియర్ ఐఏఎస్ అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. పూరన్ కుమార్ ఆత్మహత్య చేసుకున్ సమయంలో.. హర్యానా ముఖ్యమంత్రి నయిబ్ సింగ్ సైనీ సారథ్యంలోని ఉన్నతాధికారి బృందం విదేశాల్లో పర్యటిస్తుంది.

## రిజర్వేషన్లు బిసిల హక్కు

హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రిజర్వేషన్ల సాధన కోసం ప్రొఫెసర్ పీఎల్. విశ్వేశ్వర్‌రావు నేతృత్వంలో ఒక సబ్ కమిటీ ఏర్పాటు చేశామన్నారు. ఇతర సంఘాలతో కలిసి ఈ కమిటీ కృషి చేస్తుందన్నారు. రిజర్వేషన్ల అంశంపై కొన్ని పార్టీలు ద్వంద వైఖరి అవలంబిస్తున్నాయి. కేసులు వేసిన వ్యక్తులకు మద్దతు తెలుపుతూ.. బీసీలకు అన్యాయం జరిగిందని ప్రచారం చేస్తున్నాయి. తెజసకి రెండు నాలుకల ధోరణి లేదు. 42 శాతం బీసీ రిజర్వేషన్లకు సంపూర్ణ మద్దతు తెలుపుతుంది. కేంద్రంపైన ఒత్తిడి తీసుకొచ్చి బీసీ బిల్లును ఆమోదించేందుకే మా పోరాటం అని అన్నారు. బీసీ రిజర్వేషన్ల సాధన కోసం ర్యాలీలు, సమావేశాలు, ధర్నాలు నిర్వహిస్తామని తెజస ఉపాధ్యక్షుడు పీఎల్. విశ్వేశ్వర్‌రావు అన్నారు. సుప్రీం కోర్టులో న్యాయపరంగా పోరాటం చేస్తామన్నారు. 16న గవర్నర్‌ను కలిసి వినతి పత్రం అందజేస్తామని చెప్పారు. ఈ సందర్భంగా బీసీ రిజర్వేషన్లపై తెజస పలు తీర్మానాలు చేసింది. బీసీ సంఘాలు 18న నిర్వహించే బంద్‌కు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించింది. మరోవైపు బీసీ రిజర్వేషన్లపై కోర్టు స్టే ఇవ్వడంలో న్యాయం లేదని ఎంపీ, బీసీ రిజర్వేషన్ల సాధన సమితి కన్వీనర్ ఆర్. కృష్ణయ్య తెలిపారు. స్టే ఇవ్వడం ద్వారా బీసీల నోటికాడ ముద్దను లాక్కుందని వ్యాఖ్యానించారు. బీసీల వాదన వినకుండా కోర్టు ఏకపక్షంగా స్టే ఇచ్చిందన్నారు.

## కదులుతున్న బస్సులో మంటలు

బస్సులోంచి దట్టమైన పొగలు రావడంతో డ్రైవరు వెంటనే బస్సులు నిలిపివేశారు. నేషనల్ హైవేపై బస్సు వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకోవడంతో కిలోమీటర్ల వరకూ వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో సమీపంలోని అర్మీ సిబ్బంది అక్కడకు చేరుకుని సహాయక కార్యక్రమాలు చేపట్టారు. అగ్నిమాపక శకటాలు రంగంలోకి దిగి చుట్టుపక్కలకు మంటలు విస్తరించకుండా వెంటనే అదుపులోనికి తెచ్చాయి. ఈ ప్రమాదంలో బస్సు పూర్తిగా కాలిపోయింది. అయితే అగ్నిప్రమాదానికి కారణం ఏమిటనేది వెంటనే తెలియలేదు.

## తుమ్మల, పొన్నంలకు మానవత్వం ఉందా

గోపన్న అమర్ రహే అంటుంటే, తన భర్త గోపినాథ్‌ను గుర్తు చేసుకొని మాగంటి సునీత ఏడుస్తుంటే డ్రామా అంటారా తుమ్మల నాగేశ్వరరావు? కమ్మ సామాజిక వర్గం ఓటు వేస్తే గెలిచిన తుమ్మల, అదే వర్గానికి చెందిన నేత గోపినాథ్ సతీమణిని డ్రామా అంటారా? అని ప్రశ్నించారు. మాగంటి సునీతకు మంత్రుల వ్యాఖ్యలు తీవ్ర మనస్తాపం కలిగించాయని, వారు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మంత్రుల మాటలను తెలంగాణ ఆడబిడ్డలు గమనించాలి అని ఆయన వ్యాఖ్యానించారు. యువకుడు..అలాగే, ప్రెస్ మీట్ సమయంలో మేయర్ గద్వాల విజయలక్ష్మి మంత్రుల పక్కనే కూర్చున్నా, ఆడబిడ్డ అవమానింపబడుతుండగా మౌనంగా ఉన్నారని గౌడ్ విమర్శించారు. రాజీవ్ గాంధీ చనిపోయినప్పుడు పార్టీలకతీతంగా అందరం బాధ పడ్డామని, ఇప్పుడు మాగంటి సునీత తన భర్తను గుర్తుచేసుకొని ఏడుస్తుంటే దాన్ని డ్రామా అంటారా? ఇది సిగ్గుచేటు అని మండిపడ్డారు. మాగంటి సునీత భావాలను దెబ్బతీసిన మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్‌లు వెంటనే క్షమాపణ చెప్పాలని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు.

## బనకచర్లపై ఎపిని నిరోధించండి

పోలవరం - బనకచర్ల విషయంలో ఏపీ ముందుకెళ్లకుండా నిలువరించాలని కోరారు. టెండర్, భూసేకరణ విషయంలో ముందుకెళ్లకుండా చూడాలని కోరారు.

# విశాఖలో గూగుల్ సెంటర్

### వికసిత భారత్ లక్ష్యాలకు తార్కాణం

### సుందర్ పిచాయ్‌కు మోడీ అభినందనలు

న్యూఢిల్లీ,అక్టోబర్14 : విశాఖపట్నంలో 1 గిగావాట్ హైపర్ స్కేల్ డేటా సెంటర్ ఏర్పాటుపై ప్రధాని నరేంద్రమోదీ హర్షం వ్యక్తంచేశారు. ఈ సెంటర్‌కు సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, గూగుల్ మధ్య జరిగిన చారిత్రక ఒప్పందంపై మోదీతో ఆ సంస్థ సీఈఓ సుందర్ పిచాయ్ ఫోన్‌లో మాట్లాడారు. ఈ విషయాన్ని వెల్లడిస్తూ పిచాయ్ చేసిన పోస్ట్‌కు ప్రధాని బదులిచ్చారు. గిగా సెంటర్ ఏర్పాటు వికసిత్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా ఉంది. ఈ ఏఐ హబ్ బలమైన శక్తిగా పనిచేస్తుంది. దీనిద్వారా ప్రజలందరికీ కృత్రిమ మేధ అందుబాటులోకి రానుంది. మన డిజిటల్ ఎకానమీకి మరింత ఊపునిస్తుంది. గ్లోబల్ టెక్నాలజీ లీడర్‌గా భారత స్థానం మరింత సుస్థిరమవుతుందని ప్రధాని మోదీ విశ్వాసం వ్యక్తంచేశారు. దీనికి ముందు పిచాయ్ స్పందిస్తూ.. విశాఖపట్నంలో గూగుల్ తొలి ఏఐ హబ్‌కు సంబంధించిన ప్రణాళికలను పంచు కునేందుకు ప్రధానితో మాట్లాడానని, ఈ ఏఐ హబ్ ఓ కీలక మైలురాయిగా నిలవనుందని అన్నారు. ఇదొక చిరస్మరణీయమైన రోజు.




విశాఖలో దేశంలోనే అతిపెద్ద ఏఐ డేటా సెంటర్ క్యాంపస్ నిర్మాణం కోసం గూగుల్‌తో భాగస్వామ్యం కుదుర్చుకోవడం, ఏఐ విప్లవంలో భాగం కావడం గర్వంగా ఉంది. ఈ పెట్టుబడులు హెల్త్‌కేర్, వ్యవసాయం, లాజిస్టిక్స్, ఫైనాన్స్ వంటి రంగాల్లో వేగవంతమైన ఏఐ ఆధారిత పరిష్కారాల కోసం తగిన వ్యవస్థను సృష్టిస్తుంది. సంక్లిష్ట సవాళ్లను పరిష్కరించడంలో తగిన తోడ్పాటు లభిస్తుందని గౌతమ్ అదానీ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. దిల్లీ వేదికగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, గూగుల్ మధ్య మంగళవారం ఈ ఒప్పందం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఐటీ, కమ్యూనికేషన్ల శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్, గూగుల్ క్లౌడ్ సీఈఓ థామస్ కురియన్ తదితరులు పాల్గొన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా గూగుల్ రానున్న ఐదేళ్లలో సుమారు 15 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టనుంది. భారత్‌లో ఈ కంపెనీకి ఇదే అతిపెద్ద పెట్టుబడి కావడం విశేషం.

# గురుకులాలకు గ్రీన్ ఛానెల్‌లో నిధులు

## రేవంత్ మాటలు నమ్మశక్యంగా లేవు

## మాజీమంత్రి హరీష్ రావు విమర్శలు




హైదరాబాద్,అక్టోబరు14 : గురుకులాలకు గ్రీన్ ఛానెల్‌లో నిధులు విడుదల చేస్తామన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాటలు నీటి మూటలేనా..? అని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ప్రశ్నించారు. కమిషన్‌లు రావనే ఆయన గురుకులాలకు నిధులు కేటాయించడం లేదా..? అని విమర్శించారు. హామీలతో మభ్యపెట్టడం, ఆ తర్వాత మాట మార్చడమే రేవంత్ అనుసరిస్తున్న సిద్దాంతమా..? అని నిలదీశారు. ఈ మేరకు హరీశ్‌రావు ఎక్స్ ఖాతాలో ఒక పోస్టు పెట్టారు. 'రేవంత్ రెడ్డి మాటలకు, చేతలకు పొంతన ఉండదనడానికి గురుకులాలకు కేటాయించిన చాలీచాలని నిధులే ఉదాహరణ. రాష్ట్రంలోని 1024 గురుకులాలకు కేవలం రూ.60 కోట్లు కేటాయించి, గోరంతను కొండంతగా చెప్పుకోవడం సిగ్గుచేటు. రూ.12 వేల కోట్లతో యంగ్ ఇండియా సమీకృత గురుకులాలు ఏర్పాటు చేస్తామని ప్రచారం చేసుకుంటున్న రేవంత్ రెడ్డికి ఆరున్నర లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ బిడ్డలు చదివే గురుకులాలకు కనీసం రూ.100 కోట్లు కేటాయించే మనసు లేదా..?' అని ప్రశ్నించారు. 'కమిషన్లు రావనే గురుకులాలకు నిధులు కేటాయించడం లేదా? మీరు కేటాయించిన చాలీచాలని నిధులతో సిబ్బంది వేతనాలు, మోటార్ల మరమ్మతులు, అత్యవసర పనులు ఎలా సాధ్యం? చిత్తశుద్ధిలేని సమీక్షలతో గురుకులాలకు ఏం ప్రయోజనం? ఒకవైపు సమస్యల వలయంలో గురుకులాలు కొట్టుమిట్టాడుతుంటే తూతూమంత్రంగా సమీక్ష నిర్వహించడం దుర్మార్గం. గురుకులాలకు నిత్యావసరాలు సరఫరా చేసే కాంట్రాక్టర్లకు ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న బిల్లులు ఎప్పుడు చెల్లిస్తారు? పెండింగ్ లో ఉన్న మెస్ చార్జీలు, కాస్మోటిక్ ఛార్జీలు, స్టిచ్చింగ్ ఛార్జీలు ఎప్పుడిస్తారు? అ÷-దదె భవనాల్లో కొనసాగుతున్న గురుకులాలకు అ÷-దదె బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారు? నెలలుగా పెండింగ్‌లో ఉన్న తాత్కాలిక సిబ్బంది వేతనాలు ఎప్పుడిస్తారు?' అని హరీశ్‌రావు నిలదీశారు. గురుకులాల మీద ప్రభుత్వానికి పట్టింపు ఉంటే విద్యార్థులు ఎందుకు నిరసనలు తెలియజేస్తున్నారు? బడిబాట పట్టాల్సిన విద్యార్థులను, ఆందోళన బాట పట్టించింది కాంగ్రెస్ ప్రభుత్వం. రేవంత్ రెడ్డీ మీ 22 నెలల పాలనలో గురుకులాల ఖ్యాతిని దిగజార్చారు. విష వలయాలుగా మార్చారు. అపఖ్యాతిని మూటగట్టుకున్నారు' అని మండిపడ్డారు. 22 నెలలుగా గురుకులాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికై అవసరమైన నిధులు విడుదల చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

# పూరన్ ఆత్మహత్యపై సత్వర దర్యాప్తు

## పూరన్ కుటుంబ సభ్యులకు రాహుల్ పరామర్శ

చండీఘడ్,అక్టోబర్14 : హరియాణాలోని సీనియర్ ఐపీఎస్ అధికారి పూరన్ కుమార్ ఆత్మహత్యకు కారణమైన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన పూరన్ కుమార్ కుటుంబాన్ని కలిశారు. ఈ సందర్భంగా పూరన్‌కు నివాళులర్పించిన ఆయన.. బాధిత కుటుంబానికి సానుభూతి తెలిపారు. అనంతరం రాహుల్ విలేకరులతో మాట్లాడుతూ..ప్రభుత్వాధికారిపై ఇలాంటి వివక్ష చోటుచేసుకోవడం విషాదకరమన్నారు. ఈ కేసుకు సంబంధించి స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా విచారణ జరుపుతామని స్వయంగా హరియాణా ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీ హామీ ఇచ్చారన్నారు. కానీ, రోజులు గడుస్తున్నా.. అది నెరవేరటం లేదని విమర్శించారు. తండ్రిని పోగొట్టుకున్న పూరన్‌కుమార్ ఇద్దరు పిల్లలు చాలా ఒత్తిడిలో ఉన్నారన్నారు. పూరన్ కుమార్ కెరీర్‌ను, ప్రతిష్ఠను దెబ్బతీసేందుకే ఇతర అధికారులు సంవత్సరాలుగా వివక్ష కొనసాగిం చారని స్పష్టంగా తెలుస్తోందన్నారు. ఇది కేవలం ఒక దళిత కుటుంబానికి సంబంధించినది కాదని, దేశంలోని కోట్లాది మంది దళితులకు సంబంధించినదని రాహుల్ వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ఐపీఎస్ అధికారిపై జరిగిన వివక్ష దళితులుగా ఎంత విజయం సాధించినా.. అణచివేత తప్పదనే తప్పుడు సందేశం వారికి వెళ్లేలా చేస్తుందన్నారు. పూరన్ కుమార్ ఆత్మహత్యకు కారకులైన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రధాని మోదీ, సీఎంలను డిమాండ్ చేశారు. బాధిత కుటుంబంపై ఉన్న ఒత్తిడిని తొలగించాలన్నారు. ఇక, ఈ కేసుకు సంబంధించి వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న డీజీపీ శత్రుజీత్ కపూర్‌ను రాష్ట్ర ప్రభుత్వం సెలవుపై పంపించిన సంగతి తెలిసిందే. బ్యూరోక్రసీ, పోలీస్ వ్యవస్థలో కుల వివక్ష ఉందనే ఆరోపణలు మరోసారి తెరపైకి వచ్చాయి. ఆయన ఆత్మహత్యపై తక్షణం స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా దర్యాప్తు జరపాలని, ఇందుకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని హరియాణా ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి విజ్ఞప్తి చేశారు. ఇది కేవలం ఐపీఎస్ అధికారి కుటుంబానికి సంబంధించినదని కాదని, కోట్లాది దళితుల ఆత్మ గౌరవానికి సంబంధించినదని అన్నారు. పూరన్ కుమార్ అక్టోబర్ 7న రివాల్వర్‌తో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఎనిమిది పేజీల సూసైడ్ నోట్‌లో హర్యానా డీజీపీ శత్రుజీత్ కపూర్, రోహ్‌తక్ ఎస్పీ నరేంద్ర బిజర్నియాతో సహా పలువురు పేర్లు ఆయన ప్రస్తావించారు. కుల వివక్ష, మానసిక వేధింపులు, పబ్లిక్‌లో అవమానించడం వంటి చర్యలకు వీరు పాల్పడ్డారని ఆరోపించారు.



## తాలిబన్ నేతను

# ఎలా స్వాగతిస్తారు

## ఎక్స్ వేదికగా మండిపడ్డ జావేద్ అఖ్తర్

న్యూఢిల్లీ,అక్టోబరు14 : అఫ్ఘానిస్తాన్ విదేశాంగ మంత్రి, సీనియర్ తాలిబాన్ నాయకుడు అమీర్ ఖాన్ ముత్తకీ భారత పర్యటన సందర్భంగా ఆయనకు లభించిన ఆదరణపై దిగ్గజ బాలీవుడ్ గేయరచయిత జావెద్ అఖ్తర్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. సోషల్ మీడియా వేదికగా స్పందించిన ఆయన.. ప్రపంచంలోనే అత్యంత దారుణమైన ఉగ్రవాద సంస్థగా పేరొందిన తాలిబాన్ ప్రతినిధికి ఉగ్రవాదాన్ని వ్యతిరేకిస్తామని ఉపన్యాసాలు ఇచ్చే బీజేపీ ప్రభుత్వం అందిస్తున్న గౌరవం, స్వాగతం చూస్తుంటే సిగ్గుతో తన తల వాలిపోతుందని జావేద్ తెలిపాడు. అలాగే ఉత్తరప్రదేశ్‌లోని దారుల్ ఉలూమ్ దియోబంద్ ఇస్లామిక్ సెమినరీలో ముత్తకీకి అందించిన గౌరవప్రదమైన స్వాగతంపై కూడా అఖ్తర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అమ్మాయిల విద్యను పూర్తిగా నిషేధించిన వ్యక్తులలో ఒకరైన తమ ఇస్లామిక్ హీరోకు ఇంతటి గౌరవం ఇచ్చిన దియోబంద్‌కు కూడా సిగ్గుండాలి అని ఆయన ఘాటుగా విమర్శించారు. చివరగా, 'నా భారతీయ సోదరీ సోదరులారా! మన దేశంలో ఏం జరుగుతోంది? అంటూ ఆందోళన వ్యక్తం చేశారు. కాగా, ఈ పోస్ట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది.

# డిగ్రీ సెమిష్టర్ ఫీజులు తగ్గించాలి

## కెయూలో విద్యార్థుల ఆందోళన

హనుమకొండ,అక్టోబరు14 : కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, అదిలాబాద్ జిల్లాలలో చదువుతున్న డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థులకు పెంచిన మొదటి సెమిస్టర్ ఫీజులను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు కేయూలో ఆందోళన చేపట్టారు. కేయూ పరిపాలన భవనం ఎదుట బైఠాయించి అధికారులకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. యూనివర్సిటీ ఇచ్చిన ఫీజు పట్టికను అనుసరించకుండా అధిక ఫీజులు తీసుకుంటున్న ప్రైవేటు డిగ్రీ కాలేజీపై చర్యలు తీసుకోవాలని డెమొక్రటిక్ స్టూడెంట్స్?అసోసియేషన్(డీఎస్ఏ) డీఎస్ఏ జిల్లా కన్వీనర్ ఉప్పుల శివ డిమాండ్ చేశారు. కాకతీయ యూనివర్సిటీ విడుదల చేసిన మొదటి సెమిస్టర్ ఫీజు ప్రకటనలో భారీగా మార్పులు జరిగాయని విద్యార్థుల తల్లిదండ్రులు పేద మధ్యతరగతి కుటుంబాలని వారు పొద్దున లేస్తే ఎర్రని ఎండలో పనిచేస్తూ వాళ్ల పిల్లలు బాగా చదువుకోవాలని ఆశతో డిగ్రీలు చదివిస్తుంటే యూనివర్సిటీ అధికారులు మాత్రం ఏమాత్రం కనికరం లేకుండా భారీగా ఫీజులు పెంచుతుంటే పేద కుటుంబాల విద్యార్థులు ఎలా చదువుకోవాలని ప్రశ్నించారు. ఇంతకుముందు ఉన్న రిజిస్ట్రేషన్ ఫీజు రూ.80 ఇప్పుడు ఏకంగా రూ.1200 పెంచడం సిగ్గుచేటని, వివిధ రకాల పేర్లతో మొత్తం ఫీజు విద్యార్థులు కట్టాల్సింది రూ.1340 కానీ ఇప్పుడు రూ.3250 పెంచడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. వెంటనే పెంచిన ఫీజులు మొత్తం తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డెమోక్రటిక్ స్టూడెంట్స్ అసోసియేషన్ జిల్లా నాయకులు సంజయ్, జాషువా రాజ్‌కుమార్, శశిధర్, శ్రీధర్, డిగ్రీ విద్యార్థులు పాల్గొన్నారు.

# గాడిద చర్మం నుంచి ఔషధాల తయారీ

## పాక్ నుంచి 2వేల గాడిదలు కొన్న చైనా

లాహోర్,అక్టోబరు14 : చైనా తాజాగా పాకిస్థాన్ నుంచి రెండు వేల గాడిదలను కొనుగోలు చేసింది. పాకిస్థాన్ నుంచి చైనా అత్యధికంగా గాడిదలను దిగుమతి చేసుకుంటోంది. ఈ నేపథ్యంలో 2024లో ఈ రెండు దేశాల మధ్య డీల్ కుదిరింది. ఈ డీల్ ప్రకారం చైనాకు పాకిస్థాన్ 20 వేల గాడిదలను ఎగుమతి చేయాలి. ఈ నేపథ్యంలో పాకిస్థాన్‌లోని కరాచీ పోర్ట్‌కు సమీపంలో ఓ భారీ కబేళాను నిర్మించాలని చైనా భావిస్తోంది. పాకిస్థాన్‌లో ప్రస్తుతం 52 లక్షల గాడిదలు ఉన్నాయి. ప్రపంచంలో అత్యధిక గాడిదలను కలిగిన మూడో దేశంగా పాకిస్థాన్ ఉంది. ఈ నేపథ్యంలో పాకిస్థాన్ గాడిదలను దిగుమతి చేసుకునేందుకు చైనా గతేడాది ఒప్పందం కుదుర్చుకుంది. గాడిద చర్మంతో చైనాలో సాంప్రదాయ ఔషధాలను తయారు చేస్తారు. గాడిద చర్మాన్ని ఉపయోగించి ఎజియావో అనే సాంప్రదాయ ఔషధాన్ని చైనీయులు తయారు చేస్తారు. ఈ ఔషధం రోగనిరోధక శక్తిని మెరుగుపరచడానికి, అలసట, కణితులను తగ్గించడానికి, రక్తహీనత చికిత్సకు సాయపడుతుందని చైనీయులు నమ్ముతారు. ఎజియావో ఔషధానికి చైనాలో భారీ డిమాండ్ ఉంది . అయితే ఈ ఔషధ తయారీకి తగినన్ని గాడిదలు చైనాలో లేవు. దీంతో గాడిదల కోసం పాకిస్థాన్‌పై ఆధారపడుతున్నారు. అయితే చైనా డీల్ కారణంగా పాక్‌లో గాడిదలకు విపరీతమైన డిమాండ్ పెరిగిందని సమాచారం. ఐదేళ్ల క్రితం ఒక్కో గాడిద ఖరీదు రూ.30 వేలుగా ఉండేదట. ప్రస్తుతం పాక్‌లో ఒక్కో గాడిద ఖరీదు రూ.2 లక్షలకు పైగా పలుకుతోందట. దీంతో గాడిదలను ఉపయోగించి పనులు చేసుకుని పాక్ వాసులు కష్టాలు పడుతున్నారట.

# తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసు

## అడిగిన సమాచారం ఇవ్వాల్సిందే

## ప్రధాన నిందితుడు ప్రభాకర్ రావుకు సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ,అక్టోబరు14 : తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. సిట్ అధికారులు అడిగిన సమాచారం ప్రధాన నిందితుడు ప్రభాకర్ రావు ఇవ్వాల్సిందేనని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ కేసులో క్లౌడ్, యాపిల్ క్లౌడ్ సమాచారం ఇవ్వాల్సిందేనని స్పష్టం చేసింది. యూజర్, పాస్‌వర్డ్‌ల సమాచారం ఇవ్వాలని జస్టిస్ నాగరత్న ధర్మాసనం ఆదేశించింది. ఫోరెన్సిక్ నిపుణుల సమక్షంలో సమాచారం తీసుకోవాలని సిట్‌కు సూచించింది. సమాచారం చెరిపేందుకు యత్నించినట్లు తేలితే తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకుంటామని కోర్టు పేర్కొంది. ఈ మేరకు ఈ కేసులో ప్రధాన నిందితుడు, మాజీ డీఎస్పీ ప్రభాకర్ రావు సిట్ అధికారులు కోరిన సమాచారాన్ని తప్పనిసరిగా అందించాలంటూ సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. జస్టిస్ నాగరత్న ధర్మాసనం ఈ ఆదేశాలను జారీ చేస్తూ, దర్యాప్తు ప్రక్రియలో సహకరించడం ప్రతి నిందితుడి బాధ్యత. సిట్ అడిగిన వివరాలు ఇవ్వకపోవడం చట్టవిరుద్ధం, అని వ్యాఖ్యానించింది. ముఖ్యంగా ప్రభాకర్ రావు తన క్లౌడ్ డేటా, అలాగే యాపిల్ క్లౌడ్‌లో ఉన్న సమాచారం మొత్తం సిట్‌కు అందించాలన్నది కోర్టు స్పష్టం చేసింది. అదేవిధంగా, ఆన్‌లైన్ ఖాతాలకు సంబంధించిన యూజర్‌నేమ్, పాస్‌వర్డ్‌లు కూడా సిట్ అధికారులు పొందేలా చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. అయితే, ఆ సమాచారం సేకరణ సమయంలో ఫోరెన్సిక్ నిపుణులు తప్పనిసరిగా హాజరై ఉండాలని కూడా కోర్టు సూచించింది. ఇది దర్యాప్తు పారదర్శకతను నిర్ధారించడమేనని పేర్కొంది. తద్వారా, సిట్ అధికారులు ఫోరెన్సిక్ బృందం సమక్షంలో డిజిటల్ ఆధారాలను సేకరించి దర్యాప్తును కొనసాగించవచ్చు. ప్రభాకర్ రావు లేదా ఇతర నిందితులు ఆ సమాచారాన్ని చెరిపేందుకు లేదా



మార్చేందుకు యత్నించినట్లు తేలితే, ఆ అంశంపై తదుపరి కఠిన చర్యలు తీసుకుంటామని సుప్రీంకోర్టు హెచ్చరించింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఈ తీర్పు సిట్ దర్యాప్తుకు మరింత బలం చేకూర్చనుంది. డిజిటల్ ఆధారాలు సేకరణకు సంబంధించి సుప్రీంకోర్టు ఇచ్చిన స్పష్టమైన మార్గదర్శకాలు, ఈ కేసులో కొత్త మలుపు తిప్పే అవకాశముందని న్యాయవర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇక ప్రభాకర్ రావు సిట్ ఆదేశాలను పాటించి వివరాలు సమర్పిస్తారా లేదా అనే అంశం, రాబోయే రోజుల్లో ఈ కేసు దిశను నిర్ణయించనుంది.

# లోన్ పేరుతో సైబర్ మోసం

## దాదాపు 8లక్షలు పోగొట్టుకున్న వ్యక్తి

హైదరాబాద్,అక్టోబరు14 : సైబర్ మోసాల ఎంతగా అవగాహన కల్పిస్తున్న ప్రజలు మోసపోతునే ఉన్నారు. తాజాగా హైదరాబాద్‌లోని బేగంపేటలో ఓ వ్యక్తిని సైబర్ కేటుగాళ్లు మోసగించారు. ఈ కేసుకి సంబంధించిన వివరాలను హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు మంగళవారం వెల్లడించారు. హైదరాబాద్‌లో ఫేక్ ఎన్జీవో లోన్ స్కామ్ వెలుగులోకి వచ్చింది. ఈ స్కాంలో రూ.7.9 లక్షలు బేగంపేటకు చెందిన 30 ఏళ్ల వ్యక్తి మోసపోయాడు. వాట్సాప్ కాల్‌లో ఫౌండర్ సల్మాన్ ఖాన్ డీపీతో ఓ వ్యక్తి రూ.50 లక్షల లోన్ హామీ ఇచ్చాడు. మొదటగా రూ.10 లక్షలు కట్టాలని అడిగాడు. ఆ తర్వాత లోనుకి కావాల్సిన పైసలు ఇస్తానని నమ్మబలికాడు. ఇది నిజమనుకున్న బాధితుడు రూ.7.9లక్షలు కట్టాడు. ఆ తర్వాత బాధితుడిని నేరగాళ్లు మోసం చేశారు. చివరికి మోసపోయినట్లు గ్రహించి బాధితుడు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అపరిచిత వ్యక్తుల లోన్ ఆఫర్లను నమ్మవద్దని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు సూచించారు. ముందస్తు ఫీజులు, టాక్స్‌లు కట్టవద్దని తెలిపారు. సెలబ్రిటీ డీపీలు లేదా అనుమానాస్పద అకౌంట్లపై అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ధ్రువీకరించిన రిజిస్టర్ సంస్థల ద్వారా మాత్రమే లోన్ అభ్యర్థించాలని సూచించారు. సైబర్ క్రైమ్ మోసం జరిగితే డయల్ – 1930 ద్వారా లేదా ఫిర్యాదు చేయాలని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు సూచించారు.

# తప్పిపోయిన పిల్లల కోసం నోడల్ అధికారులు

## కేంద్రానికి సుప్రీం ధర్మాసనం ఆదేశం

న్యూఢిల్లీ,అక్టోబర్14 : తప్పిపోయిన పిల్లల కేసుల విషయంలో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. మిస్సింగ్ కేసుల పర్యవేక్షణకు ప్రతి రాష్ట్రం, కేంద్ర పాలిత ప్రాంతాల్లో నోడల్ అధికారులను నియమించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. రాష్ట్రాల్లో పిల్లల మిస్సింగ్, అక్రమ రవాణాపై 'గురియా స్వయం సేవి సంస్థాన్' అనే స్వచ్ఛంద సంస్థ సుప్రీంకోర్టులో పిల్ దాఖలు చేసింది. దీనిపై విచారణ జరిపిన జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఆర్.మహదేవన్‌ల ధర్మాసనం ఈమేరకు ఆదేశాలిచ్చింది. తప్పిపోయిన పిల్లల కేసులను పర్యవేక్షించ డానికి నియమించిన నోడల్ అధికారుల వివరాలను ఆన్‌లైన్ సహా అన్ని మాధ్యమాల్లో ప్రజలకు అందుబాటులో ఉంచాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. ఇందుకోసం ఒక పోర్టల్ రూపొందించి... దానిలో అన్ని వివరాలు పొందుపరచాలని ఆదేశించింది. పోర్టల్‌లో అదృశ్యమైన పిల్లల గురించి ఫిర్యాదు అందిన వెంటనే నోడల్ అధికారులు చర్యలు తీసుకోవడానికి ఇది ఉపయోగపడుతుందని పేర్కొంది. పోర్టల్‌లో వచ్చే ఫిర్యాదుల ఆధారంగా పిల్లలను కిడ్నాప్ చేసే నేరస్థులపై కేసులు నమోదు చేసి..తగిన చర్యలు తీసుకోవచ్చని సూచించింది.

# గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు

## 10వేల కోట్ల పెట్టుబడులు వస్తాయి: పెమ్మసాని

న్యూఢిల్లీ,అక్టోబరు14 : విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ద్వారా ఏపీ ప్రభుత్వానికి రూ.10 వేల కోట్ల ఆదాయం వచ్చే అవకాశం ఉందని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. దీనితో పాటు ఇతర టెక్ సంస్థలూ విశాఖకు వచ్చే అవకాశం ఉందన్నారు. గూగుల్.. విశాఖకు రావడానికి ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ విశేషంగా కృషి చేశారని చెప్పారు. విశాఖపట్నంలో 1 గిగావాట్ హైపర్ స్కేల్ డేటా సెంటర్ ఏర్పాటుపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గూగుల్‌తో మంగళవారం ఢిల్లీలో చారిత్రక ఒప్పందం కుదర్చుకుంది. ఈ ప్రాజెక్టు ద్వారా గూగుల్ సుమారు 15 బిలియన్ అమెరికన్ డాలర్ల పెట్టుబడి పెట్టనుంది. ఈ సందర్భంగా మంత్రి పెమ్మసాని మాట్లాడుతూ ఇది ఓ పెద్ద ముందడుగు అన్నారు. గూగుఉలతో అనేకమందికి ఉద్యోగావకాశాలు వస్తాయన్నారు. విశాఖ రూపురేఖలు మారుతాయన్నారు.

# కుటుంబ కలహాల నేపథ్యం

## ఇద్దరు పిల్లలను చంపి తల్లి ఆత్మహత్య

హైదరాబాద్,అక్టోబర్14 : హైదరాబాద్ బాలానగర్ ప్రాంతంలో విషాద ఘటన చోటుచేసుకుంది. కుటుంబ కలహాల కారణంగా ఓ తల్లి తన ఇద్దరు చిన్నారులను హత్య చేసి, ఆ తర్వాత భవనం పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనలో మృతురాలును చల్లారి సాయిలక్ష్మీ (27)గా గుర్తించారు. ఆమె భర్త అనిల్ కుమార్ తో కలిసి పద్మారావు నగర్ ఫేజ్–1, బాలానగర్ లో నివాసం ఉంటోంది. సాయిలక్ష్మీకి ఇద్దరు కవల పిల్లలు చేతన్ కార్తికేయ, లాస్యతవల్లి ఉన్నారు. తాజాగా అందిన సమాచారం మేరకు గత కొంతకాలంగా భర్తతో వచ్చిన కుటుంబ విభేదాలు, వ్యక్తిగత సమస్యల నేపథ్యంలో తీవ్ర మనస్థాపానికి గురైన సాయిలక్ష్మీ, ఆవేశంతో తన ఇద్దరు పిల్లలను చంపి అనంతరం బిల్డింగ్ పై నుంచి దూకి ప్రాణాలు తీసుకుంది. ఈ ఘటనతో ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

## గురుకుల కాలేజీ విద్యార్థిని ఆత్మహత్య

జోగులాంబ గద్వాల,అక్టోబర్14 : జిల్లాలో విషాదం నెలకొంది. ఈ చదువు చదవలేక పోతున్నానని నోట్ రాసి గురుకుల కాలేజీ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. అయితే ప్రేమ వేధింపులతోనే తన కూతురు ఆత్మహత్య చేసుకుందని మృతురాలి తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. గద్వాల జిల్లా మల్దకల్‌కు చెందిన ఉప్పరి నగేశ్ కుమార్తె ప్రియాంక (17) మహబూబ్‌నగర్ జిల్లా రాంరెడ్డిగూడ సోషల్ వెల్ఫేర్ కాలేజీలో ఇంటర్ ఫస్టియర్ చదువుతోంది. సోమవారం నాడు బాత్‌రూంలోని కిటికీకి ప్రియాంక ఉరివేసుకుంది. ఇది గమనించిన తోటి విద్యార్థులు కాలేజీ సిబ్బందికి సమాచారం అందించారు.

# సంపాదకీయం

## మమతా బెనర్జీ బాధ్యతా రాహిత్యం

సమాజంలో రాక్షస ప్రవృత్తి పెరుగుతోంది. అత్యాచారాలు, హత్యలు, హత్యాకాండలు పెచ్చుమీరడం ఆందోళన కలిగిస్తోంది. తాజాగా వరుస ఘటనలు తీవ్రమైనవిగా పరిగణించాలి. ప్రభుత్వాలు ఈ తరహా నేరాలపై అధ్యయనం చేయాలి. కట్టడికి కఠిన చర్యలు తీసుకోవాలి. పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, ఎపి, తెలంగాణ ఇలా అనేక రాష్ట్రాల్లో సభ్యసమాజం తలదించుకునేలా ఘటనలు జరుగుతున్నాయి. చివరకు చిన్నారి బాలలపైనా మూర్ఖులు లైంగికదాడులకు పాల్పడడం దారుణం. హైదరాబాద్‌లో, ఉమ్మడి వరంగల్ జిల్లాలో బాలలపై ఉపాధ్యాయులే లైంగిక దాడికి తెగించడం దుర్మార్గపు చర్య. ఇలాంటి వారిని బహిరంగం గానే ఉరితీయాలి. ఇకపోతే మళ్లీ అక్కడక్కడా పరువు హత్యలు సాగుతున్నాయి. కులాలు, మతాలు కలవక పోవడంతో ప్రేమ పెళ్లిళ్లకు అడ్డుపడుతున్నారు. ఇలా సమాజంలో భయం లేకపోవడం వల్ల, చట్టాల్లో లొసుగుల వల్ల ప్రజల్లో రాక్షసత్వం పెరిగిపోతోంది. అత్యాచారాలు సులవుగా చేసేస్తున్నారు. దొంగతనాలు, హత్యలకు కొదువే లేదు. ఇవన్నీ ఒక ఎత్తయితే బెంగాల్ సిఎం మమతా బెనర్జీ చేసిన వ్యాఖ్యలు బాధ్యతా రహితంగా ఉన్నాయి. అత్యాచార ఘటనపై స్పందిస్తూ..అర్ధరాత్రి ఆ అమ్మాయి ఒంటరిగా ఎందుకు బయటకు వచ్చిందని పెడసరంగా ప్రశ్నించారు. ఒక సిఎంగా ఉన్న మమత మహిళ అయినా ఇలాంటి విషయాల్లో కనీస ఇంగితం లేకుండా మాట్లాడారు. కొన్నేళ్లుగా మహిళలపై నేరాల్లో బెంగాల్, కోల్‌కతా ముందువరసలో ఉంటున్నాయని నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరో వార్షిక నివేదికలు ఘోషిస్తున్నాయి. దుర్గాపూర్ అత్యాచార దుర్ఘటనను ఖండిస్తూ మహిళలు, విద్యార్థులు, డాక్టర్స్ సంఘాలు, ఆరోగ్య కార్యకర్తల నుంచి రెండు రోజులుగా ఆందోళనలు పెల్లుబకగా, బాధ్యత కలిగిన ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమత స్పందన బాధితు రాలిని, కుటుంబ సభ్యులను, యావత్ మహిళాలోకాన్ని కించపరిచింది. రాత్రిపూట క్యాంపస్ నుంచి బయటికి ఎందుకు వెళ్లింది, ఆ సమయంలో ఏం పని, అని సిఎం అసహనం చెందారు. ఏ సమయంలోనైనా బయటికి వెళ్లడం ప్రాథమిక హక్కు అయినప్పటికీ స్త్రీలు రాత్రుళ్లు రోడ్లపైకి రాకూడదని విరుచుకుపడ్డారు. ప్రతి ఒక్క మహిళ ఇంటి ముందు పోలీసులను కాపలాగా పెట్టలేమంటూ మహిళా భద్రతపై చేతులెత్తేశారు.పశ్చిమ బెంగాల్ దుర్గాపూర్‌లో ఐక్యూ ప్రైవేటు మెడికల్ కాలేజీ విద్యార్థినిపై కాలేజీ క్యాంపస్ పరిసరాల్లో జరిగిన సామూహిక అత్యాచారం బెంగాల్‌లో మహిళా భద్రతా వైఫల్యాన్ని మరొకసారి బట్టబయలు చేసింది. ఒరిస్సాకు చెందిన విద్యార్థిని వైద్య విద్యనభ్యసించేందుకు ఆ కాలేజీలో చేరగా ఈ ఘోరం చోటు చేసుకుంది. శుక్రవారం రాత్రి తన స్నేహితునితో కలిసి డిన్నర్‌కు క్యాంపస్ వెలుపలికి వెళ్లగా విద్యార్థినిని మృగాళ్లు అటకాయించి చేతిలోని ఫోన్‌ను లాక్కొని దగ్గరలోని దట్టమైన చెట్లలోకి బలవంతంగా లాక్కెళ్లి అఘాయిత్యానికి ఒడిగట్టారు. విషయం బయటికి చెబితే తీవ్రమైన పర్యవసానాలు ఉంటాయని దుండగులు బాధితురాలిని భయపెట్టారు. ఫోన్‌ను తిరిగి ఇచ్చేందుకు డబ్బులు డిమాండ్ చేశారు. ప్రస్తుతం బాధితురాలు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నది. కాగా విద్యార్థినిని డిన్నర్‌కు బయటికి తీసుకెళ్లిన యువకుడు మధ్యలోనే పరారయ్యాడని అంటున్నారు. అందుకే అతనిపైనా అనుమానాలు కలుగుతున్నాయి. అత్యాచారంలో ఈ ఫ్రెండ్ పాత్ర తెలియాలంటే పోలీస్ దర్యాప్తు ముమ్మరంగా జరగాలి. బాధితురాలికి న్యాయం చేయాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని దుర్గాపూర్, కోల్‌కతా, బెంగాల్ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు, నిరసన ప్రదర్శనలు కొనసాగుతున్నాయి. జాతీయ మహిళా కమిషన్ బెంగాల్‌లో మహిళలకు సరైన భద్రత కల్పించాలని మమత ప్రభుత్వాన్ని ఆదేశించింది. నిరుడు ఆగస్టులో ఆర్‌జి కర్ ఆస్పత్రిలో రాత్రిపూట వైద్య విధుల్లో ఉన్న లేడీ ట్రైనీ డాక్టర్‌పై అత్యాచారం, హత్య ఉదంతం సంచలనమైంది. ఆందోళనలతో బెంగాల్ రాష్ట్రం అట్టుడికింది. అయినా బెంగాల్లో మమతా బెనర్జీ పాలనతీరు మారలేదు. మహిళలకు రక్షణ కల్పించడం లేదు. అంటే మృగాళ్లకు భయం కలగడం లేదు. దీనికితోడు మమత చేసిన వ్యాఖ్యలు మృగాళ్లకు ఊతమిచ్చేలా ఉన్నాయి. ఏం మాట్లాడాలో కూడా తెలియని బాధ్యతారహిత నాయకులు ఉండడం సిగ్గుచేటు. ఆర్‌జికర్ ఆస్పత్రి వ్యవహారంలో అంతా మాయ జరిగింది. అసలు నిందితులను వదిలేసి ఓ అమాయకుడిని అందులో ఇరికించేశారు. ఈ ఘటనపై దేశ వ్యాప్తంగానూ నిరసనలు మిన్నంటాయి. ఈ కేసులో సివిక్ పోలీస్ వలంటీర్ సంజరు రారుకి జీవిత ఖైదు పడింది. అసలు నిందితులను వదిలేశారని నేటికీ బాధితురాలి కుటుంబం పోరాడుతూనే ఉంది. ఆర్‌జి కర్ ఘోరాన్ని మరవకముందే దుర్గాపూర్ దారుణం సంభవించింది. ఈ ఏడాది జులైలో దక్షిణ కలకత్తా లా కాలేజీ విద్యార్థినిపై అత్యాచారం జరిగింది. రాష్ట్ర రాజధాని కోల్‌కతాలో కాలేజీ క్యాంపస్‌లలో విద్యార్థినులపై జరుగుతున్న వరుస అత్యాచారాలు విద్యా సంస్థలు, వాటి పరిసరాల్లో భద్రతా చర్యలపై డొల్ల తనాన్ని ప్రశ్నిస్తున్నాయి. పటిష్టమైన భద్రత, నిఘా, అప్రమత్తపు చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని గట్టిగా డిమాండ్ చేస్తున్నాయి. బిజెపిని విమర్శిస్తున్న మమతా బెనర్జీ తన ఏలుబడిలో బెంగాల్లో వరుస ఘటనలు జరుగుతున్నా కఠిన చర్యలు తీసుకోవడం లేదు. అత్యాచారం వంటి దారుణాలు జరిగినప్పుడు ఉన్నత పదవుల్లో ఉన్న వ్యక్తులు బాధ్యతగా ఉండాలి. బాధజతులకు న్యాయం జరుగుతుందన్న ఆత్మవిశ్వాసం వారిలో కలిగించాలి. నిందితులను కఠినంగా శిక్షించాలాలి. భవిష్యత్తులో ఇటువంటివి పునరావృతం కానీకుండా హెచ్చరికలు చేయాలి. మహిళలలో భయం పోగొట్టి భరోసా నింపాలి. ఇటువంటి స్పందనను ఒక మహిళా ముఖ్యమంత్రి నుంచి మహిళలు, ప్రజలు ఆశిస్తారు. కానీ మమత అందుకు విరుద్ధంగా ప్రవర్తించడం తగనిపని.

# మావోయిస్టు పార్టీకి ఊహించని ఎదురుదెబ్బ



**గడ్చిరోలి పోలీసులకు లొంగిపోయిన మల్లోజుల**

**పార్టీ అనుసరిస్తున్న తీరుపై కొంతకాలంగా అసంతృప్తి**

ముంబై,అక్టోబర్14 : మావోయిస్టు పార్టీకి ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ, పొలిట్‌బ్యూరో సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్ రావు అలియాస్ సోనూ పోలీసులకు లొంగిపోయారు. మహారాష్ట్రలోని గడ్చిరోలిలో ఆయన పోలీసులకు లొంగిపోయారు. కొద్దిరోజుల కిందట తన సోదరుడు మల్లోజుల కోటేశ్వరరావుకు కిషన్‌జీ పేరుతో వేణుగోపాల్‌రావు ఒక లేఖ రాశారు. అందులో మావోయిస్టు పార్టీ విధానాలపై వేణుగోపాల్‌రావు కొంతకాలంగా అసంతృప్తిలో ఉన్నట్లు తెలుస్తోంది. విప్లవోద్యమాన్ని విజయవంతంగా నడిపించడానికి బహిరంగంగా ప్రజల్లోకి వెళ్లడం మినహా మరో మార్గం లేదంటూ మావోయిస్టు పార్టీకి ఆయన రాసిన మరో లేఖ కలకలం రేపింది. దాని తర్వాత ఆయన మావోయిస్టు పార్టీని వీడారు. అనివార్య కారణాలతో పార్టీని వీడుతున్నానని.. ఇకపై పార్టీలో కొనసాగబోనని ప్రకటించారు. ఈ క్రమంలోనే 60 మందితో కలిసి గడ్చిరోలి పోలీసులకు లొంగిపోయారు. ఆయన రాసిన లేఖలో వివరాలు ఇలా ఉన్నాయి. నిన్నటి పొరపాట్లను విశ్లేషించుకోవడం ద్వారా నేడు, రేపు వాటిని నివారించడం ఎలాగో మనం నేర్చుకుంటాం. తప్పుల నుంచి గుణపాఠాలు తీసుకోవడం రోగం రాకుండా టీకా తీసుకోవడం వంటిది. విప్లవోద్యమాన్ని కూడా అదే తీరుగా నడిపించగలుగుతాం. ఇది నల్లేరు మీద బండిలా సాగే పని ఎంతమాత్రం కాదు. తీవ్రమైన అధ్యయనం, ఓపికతో, త్యాగాలతో కూడిన విప్లవాచరణ' అని మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్ పేర్కొన్నారు. ఈ మేరకు మావోయిస్టు పార్టీకి ఆయన 22 పేజీలతో కూడిన సుదీర్ఘ లేఖను ఈ నెల 6వ తేదీన విడుదల చేశారు. మావోయిస్టు పార్టీలో తీవ్రమైన అంతర్గత సంక్షోభం ఉన్నదని, ఆయుధ పోరాటాలను తాతాలికంగా విరమించాలని ఆ లేఖలో కోరారు. దశాబ్దాల తరబడి తప్పుడు విధానాలే తీవ్రమైన నష్టాలకు కారణమని, 'సైన్యం తప్ప రహస్య పార్టీ లేదు' అని ఆయన ఖరాకండిగా ప్రకటించారు. ఈ నేపథ్యంలో తాతాలికంగా సాయుధ పోరాటాన్ని విరమించి, ప్రజల మధ్యకు బహిరంగంగా వెళ్లాలని ఆయన క్యాడర్‌ను కోరారు. పార్టీకి తీవ్ర నష్టాన్ని కలిగించిన మౌలికమైన తప్పిదాలను సరిదిద్దుకోవడానికి సైన్యంతో ఉంటే సాధ్యం కాదని వేణుగోపాల్ స్పష్టం చేశారు. 'విప్లవపార్టీ లేకుండా విప్లవమే లేదు' అనే లెనిన్ సూత్రాన్ని విస్మరించడం వల్ల, మావోయిస్టులకు సైన్యం తప్ప రహస్య పార్టీ లేని స్థితి ఏర్పడిందని విమర్శించారు. ప్రస్తుతమున్న ఏసీ, డీవీసీ వంటి పార్టీ కమిటీలన్నీ పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (పీఎల్‌జీఏ) వెంట, సైనిక దుస్తులలో సాయుధులుగా ఉండటం బహిరంగ రహస్యమేనని అన్నారు. వీటిని శత్రువుకు అబేధ్యమైన రహస్య పార్టీ నిర్మాణాలుగా పరిగణించలేమని, ఇదే బలహీనత శత్రువుకు పార్టీని నిర్మూలించేందుకు పూర్తి అవకాశాన్ని ఇచ్చిందని పేరొన్నారు. 2007లో జరిగిన పార్టీ కాంగ్రెస్‌లో దండకారణ్యం, బీహార్-జార్ఖండ్‌లలో బేస్ ఏరియాలను నిర్మించే కేంద్ర కర్తవ్యాన్ని చేపట్టడం రెండో వ్యూహాత్మక తప్పిదమని వేణుగోపాల్ విమర్శించారు. పార్టీ బలాన్ని అతిగా అంచనా వేసి, శత్రువు బలాన్ని తకువ చేసి చూశామన్నారు. 2011 నుండే కిందిస్థాయి కామ్రేడ్స్ ఈ తప్పును సరిదిద్దుకోవాలని కోరినప్పటికీ, సీసీ పట్టించుకోలేదని అన్నారు. ఒక దశాబ్దం పాటు నష్టపోయామని తెలిపారు. ఇప్పటికైనా అమరుల రక్తతర్పణం నుండి గుణపాఠాలను తీసుకుందామని పేర్కొన్నారు. రహస్య, చట్టబద్ధ పోరాటాల మధ్య సమన్వయాన్ని కొనసాగించడంలో సెంట్రల్ కమిటీ పూర్తిగా విఫలమైందని ఇది మూడో తప్పిదమని వేణుగోపాల్ అభిప్రాయపడ్డారు. 2006 నూతన అటవీ చట్టం ప్రకారం ప్రభుత్వం ఇచ్చే భూమి పట్టాలను 'బేస్ ఏరియాలు నిర్మిస్తున్నామనే ధీమాతో' వ్యతిరేకించాం. దండకారణ్యంలోని రైతులకు మన జనతన సరార్‌లే పట్టాలిస్తాయని చెప్పాం, కానీ ఆ పట్టాలకు వ్యవస్థలో గుర్తింపు లేదనే ప్రాక్టికల్ నాలెడ్జ్‌ను విస్మరించామని తెలిపారు. ప్రజలు తమ జీవితావసరాల కోసం అనివార్యమైన ఆధార్ కార్డులు తెచ్చుకోవడాన్ని కూడా పార్టీ వ్యతిరేకించడం, ప్రజలు దొంగచాటుగా ప్రభుత్వ అధికారుల వద్దకు వెళ్లి వాటిని పొందాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేరొన్నారు. 'ఇప్పుడు మనకు సానుకూల మార్పు కావాలి. ఉద్యమాన్ని కాపాడుకోవడం, క్యాడర్‌ను రక్షించుకోవడం కావాలి. అనవసర త్యాగాలకు అంతం పలుకుదాం. నూతన పద్ధతులలో పురోగమిద్దాం. అంతిమ విజయం ప్రజలదే' అంటూ మల్లోజుల తన లేఖను ముగించారు. తాను కేంద్ర కమిటీలో 28 ఏండ్లు, పొలిట్ బ్యూరోలో 18 ఏండ్లు సభ్యుడిగా ఉన్నట్టు మల్లోజుల తెలిపారు. ప్రస్తుతం ఉద్యమం ఎదురొంటున్న వైఫల్యాలకు, భారీ నష్టాలకు నైతిక బాధ్యత వహిస్తూ, యావత్ పార్టీ క్యాడర్‌కు బహిరంగ క్షమాపణలు చెప్పారు. ఇంతటి నష్టాలకు దారితీసిన నాయకత్వంలో కొనసాగడానికి అనర్హుడిని అని ప్రకటించారు. గతంలో దివంగత ప్రధానకార్యదర్శి కామ్రేడ్ బసవరాజు (నంబాల కేశవరావు) కూడా ప్రభుత్వంతో శాంతి చర్చల పక్రియను ప్రారంభించారని, ఏప్రిల్ 2025 నాటికి ఈ నిర్ణయం అనివార్యమని భావించారని గుర్తు చేశారు.

## నవంబర్ 17వ తేదీ నుంచి అమ్మవారికి కార్తీక బ్రహ్మోత్సవాలు

తిరుపతి,అక్టోబర్14 : తిరుచానూరులో కొలువు తీరిన శ్రీ పద్మావతి అమ్మవారి వార్షిక కార్తీక బ్రహ్మోత్సవాలు నవంబర్ 17వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని తిరుమల తిరుపతి దేవస్థానం వెల్లడించింది. ఈ బ్రహ్మోత్సవాలు నవంబర్ 25వ తేదీతో ముగుస్తాయని తెలిపింది. అందుకు సంబంధించిన ఏర్పాట్లు జరుగుతున్నాయని వివరించింది. ఈ సందర్భంగా అమ్మవారి వాహన సేవలను ఏ రోజున ఏమిటనే విషయాన్ని ఈ సందర్భంగా వివరించింది. ఈ మేరకు టీటీడీ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది.

## 30 శ్రీవారికి పుష్పయాగం

**29,30 తేదీల్లో ఆర్జిత సేవలు రద్దు**

తిరుమల,అక్టోబర్14 : శ్రీవారి ఆలయంలో అక్టోబర్ 30న గురువారం పుష్పయాగ మహోత్సవం శాస్త్రోక్తంగా జరుగనుంది. అక్టోబర్ 29న బుధవారం రాత్రి 8 నుండి 9 గంటల వరకు పుష్పయాగానికి అంకురార్పణ నిర్వహించనున్నారు. పుష్పయాగం రోజున ఆలయంలో రెండవ అర్చన, రెండవ గంట, నైవేద్యం అనంతరం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామి ఉత్సవర్లను సంపంగి ప్రదక్షిణంలోని కల్యాణ మండపానికి వేంచేపు చేసి స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. ఇందులో భాగంగా పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపు తదితర సుగంధద్రవ్యాలతో విశేషంగా అభిషేకం చేస్తారు. మధ్యాహ్నం 1 నుంచి 5 గంటల వరకు వివిధ రకాల పుష్పాలు, పత్రాలతో వేడుకగా పుష్పయాగం నిర్వహిస్తారు. సాయంత్రం సహస్రదీపాలంకార సేవ తరువాత ఆలయ నాలుగు మాడ వీధుల్లో శ్రీమలయప్పస్వామివారు భక్తులకు దర్శనమిస్తారు. అక్టోబర్ 29న అంకురార్పణ కారణంగా సాయంత్రం సహస్రదీపాలంకార సేవను టీటీడీ రద్దు చేసింది. అక్టోబర్ 30 పుష్పయాగం రోజున తిరుప్పావడ సేవ, కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవ సేవలు రద్దయ్యాయి. తోమాల, అర్చన సేవలు ఏకాంతంగా నిర్వహిస్తారు.



## వెనిజులా నేత మచాదోకు నోబెల్‌పై అక్కసు

**నార్వే ఎంబసీని మూసేసిన వెనిజులా ప్రభుత్వం**

న్యూఢిల్లీ,అక్టోబర్14 : ఈ ఏడాది ప్రతిష్ఠాత్మకమైన నోబెల్ శాంతి బహుమతిని వెనుజువెలా ప్రతిపక్ష నాయకురాలు మరియా కొరినా మచాదో దక్కించుకున్న సంగతి తెలిసిందే. ఈ ఎంపికపై భగ్గుమన్న వెనుజువెలా ప్రభుత్వం ప్రతీకార చర్యలు చేపట్టింది. అందులోభాగంగా నార్వేలోని తమ దౌత్య కార్యాలయాన్ని మూసివేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు వెనెజువెలా విదేశాంగ మంత్రిత్వశాఖ సోషల్ మీడియా పోస్టులో వెల్లడించింది. తమ దౌత్య కార్యకలాపాల అంతర్గత పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. మరోవైపు.. జింబాబ్వే, బుర్కినా ఫాసో వంటి దేశాల్లో తమ ప్రాతినిధ్యం పెంచుకునేందుకు గాను ఆస్ట్రేలియాలోని తమ రాయబార కార్యాలయాన్ని మూసివేస్తున్నట్లు పేర్కొంది. వెనెజువెలా ప్రభుత్వ నిర్ణయంపై నార్వే విదేశాంగ మంత్రిత్వశాఖ అసంతృప్తి వ్యక్తం చేసింది. అనేక విషయాల్లో తమ మధ్య విబేధాలు ఉన్నప్పటికీ.. వెనెజువెలాతో తాము చర్చలు కోరుకుంటున్నామని తెలిపింది. ఆ దిశగా పనిచేస్తుందని వివరించింది. ఈ సందర్భంగా నోబెల్ బహుమతి ప్రకటించడం అనేది నార్వే ప్రభుత్వానికి చెందిన స్వతంత్ర నిర్ణయమని స్పష్టం చేసింది. వెనెజువెలా ప్రతిపక్ష నాయకురాలు మచాదో. దేశ ప్రజల హక్కుల కోసం అవిశ్రాంత పోరాటం చేసినందుకు గాను ఆమెకు ఈ పురస్కారం ఇస్తున్నట్లు నార్వే నోబెల్ కమిటీ పేర్కొంది. వెనెజువెలాకు ప్రస్తుతం నికోలస్ మదురో అధ్యక్షుడిగా ఉన్నారు. అయితే, మదురో ఎన్నికను యూఎస్‌తో సహా పలు దేశాలు గుర్తించలేదు. మచాదోకు నోబెల్ ప్రకటించడంపై అక్కడి ప్రభుత్వం ఇప్పటివరకు స్పందించలేదు. ఈ క్రమంలోనే దౌత్య కార్యాలయం మూసివేయడం గమనార్హం. ఇక, తనకు దక్కిన ఈ అవార్డును అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు అంకితమిస్తున్నట్లు మచాదో పేర్కొన్నారు.

## దుర్గాపూర్ అత్యాచార ఘటన


**ముగ్గురునిందితులతో పాటు, సహకరించిన వ్యక్తి అరెస్ట్**

**నిందితుడి సోదరి ఇచ్చిన సమాచారంతో అరెస్ట్**

కోల్‌కతా,అక్టోబర్14 ): పశ్చిమబెంగాల్‌లో తీవ్ర కలకలం రేపిన ఒడిశాకు చెందిన ఓ వైద్య విద్యార్థినిపై సామూహిక అత్యాచార ఘటన కేసులో అత్యాచారానికి పాల్పడిన ముగ్గురు నిందితులతో పాటు వారికి సహకరించిన మరో యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారు పారిపోయేందుకు సహకరించిన మరో యువకుడిని మంగళవారం అరెస్టు చేసినట్టు పేర్కొన్నారు. నిందితుడి సోదరి ఇచ్చిన సమాచారంతోనే పరారీలో ఉన్న అతడిని గుర్తించినట్లు పోలీసులు వెల్లడించారు. ఐదో నిందితుడు సఫీక్ దుర్గాపుర్‌లోని అందాల్ వంతెన కింద దాక్కున్నట్లు అతడి సోదరి రోజినా తమకు సమాచారం ఇవ్వడంతో అతడిని పట్టుకున్నట్లు తెలిపారు. తన సోదరుడు చేసిన తప్పునకు తగిన శిక్ష అనుభవించాలనే ఉద్దేశంతోనే పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు రోజినా మీడియాకు తెలిపింది. అత్యాచార ఘటనపై బాధితురాలు మాట్లాడుతూ భయానక క్షణాలను గుర్తు చేసుకుంది. శుక్రవారం రాత్రి తన స్నేహితుడితో కలిసి బయటకు వెళ్లినప్పుడు పలువురు దుండగులు తమను వెంబడించినట్లు తెలిపింది. వెంటనే తాము అడవి వైపు పరిగెత్తుతున్న సమయంలో తన స్నేహితుడు మరో వైపునకు వెళ్లగా..నిందితులు తనను బలవంతంగా అటవీప్రాంతంలోకి లాక్కెళ్లినట్లు పేర్కొంది. ఫోన్‌ను లాక్కొని తన స్నేహితుడికి కాల్ చేయాలని బెదిరించారని.. అతడు రాకపోవడంతో తనపై దారుణానికి పాల్పడ్డారని వెల్లడించింది. తాను ప్రతిఘటించడానికి ప్రయత్నిస్తుండగా..అరిస్తే మరికొంతమందిని పిలుస్తామని నిందితులు బెదిరించారంటూ ఆవేదన వ్యక్తం చేసింది. బాధితురాలి వాంగ్మూలం ఆధారంగా దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

## సేవాభావమే లక్ష్యం కావాలి

తిరుమల : ప్రతి రోజూ తనకు సంబంధం లేని మనిషి క్షేమం కోరి హృదయపూర్వక ప్రార్థన చేసే వ్యక్తికి అదే ఆరోగ్యం, ఆనందం! వాటి కోసం అతడు ఎక్కడికీ వెళ్లనక్కరలేదు. అలా ప్రార్థన చేస్తున్నప్పుడే, శరీరంలో మార్పులు కలుగుతాయి. మనసులో చక్కటి భావ ప్రకంపనలు ఏర్పడి, ధ్యానంగా మారి, రోగాల్ని దూరం చేస్తాయి. ఇది యోగుల బోధ. సర్వుల హితం కోరడంలో ప్రేమ ఇమిడి ఉంటుంది. ఎవరి కోసం వారే ఉంటే, ఆ జీవితం నిష్ఫలం. దానికి ప్రాముఖ్యం, అర్థం ఉండవు. మనిషి జీవితం ఏ క్షణం నుంచి ఇంకొకరి కోసం సాగుతుందో, ఆ క్షణం నుంచే సేవాభావం వెలుగొందుతుంది. సేవ కేవలం హృదయానికి సంబంధించినదై ఉండాలి. దాన్ని ఆలోచనలు, మాటలు అనుసరించాలి. ఆలోచనను హృదయం ఎప్పుడూ మంచి దారిలోనే నడిపిస్తుంది. హృదయం ఒక దిక్సూచి. ప్రేమకు అది కేంద్రస్థానం. సేవ, ప్రేమల్ని మనిషి కళలుగా నేర్చుకోవాలి. అదే సమగ్ర జీవిత కళ. అహంకారాన్ని విడనాడాలి. ఉపనిషత్తులకు ప్రాధాన్యాల పట్టిక ఉంది. అందులో అన్నింటికన్నా ముందు ఉండేది మానవత్వమే.సకల జీవరాశు లూ చల్లగా ఉండాలన్న భావన పెరిగేకొద్దీ, మనిషి అసలైన ఆనందానికి అర్థం తెలుసుకుంటాడు. అటువంటి నామస్మరణ ఉన్న చోట, మంచి వెల్లివిరుస్తుంది. అప్పుడే రుషులు సంతోషిస్తారని, దేవతలు దీవిస్తారని ఉపనిషత్ వాక్యం!



ఆధ్యాత్మికం

# స్వర్ణకారులకు అవగాహన సదస్సు



**గోదావరి ఖని టౌన్ :** బంగారం, వెండి ధరలు రోజు రోజుకు ధరలు ఆకాశాన్ని అంటుతున్న తరుణంలో వెండి బంగారం వ్యాపారస్తులు మరియు స్వర్ణకార వృత్తి చేసుకునే స్వర్ణకార సోదరులు, బట్టి, పాలిష్ మరియు బెంగాలి వర్కర్లకు అవగాహన కల్పిస్తూ వన్ టౌన్ సిఐ ఇంద్రసేనారెడ్డి స్థానిక అశోక్ నగర్ ఎమ్ ఆర్ కె బ్యాంకేట్ హాల్లో సమావేశాన్ని ఏర్పాటు చేసి, వ్యాపారస్తులు మరియు స్వర్ణకార వృత్తి కొనసాగించేవారు తీసుకోవలసిన జాగ్రత్తలపై అమూల్యమైన సలహాలు సూచనలు అందించి, ఇతర ప్రాంతాల నుండి వచ్చి ఇక్కడ వృత్తి కొనసాగిస్తున్న, వారి కుటుంబంతో సహా పూర్తి వివరాలు సేకరించ వలసిందిగా ఆదేశించడం జరిగింది. ఈ సమావేశానికి స్థానిక బులియన్ అధ్యక్షులు గుగ్గిళ్ళ రవీంద్రచారి, కోశాధికారి రాజన్న, జిల్లాకోశాదికారి మామిడిపల్లి శ్రీధర్, ఉపాధ్యక్షులు సునీల్ యాదవ్, రాకేష్, విలాస్ జాదవ్, హనుమాన్ జాదవ్, అలాగే స్వర్ణకార సంఘం అధ్యక్షులు కొండపర్తి నరహరి,ప్రధాన కార్యదర్శి కట్టనగేష్ కుమార్, కోశాధికారి శ్రీధరాచారి, విజయగిరి సదానందం, గాలిపెల్లి రమేష్, ఉపేంద్రచారి, తిప్పర్తి శివ మరియు బెంగాలీ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని అవగాహన సదస్సును విజయవంతం చేయడం జరిగింది.

# గురుకులానికి ఎమ్మెల్యే కవ్వంపల్లి సహకారం మరువలేనిది

## - ప్రిన్సిపాల్ గోలి జగన్నాథం



**మానకొండూర్, అక్టోబర్ 14(:** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం దేవంపల్లి గురుకుల ఇంచార్జ్ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు తీసుకొని సంవత్సరం పూరైన సందర్భంగా పాఠశాల సాధించిన ప్రగతి వివరాలను ప్రిన్సిపాల్ గోలి జగన్నాథం మంగళవారం ఒక ద్వారా విడుదల చేశారు. గతేడాది పాఠశాల అంతర్గత సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ 20లక్షలు మంజూరు చేయించగా ప్రస్తుతం పనులు కొనసాగు తున్నాయని, ఎమ్మెల్యే, కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ల సహకారంతో చలికాలంలో వేడి నీళ్ల సదుపాయం, జనరేటర్ బాగుచేయించగా, జిల్లా కలెక్టర్ గురుకులానికి మంజూరు చేసిన బోర్ వెల్ తో పిల్లలకు నీటి సదుపాయం అందుతుందని తెలిపారు.గత సంవత్సరం పదవ తరగతి విద్యార్థులు 100% ఉత్తీర్ణత సాధించగా ఇంటర్మీడియట్ లో 93 శాతం ఉత్తీర్ణత సాధించడం జరిగిందన్నారు. ఇద్దరు విద్యార్థులకు ఐఐటీలో సీట్లు కూడా వచ్చినట్టు తెలిపి ఐదుగురు విద్యార్థులు నేషనల్ యోగా పోటీల్లో పాల్గొనగా దీపక్ అనే విద్యార్థి గోల్డ్ మెడల్ ను సాధించి రాష్ట్రస్థాయిలో క్రీడల్లో దేవంపల్లి విద్యార్థులు బహుమతులు సాధించినట్లు తెలిపారు. అందరి సహకారంతో గురుకులలో జోనల్ మీట్ ను విజయవంతం చేయడం జరిగిందన్నారు. గురుకులానికి ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సహకారం మరువేనిదని, విద్యార్థుల ఇబ్బందులకు చలించి గురుకుల సమస్యల పరిష్కారానికి సహకరించిన ఎమ్మెల్యే కవ్వంపల్లికి ప్రిన్సిపాల్ గోలి జగన్నాథం ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# సిపిఆర్ పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి: ఎంపీడీవో వి.వరలక్ష్మీ



**మానకొండూర్, అక్టోబర్ 14:** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఆరోగ్య కేంద్రం ఆద్వర్యంలో ఎంపిడిఓ సిబ్బందికి సిపిఆర్ పై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఎంపిడివో వి.వరలక్ష్మీ వైద్యులు సాయి ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.....అకస్మాత్తుగా గుండెపోటు వచ్చిన వ్యక్తికి తక్షణమే సిపిఆర్ ద్వారా ప్రథమ చికిత్స అందించి ప్రాణాలు కాపాడవచ్చని, సిపిఆర్ పై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉన్నపుడే గుండేపోటు మరణాలు చాలా వరకు అదుపులోకి వస్తాయని పేర్కొన్నారు. గ్రామాల్లోని వారందరికీ సిపిఆర్ పై అవగాహన కలిగేలా కృషి చేయాలని సిబ్బందిని కోరారు.కార్యక్రమంలో మండల వైద్యాధికారి వైద్యులు సల్మాన్, ఆరోగ్య కేంద్ర సిహెచ్ఓ బదావత్ రాజు నాయక, సూపర్వైజర్లు జుబీర్,హాజీబాబా, ల్యాబ్ టెక్నీషియన్ మునీందర్, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# సెపక్ తక్రా విజేతను అభినందించిన ప్రిన్సిపాల్ పద్మశ్రీ



**మానకొండూర్, అక్టోబర్ 14:** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం పోచంపల్లి ఆదర్శ పాఠశాల విద్యార్థిని ప్రహర్షిక కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా గోలేటి టౌన్ షిప్ లో ఈనెల 10,11,12 తేదీల్లో నిర్వహించిన సెపక్ తక్రా రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాలికల పోటీల్లో వెండి పతకాన్ని సాధించింది. ఈ సందర్భంగా మంగళవారం విద్యార్థిని ప్రహర్షికను ప్రిన్సిపాల్ పద్మశ్రీ, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధ్యాపక బృందం, ఫిజికల్ డైరెక్టర్ ఉయ్యాల విష్ణువర్ధన్ అభినందించారు.

# కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు పాటుపడినవారికే పట్టం

- ఏఐసీసీ కార్యదర్శి, పరిశీలకురాలు డా. అంజలి నింబాల్కర్
- రాహుల్ గాంధీ ఆలోచనకనుగుణంగా తెలంగాణాలో డీసీసీ అభ్యర్థుల ఎంపికలో కొత్త ఒరవడి: టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం





**కూకట్ పల్లి అక్టోబర్ 14 :** కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ ఆధ్వర్యంలో జరిగిన మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా డీసీసీ అధ్యక్షుడి అభ్యర్థి ఎంపిక కోసం జరిగిన కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి ముఖ్య నాయకులు, కార్యకర్తల సంఘటన్ సృజన్ అభియాన్ ముఖముఖి ప్రత్యేక సమావేశనికి ముఖ్య అతిధిగా హాజరైన ఏఐసీసీ కార్యదర్శి, పరిశీలకురాలు డా. అంజలి నింబాల్కర్, డీసీసీ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం. ఈ సందర్భంగా ఏఐసీసీ కార్యదర్శి, పరిశీలకురాలు డా. అంజలి నింబాల్కర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు కృషి చేసిన నాయకులకే పార్టీ అధిష్టానం పట్టం కడుతుందని అన్నారు. అనంతరం సత్యం శ్రీరంగం మాట్లాడుతూ కాంగ్రెస్ లో ప్రజాస్వామ్యం ఎక్కువగా ఉంటుందని, పార్టీ నాయకుల, కార్యకర్తల అభిష్టానానికి అనుగుణంగా డీసీసీ అధ్యక్షుల నియమాకం జరగాలని రాహుల్ గాంధీ స్పష్టం చేయడం జరిగిందన్నారు. రాహుల్ గాంధీ ఆలోచనకనుగుణంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారని అన్నారు. సంస్థాగతంగా పార్టీని పటిష్టం చేసేందుకు డీసీసీ నియామకాలు పార్టీ అధిష్టానం చేపడుతున్నదని తెలిపారు. కార్యక్రమంలో ఎ ఎమ్ సి చైర్మన్ పుష్పా రెడ్డి, టీపీసీసీ ప్రోటోకాల్ కార్యదర్శి సూరజ్ తివారి, కార్యదర్శులు దండుగుల యాదగిరి, గాలి బాలాజి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శేరి సతీష్ రెడ్డి, కాంటెస్టెడ్ కార్పొరేటర్ లు గోపిశెట్టి రాఘవేందర్, శ్రీనివాస్ రెడ్డి, ఏ.బ్లాక్ అధ్యక్షులు పి. నాగిరెడ్డి, బి. బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, ఏ. బ్లాక్ మహిళా అధ్యక్షురాలు రమాదేవి, బి. బ్లాక్ మహిళా అధ్యక్షురాలు సంధ్య, డివిజన్ అధ్యక్షులు, మహిళా అధ్యక్షురాళ్లు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎండి. సలీం, తూము వినయ్, సాధు ప్రతాప్ రెడ్డి, కర్క పెంటయ్య, గంధం యేసు రాజు, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్ యూఐ, మహిళ కాంగ్రెస్, అనుబంధ సంఘాల ప్రతినిధులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ నేతలు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మహిళలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పట్టణంలోని చెరువుల చుట్టూ పిచ్చి మొక్కలు తొలగించాలి

- బీజేపీ పట్టణ అధ్యక్షుడు గాజు భాస్కర్



**ధర్మపురి, అక్టోబర్ 14, :** ధర్మపురి పట్టణంలోని ప్రధాన నీటి వనరులు అయిన తమ్మల్ల కుంట, చింతామణి చెరువుల చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలు తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని మంగళవారం భారతీయ జనతా పార్టీ పట్టణ అధ్యక్షులు గాజు భాస్కర్ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కమిషనర్ కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షులు గాజుభాస్కర్ మాట్లాడుతూ ధర్మపురి పట్టణం లోని కాశెట్టి వాడ, బోయవాడ తొట్లవాడ, తెనుగు వాడ, ఎస్సీ కాలనీలలో భూగర్భ జలాలు పెంపునకు నీటి వనరు అయిన తమ్మల్ల కుంట, చింతామణి చెరువు పరిసరాలు పూర్తిగా పిచ్చి మొక్కలు, చెట్లు పెరిగి, ప్లాస్టిక్ కవర్ల తో నీరు కలుషితం అవుతుందని పేర్కొన్నారు. అలాగే వాకింగ్ చేయడం కోసం చెరువుల చుట్టూ వేసిన వాకింగ్ ట్రాక్ పైకి పెరిగిన పిచ్చి మొక్కలు వాకింగ్ చేసే వారికి ఇబ్బందికరంగా ఉన్నాయని తెలిపారు. తమ్మల్లకుంట వెనుక భాగంలో నీరు నిలిచి దుర్గంధం వెదజల్లుతూ పందులు, దోమలతో పరిసరాలన్నీ అపరిశుభ్రంగా మారి ప్రజలు అనారోగ్యాలకు గురౌతున్నారని వివరించారు. అలాగే సాయంత్రం చీకటి పడితే చాలు చెరువు కట్టపై వేసిన వాకింగ్ ట్రాక్ పై జులాయిలు, ఆకతాయిల ఆగడాలు, మందు బాబులకు అడ్డాగా మారి అవైపుకు వెళ్ళాలంటే జనాలు బయపడుతున్నారని కావున చెరువుల పరిశుభ్రతను చెరువు లోని పిచ్చిమొక్కలు తొలగించి వాకింగ్ ట్రాక్ ను శుభ్రపరచి, వాకింగ్ ట్రాక్ పై విద్యుత్ దీపాలు వెలిగేటట్లు చూడాలని కోరారు. పోలీస్ పెట్రోలింగ్ ను చేపట్టి కాలనీ వాసుల కష్టాలను తొలగించాలని భారతీయ జనతా పార్టీ ధర్మపురి పట్టణ శాఖ పట్టణ ప్రజల తరుపున డిమాండ్ చేస్తా ఉన్నట్లు భాస్కర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు గాజు భాస్కర్, జిల్లా కార్యదర్శి బెజ్జారాపు లవన్ కుమార్, పట్టణ ప్రధాన కార్యదర్శి తీర్మాందాస్ సత్య నారాయణ, బిజెపి సీనియర్ నాయకులు బండారి లక్ష్మణ్, ఆకుల శ్రీనివాస్, పల్లెర్ల సురేందర్, ఉపాధ్యక్షులు బాకీ అనిల్, సుంకు మధుసూదన్, మండలోజీ సూరజ్ ,ఆనందాస్ నవీన్, కాశెట్టి హరీష్, బత్తిని రాజయ్య, కలకోట రాజు, అనుమండ్ల శ్రావణ్ , మరియు తదితరులు పాల్గొన్నారు.

# ఓదెలలో పలు ఎక్స్ ప్రెస్ రైళ్లను ఆపాలి

- రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య ద్వారా..
- రైల్వే జీఎంను కలిసిన భాజపా నాయకులు
- కరీంనగర్ నుండి తిరుపతి
- జనతా, జి టి రైళ్లకు హాల్ట్ ఇవ్వాలి
- ప్రైవేటీకరణను రద్దు చేయాలి
- 35 కోట్లతో స్టేషన్‌ను అభివృద్ధి చేయాలి



రైల్వే జీఎంకు వినతి పత్రం ఇస్తున్న భాజపా నాయకులు

**(హైదరాబాద్) బ్యూరో:** పెద్దపల్లి జిల్లా ఓదెల రైల్వే స్టేషన్‌లలో పలు ఎక్స్ ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ ఇవ్వాలంటూ.. ప్రైవేటీకరణను ప్రైవేటీకరణను వెంటనే రద్దుచేసి ప్రభుత్వమే నిర్వహించాలని కోరుతూ మండల కేంద్రానికి చెందిన భాజపా నాయకులు రైల్వే జీఎంను కలిసి వినతి పత్రాన్ని ఈ రోజున అందజేయడం జరిగింది. కరీంనగర్ నుండి తిరుపతికి వెళ్లే స్పెషల్, అలాగే జనతా, జి టి లాంటి పలు రైల్లను ఓదెలలో ఆపితే భక్తులకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది అంటూ జీఎంకు వివరించారు. మరో శ్రీశైలంగా పేరుగాంచిన ఓదెల శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయాన్ని దర్శించుకోవడానికి ఇతర రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో భక్తులు అనునిత్యం ఇక్కడికి చేరుకుంటారని తద్వారా ప్రతి ఏటా ఓదెల స్టేషన్ ద్వారా 60 లక్షల రూపాయల ఆదాయం కూడా రైల్వేకు అందుతున్న విషయాన్ని నాయకులు క్షుణ్ణంగా జిఎం కు వివరించారు. అంతకుముందు రైల్వే స్టేషన్ అభివృద్ధి కోసం రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్యను కూడా భాజపా నాయకులు కలవడం జరిగింది. అందుకు సానుకూలంగా స్పందించిన కృష్ణయ్య కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ కు 35 కోట్లను ఓదెల రైల్వే స్టేషన్ అభివృద్ధి కోసం కేటాయించాల్సిందిగా కోరుతూ రాసిన ఉత్తరాన్ని జి ఎంకు అందజేశారు. రైల్వే స్టేషన్ లో ఉండాల్సిన కనీస సౌకర్యాలు( నీడనిచ్చే షెడ్లు, టాయిలెట్స్, మంచినీళ్లు) కూడా లేవని, తద్వారా ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను జిఎంకు వివరిస్తూ సత్వరమే చర్యలు తీసుకోవాల్సిందిగా ఈ సందర్భంగా వారు కోరారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు తాటికొండ వెంకటేశ్వర్లు, తాటికొండ కృష్ణమాచారి, పిల్లి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలి

- ఇంజనీరింగ్ విభాగంలో చేపట్టిన అభివృద్ధి పనుల పై సమీక్ష చేసిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**పెద్దపల్లి ప్రతినిధి :** పెద్దపల్లి జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష జిల్లాలో వివిధ ఇంజనీరింగ్ విభాగాల ఆధ్వర్యంలో రామగిరి,జూలపల్లి,ధర్మారం, మండలాలలో చేపట్టిన అభివృద్ధి పనుల పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, రాబోయే 5 నుంచి 10 సంవత్సరాల వరకు అవసరాలను దృష్టిలో ఉంచుకొని పెద్దపల్లి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు.పాఠశాల అభివృద్ధి పనులకు ఎస్.ఎం.సి (స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ) తీర్మానాల ప్రకారం పూర్తి చేయాలని అన్నారు. పాఠశాలలో స్పష్టమైన మార్పు కనిపించే దిశగా అభివృద్ధి పనులు జరగాలని, అభివృద్ధి పనులు పూర్తి చేసిన తర్వాత వచ్చే మార్పును ప్రజలకు వివరించాలని అన్నారు. జిల్లాలో జూనియర్ కళాశాల అభివృద్ధి పనులకు నిధులు అందుబాటులో ఉన్నందున సంబంధిత పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అన్నారు. జిల్లాలో మంజూరు చేసిన నూతన తహసిల్దార్ కార్యాలయం నిర్మాణ పెండింగ్ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని, డిసెంబర్ చివరి వరకు తహసిల్దార్ భవనాలు అందుబాటులోకి రావాలని, అవసరమైన మేర నిధులను నేరుగా అందిస్తామని, అనవసరంగా పనులు ఆలస్యం చేయవద్దని కలెక్టర్ స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తి చేయాలని అన్నారు. గ్రామపంచాయతీ తీర్మానం ప్రకారం అభివృద్ధి పనులు ఆర్థిక సంవత్సరం ముగిసే లోపు పూర్తయ్యేలా చూడాలని, పూర్తి చేసిన పనులకు సంబంధించి ఎంబి రికార్డింగ్స్ నమోదు చేసి వెల్లుల్లి సమర్పించాలని అన్నారు.పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి శాఖ పరిధిలో మంజూరైన వివిధ రోడ్డు నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించిన కలెక్టర్ చివరి దశలో ఉన్న పనులను వేగవంతం చేసి ప్రజలకు త్వరగా అందుబాటులోకి తీసుకొని రావాలని అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సబ్ సెంటర్లలో మరమ్మతు పనుల పురోగతి వివరాలను తెలుసుకున్న కలెక్టర్ వాటిని సత్వరమే పూర్తి చేయాలని అన్నారు.ఈ సమావేశంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ వనజ, ఈ.ఈ. పి. ఆర్.గిరీష్ బాబు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సమర్థవంతమైన నాయకునికే పార్టీ జిల్లా బాధ్యతలు

## ◆ ఏఐసీసీ పరిశీలకుడు మానె శ్రీనివాస్





**తిమ్మాపూర్, అక్టోబర్ 14:** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం ఎల్ఎండిలోని అరుంధతి ఫంక్షన్ హాల్ లో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడి ఎంపికలో భాగంగా పార్టీశ్రేణుల అభిప్రాయ సేకరణకై మంగళవారం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఆద్వర్యంలో సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏఐసిసి పరిశీలకుడు మానె శ్రీనివాస్ హాజరై మాట్లాడుతూ.... గ్రామస్థాయిలో కాంగ్రెస్ బలోపేతానికి జిల్లా అధ్యక్షులపైనే బాద్యత అధికంగా ఉంటుందని, సమర్థత గల నాయకునికే జిల్లా నాయకత్వ బాధ్యతలు అప్పగించాలన్నదే అధిష్టానం ఉద్దేశమన్నారు. కాంగ్రెస్ ప్రవేశపెట్టిన నూతన విధానం పార్టీ పటిష్టతకు దోహదపడుతుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేస్తూ జిల్లా పార్టీ అధ్యక్షుడి ఎంపిక మాదిరిగానే బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, మండల కాంగ్రెస్ అధ్యక్షుల ఎంపిక జరుగుతుందని తెలిపారు. టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణ మాట్లాడుతూ.... కష్టకాలంలో పార్టీ కోసం కష్టపడ్డవాళ్లను తప్పకుండా గుర్తించి పార్టీ ఆదరిస్తుందని, ప్రజాప్రతినిధుల గెలుపు వెనక కార్యకర్తల కష్టం ఉందని, వాళ్ళ కష్టంతోనే నేతలు అందలమెక్కారని, వ్యక్తిగత విషయాల జోలికి వెళ్లకుండా పార్టీ పటిష్టత కోసం కలిసి కట్టుగా పని చేయాలని సూచిస్తూ పార్టీకి నష్టం కలిగించే పనులకు దూరంగా ఉండాలని హితవు పలికారు. రాహుల్ గాంధీ ఆలోచనా విధానం నుండే సంఘటన్ సృజన్ అభియాన్ పుట్టుకొచ్చిందని కొత్త విధానంతో పార్టీశ్రేణులకు మరింత మంచి జరుగు తుందన్నారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి మాట్లాడుతూ....అన్నివర్గాల వర్గాల గొంతుకగా పనిచేస్తూ ఘన చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీని కాపాడుకోవల్సిన బాధ్యత అందరిపై ఉందని రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు సంఘటన్ సృజన్ అభియాన్ ద్వారా పారదర్శకంగా అధ్యక్షుని ఎంపిక జరుగుతుండగా ఎటువంటి అనుమానం లేకుండా పరిశీలకులు నిర్మోహమాటంగా తమతమ అభిప్రాయాలు వ్యక్తం చేయవచ్చని తెలిపారు. అనంతరం ఆశావాహుల నుండి అభిప్రాయాలు సేకరించారు. టీపీసీసీ ప్రతినిధి చిట్ల సత్యనారాయణ, పీసీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సుధగోని లక్ష్మినారాయణ గౌడ్, ఒగ్గు దామోదర్, ఆరు మండలాల పార్టీ మండలాధ్యక్షులు నందగిరి రవీంద్రచారి, గోపగోని బస్వయ్యగౌడ్, బండారి రమేశ్, ముస్కు ఉపేందర్ రెడ్డి, ముక్కిస రత్నాకర్ రెడ్డి, కోమటిరెడ్డి భాస్కర్ రెడ్డి పనాయకులు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

# కెడిసిసిలో సౌభాగ్య ఎఫ్ డి చేయండి అత్యధిక వడ్డీ పొందండి

## ◆ కేడీసీసీ డిజిఎం వై బ్రహ్మనంద రావు



**రామగిరి, అక్టోబర్ 14:** రామగిరి మండలంలోని ఆదివారంపేట, రాజాపూర్, బేగంపేట గ్రామలలో మంగళవారం ది కరీంనగర్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ లిమిటెడ్ కేడీసీసీ బ్యాంకు అధికారులు ఇంటింటా క్యాంపెనింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకు డిజిఎం బ్రహ్మనందరావు మాట్లాడుతూ, కేడీసీసీ బ్యాంకులో డిపాజిట్ చేస్తే ఇతర బ్యాంకుల కంటే అధిక వడ్డీ వస్తుందని, అలాగే సౌభాగ్య ఫిక్స్ డిపాజిట్ పథకం 333 రోజులు కనుక ఎఫ్డి చేసుకుంటే సాధారణ వడ్డీ 8 శాతం అదే విధంగా సీనియర్ సిటిజన్స్ కు, మహిళలకు 8.50% వడ్డీ ఇస్తున్నామని వారు తెలిపారు. అదేవిధంగా ఏడు రోజుల నుండి 30 రోజుల వరకు నాలుగు శాతం సీనియర్ సిటిజన్స్ కు, మహిళలకు 4.50% అలాగే 31 రోజుల నుండి 90 రోజుల వరకు 5.50% అలాగే సీనియర్ సిటిజన్స్ కు, మహిళలకు ఐదు శాతం వడ్డీ ఇస్తున్నామని అదేవిధంగా 91 రోజుల నుండి 179 రోజుల వరకు 5.50% అలాగే సీనియర్ సిటిజన్స్ కు, మహిళలకు ఆరు శాతం వడ్డి ఇస్తున్నామని అదేవిధంగా 180 రోజుల నుండి ఒక సంవత్సరం లోపు 6.75% అలాగే సీనియర్ సిటిజన్స్ కు, మహిళలకు 8.10% వడ్డీ ఇస్తున్నామని అలాగే ఒక సంవత్సరం నుండి మూడు సంవత్సరాల వరకు 7.60% అలాగే సీనియర్ సిటిజన్స్ కు మహిళలకు అయితే ఎనిమిది పాయింట్ 8. 10% ఇస్తున్నామని మొత్తం స్థూలంగా మూడు సంవత్సరాల నుండి ఎఫ్ డి చేసుకున్న వారికి 7. 25% 7.75% వడ్డీ వస్తుందని తెలిపారు. అలాగే బంగారు ఆభరణాలపై మా బ్యాంకులోని అన్ని శాఖల ద్వారా ప్రతి గ్రాముకు 7 వేల రూపాయల చొప్పున గరిష్టంగా 25 లక్షల వరకు కేవలం 15 నిమిషాలలో ఒక సంవత్సర కాలపరమితి రుణం మంజూరు చేయబడునని అన్నారు. అదేవిధంగా నగదు డిపాజిట్లపై ఎలాంటి హ్యాండ్లింగ్ చార్జెస్ ఉండవని, ఉచిత అకౌంట్ స్టేట్మెంట్ సదుపాయం ఉన్నదని తెలిపారు. అలాగే మూడు నెలల డిపాజిట్ ఆర్ డి సదుపాయం కలదన్నారు. డిపాజిట్ల పై ఐదు లక్షల వరకు డిఐసిజిసి ఇన్సూరెన్స్ భద్రత ఉన్నదని మరిన్ని వివరాలకు సెంటినరీ కాలనీ కేడీసీసీ బ్రాంచ్ ఈ నెంబర్లో 9121014904 సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏజీఎంలు ఎల్ రాజశేఖర్, మహేష్, జిల్లా యూనియన్ ప్రెసిడెంట్ జి హనుమంతరావు, జిల్లా జనరల్ సెక్రెటరీ టి రాజు, కెడిసిసి బ్యాంకు సిఎన్ సి బ్రాంచ్ మేనేజర్ ఎల్ గాంధీ నాయక్, అసిస్టెంట్ మేనేజర్ జి సాగర్, ఫీల్డ్ ఆఫీసర్ ఎం దిలీప్ కుమార్ సిబ్బంది ఎస్ శ్రీనివాస్, పి గురుమూర్తి, ఎఫ్ ఎల్ సి తదితరులు పాల్గొన్నారు.

# మైనార్టీ, ఎస్సీ, ఎస్టీ కులాల వారికి సదా అవకాశం..

## ◆ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి



**శామీర్ పేట కలెక్టరేట్, : అక్టోబర్ 14,** జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కేంద్ర సహాయం లో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు, వారి కుటుంబ ప్రధాన జీవనాధారదారుడు (మహిళ/ పురుషుడు) మరణించిన సందర్భంలో, కుటుంబ పోషణ నిమిత్తం బాధిత కుటుంబానికి ఒకేసారి రూ. 20,000/- (ఇరవై వేలు రూపాయలు మాత్రమే) సహాయంగా అందించబడుతుందని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కుటుంబ ప్రధాన జీవనాధారదారుడి వయస్సు 18 సంవత్సరాలకు మించి 60 సంవత్సరాల లోపు ఉన్న వారు మరణించిన సందర్భంలోఈ పథకం కుటుంబ ప్రధాన జీవనాధారదారుడు పై ఆధారపడి ఉన్న జీవిత భాగస్వామి మైనర్ పిల్లలు, పెళ్లికాని కుమార్తెలు, ఆధారపడిన తల్లిదండ్రులు, మైనర్ సోదరులు/ సోదరీమణులు కుటుంబంగా పరిగణిస్తూ బాధిత కుటుంబానికి ఒకేసారి 20 వేలరూపాయలు ఆర్థిక సహాయంగా అందించడం జరుగుతుందన్నారు. తెల్ల రేషన్ కార్డు కలిగి ఉన్న కుటుంబం మాత్రమే కింద అర్హత కలిగి ఉండి వితంతువు,/లేదా మైనర్ పిల్లలను గృహాలకు చెందిన కుటుంబాలు, మైనర్ పిల్లలు అనాథలుగా ఉన్న కుటుంబాలకు, ఒకరు లేదా అంతకంటే ఎక్కువ మంది మైనర్ పిల్లలు వైకల్యంతో ఉన్న కుటుంబాలకు, ఒకే ఒక్క బిడ్డ ఆడపిల్ల అయిన కుటుంబాలకు, ఒకటి లేదా అంతకంటే ఎక్కువ మంది మైనర్ పిల్లలు అందరూ బాలికలే ఉన్న కుటుంబాలకు, ఒకే బిడ్డ ఉన్న కుటుంబాలకు, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు, మైనారిటీలు, వర్గాలకు చెందిన కుటుంబాలకు ఈ పథకం ద్వారాప్రయోజనం కలుగుతుందని తెలిపారు. అర్హులైన వారు పరిధిలోని మండల తహసీల్దారు కార్యాలయంలో దరఖాస్తు చేసుకొని కేంద్ర ప్రభుత్వం జాతీయ కుటుంబ ప్రయోజనం పథకం కింద లబ్ధి పొందాలని ఆ ప్రకటనలో కలెక్టర్ సూచించారు.

# పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు ఘన సన్మానం

- ఉద్యమకారుడికి దక్కిన గౌరవం

- తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో




**(హైదరాబాద్ ) బ్యూరో:** పెద్దపల్లి జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా నియమితులైన ప్రముఖ న్యాయవాది, తెలంగాణ ఉద్యమకారుడు దొంకెన రవికి తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో ఘన సన్మానం జరిగింది. జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ ప్రాంగణంలో ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు గుండేటి ఐలయ్య యాదవ్ ఆధ్వర్యంలో ఈ రోజున పౌర సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఐలయ్య యాదవ్ మాట్లాడుతూ... ఉద్యమ సహచరునికి కృతజ్ఞతలు అభినందనలు తెలియజేస్తూ రాబోయే రోజుల్లో మరిన్ని ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు. ఒక ఉద్యమకారుడుకి దక్కిన అరుదైన గౌరవం అని, పేద ప్రజల న్యాయపరమైన సమస్యల పరిష్కారంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. అట్టడుగు స్థాయి నుంచి అంచలంచలుగా ఎదుగుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో ఉద్యమకారునిగా నాయకత్వం వహించిన దొంకెన రవికి దక్కిన ఈ గౌరవం జిల్లా ప్రజల విజయంగా భావిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బత్తుల శంకర్, చర్లపల్లి సురేష్ గౌడ్, కందుల అశోక్ పటేల్, గుర్రాల వీరేశం, దామ సదయ్య, లలితా ఠాగూర్, దామలలిత, పొల్లూరి స్వామి, మూల మల్లేశం, కేశవరెడ్డి, పుల్లూరి ప్రేమ్ సాగర్, గడ్డం లక్ష్మి, భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఆ భగవంతుని ఆశీస్సులతో త్వరగా కోలుకోవాలి

## - ప్రమాదంలో గాయపడ్డ జర్నలిస్ట్ సాగర్‌కు మంత్రి శ్రీధర్ బాబు పరామర్శ

**మంథని, అక్టోబర్ 14 ):-** ఆ భగవంతుని ఆశీస్సులతో త్వరగా కోరుకోవాలని మంథని పట్టణంలో ఎలక్ట్రానిక్ మీడియా రిపోర్టర్ మిరియాల సాగర్ యాదవ్ కు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ధైర్యం నింపాడు. ఉత్తరప్రదేశ్ లోని ప్రయాగరాజ్ కు వెళ్లి వస్తున్న సమయంలో రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా సాగర్ ను మంగళవారం రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు పరమార్శించి ఆరోగ్య సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సాగర్ నువ్వు అధైర్య పడద్దని అండగా తాము ఉంటామని ధైర్యం నింపాడు. సాగర్ తల్లిదండ్రులకు ఓదార్చి, త్వరలోనే మీ కుమారుడు ఆరోగ్యంగా కోలుకుంటాడని, సాగరకు తన వంతుగా సహాయ సహకారాలు అందిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. మంత్రి వెంట కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు ఉన్నారు.



# పోగొట్టుకున్న చరవాణిల అందజేత.....!




**తిమ్మాపూర్, అక్టోబర్ 14:** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్లో పోగొట్టుకున్న చరవాణిలను ఎస్ఐ కదిరె శ్రీకాంత్ గౌడ్ మంగళవారం బాధితులకు అందజేశారు. మండలంలోని ఎల్ఎండికాలనీకి చెందిన పెండ్యాల సుధాకర్, చిగురుమామిడి మండలం ఇందుర్తికి చెందిన అనిల్ కుమార్ గత ఆరు నెలల క్రితం తమ చరవాణిలను పోగోట్టుకున్నట్లు ఫిర్యాదు చేయగా సిఇఐఆర్ ద్వారా చరవాణిలను గుర్తించి బాధితులకు అప్పగించారు. ఎవరైనా చరవాణిలను పోగొట్టుకున్నట్లైతే వెంటనే సిఇఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాల్సిందిగా ఎస్ఐ కదిరె శ్రీకాంత్ గౌడ్ కోరారు.

# శ్రీలంక ఏసియన్ త్రో బాల్ ఛాంపియన్ షిప్ పోటీలకు..

## - ఎంపికైన ధీరావత్ మహేష్ నాయక్



**శామీర్‌పేట, అక్టోబర్ 14 :** శ్రీలంకలో రతన్పూర్లో జరగబోయే 8-12 డిసెంబర్లో మొదటి ఏసియన్ త్రో బాల్ ఛాంపియన్షిప్ పోటీలకు లింగాపూర్ తండా గ్రామానికి చెందిన వికలాంగుడైన ధీరావత్ మహేష్ నాయక్ ఎంపిక కావడం జరిగింది. పోటీలలో భారతదేశానికి కెప్టెన్‌గా తనను నియమించిన డాక్టర్ ప్రేమ్ కుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఆల్బర్ట్ త్రో బాల్ ఫెడరేషన్ ప్రెసిడెంట్‌కి అలాగే తన కోచ్ అయినటువంటి సింగారపు బాబు, తనకు వెన్నుదండుగా నడుస్తున్నటువంటి మా తల్లిదండ్రులు ధీరావత్ రామచందర్, అమ్మ బుజ్జి గార్లకు, తమ గ్రామ ప్రజలకు, అందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# ఘనంగా శ్రీరేణుక ఎల్లమ్మ తల్లి కళ్యాణం..

## - కళ్యాణంలో పాల్గొన్న వివిధ పార్టీల నాయకులు, భక్తులు





**శామీర్‌పేట, అక్టోబర్ 14 :** శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మండల కేంద్రం శామీర్‌పేటలో మంగళవారం గౌడ సంఘం ఆధ్వర్యంలో శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయంలో 8వ వార్షికోత్సవంలో భాగంగా అమ్మవారి కళ్యాణోత్సవాన్ని కన్నుల పండువగా యాష్కి కుటుంబ సభ్యులు, గౌడ సంఘం ఆధ్వర్యంలో జరిపారు. ఈ కళ్యాణోత్సవంలో భాగంగా ఉదయం అమ్మవారికి ఘటం తీసుకువెళ్లారు. అనంతరం భక్తుల కోలాహలం, వేద బ్రాహ్మణుల మంత్రోశ్చరణల మధ్య అమ్మవారి కళ్యాణోత్సవాన్ని నిర్వహించారు. అమ్మవారికి సూర్య బోనం సమర్పించారు. భక్తులు ఒడి బియ్యం పోసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయానికి వివిధ పార్టీల నాయకులు, వివిధ గ్రామాల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు విచ్చేసి ఎల్లమ్మ అమ్మవారును అత్యంత భక్తి శ్రద్ధలతో దర్శించుకుని ప్రత్యేక పూజలను చేశారు. పెద్ద ఎత్తున భక్తులకు అన్నదానం.. శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయంలో 8వ వార్షికోత్సవం సందర్భంగా యాష్కి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల నుంచి ఎల్లమ్మ ఆలయానికి వచ్చిన భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు.

# దీపావళి పటాకుల విక్రయానికి అనుమతి తీసుకోవాలి..

## - జినోమ్ వ్యాలీ సీఐ గోపగాని గురువయ్య



**శామీర్‌పేట, అక్టోబర్ 14 :** దీపావళి పండుగ సందర్భంగా తాత్కాలికంగా పటాకుల దుకాణాలు ఏర్పాటు చేసుకునేవారు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలని, అనుమతి కోసం దరఖాస్తులను స్వీకరించడం జరుగుతుందని జినోమ్ వ్యాలీ సీఐ గోపగాని గురువయ్య మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బాణసంచా అమ్మకాలకు దుకాణ దారులు 16వ తేదీలోగా ఆన్లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ముందస్తు అనుమతులు లేకుండా పటాకుల షాపులు ఏర్పాటు చేస్తే చట్టరీత్యా కఠిన చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. నిబంధనలు పాటించని వారి దరఖాస్తులు తిరస్కరించబడుతాయి అని సీఐ గోపగాని గురువయ్య స్పష్టం చేశారు. వివరాలకు జినోమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్ లో సంప్రదించాలని అయన సూచించారు.

# మంత్రి శ్రీధర్ బాబును ఘనంగా సన్మానించిన రజక సంఘం నేతలు



**రామగిరి, అక్టోబర్ 14):-** రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును మంథని రజక సేవా సంఘం నాయకులు మంగళవారం ఘనంగా సన్మానించారు. మంథని రజక కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం రూ. 20 లక్షలను మంత్రి శ్రీధర్ బాబు కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబును శాలువాలు, పూలమాలతో ఘనంగా సత్కరించి ధన్యవాదాలు తెలిపారు. ఈకార్యక్రమంలో రజక సంఘం నాయకులు పోతరాజు సమ్మయ్య, ఐటి పాముల సదానందం, పైడాకుల నాగరాజు, పోతరాజు శ్రీనివాసులు పాల్గొన్నారు.

నినాదం

# ఇండ్లను తొలగించకుండానే రోడ్డు నిర్మాణాలు చేపట్టాలి



**ముత్తారం. అక్టోబర్. 14.:** ముత్తారం మండలం అడవిశ్రీరాంపూర్ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణంలో ఇండ్లను తొలగించవద్దని మంగళవారం గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో గ్రామస్తులు మాట్లాడుతూ రోడ్డుకు ఇరువైపులా ఇండ్లను తొలగించకుండా రోడ్డు పనులు నిర్మించాలని కార్యదర్శి మల్లేశ్వరినీ కోరారు.గ్రామంలో కొంత మంది రోడ్డుకు పక్కన పరిమిత స్థాయిలో ఇంటి నిర్మాణం చేసుకున్న నిరుపేదలు ఉన్నారని, మళ్లీ వారు ఇంకో చోట నిర్మించుకోలేరని వారిని దృష్టిలో పెట్టుకొని నిర్మాణ పనులు చేపట్టాలని గ్రామస్తులు కోరారు.

## నైపుణ్యాభివృద్ధి కోర్సుల శిక్షకురాలిగా పనిచేయడానికి మహిళల నుండి దరఖాస్తుల ఆహ్వానం



**రామగిరి, అక్టోబర్ 14:-** రామగుండం-త్రీ, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాల సింగరేణి సేవా సమితి అధ్వర్యంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను నిర్వహించనున్న డిటిపి(కంప్యూటర్), స్పోకెన్ ఇంగ్లీష్, జూట్ బ్యాగ్స్ తయారీ మొదలగు నైపుణ్యాభివృద్ధి కోర్సుల శిక్షకురాలుగా పనిచేయడానికి ఆసక్తి, అర్హత, అనుభవం గల సింగరేణి ఉద్యోగుల కుటుంబ మహిళలు, పరిసర గ్రామాల మహిళల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు.దరఖాస్తుతో పాటు సంబంధిత విభాగంలో అనుభవ ధృవీకరణ పత్రాలు, ఆధార్ కార్డ్, విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు జతచేసి రామగుండం-త్రీ ఏరియా జీ.ఎం.కార్యాలయంలోని పర్సనల్ విభాగం నందు తేది: 21-10- 2025. సాయంత్రం 5 గంటల లోపు అందజేయాలని కోరారు. ఇతర వివరాలకై ఏరియా పర్సనల్ విభాగం నందు సంప్రదించాలని తెలిపారు.

## ఘనంగా ట్రినిటీ తరంగ్ ఫ్రెషర్స్ పార్టీ వేడుకలు





**పెద్దపల్లి ప్రతినిధి (:** పెద్దపల్లి జిల్లా రాఘవాపూర్ రెడ్డి ఫంక్షన్ హాల్ లో మంగళవారం ట్రినిటీ డిగ్రీ పీజీ కళాశాల ఆధ్వర్యంలో ట్రినిటీ తరంగ్ ఫ్రెషర్స్ పార్టీ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ట్రినిటీ సంస్థల వ్యవస్థాపకులు దాసరి మనోహర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ డిగ్రీ విద్యార్థుల భవిష్యత్తు జీవితంలో ఉన్న మంచి అవకాశాలు విద్యార్థులు అత్యున్నత స్థానానికి ఎదగడానికి అవసరమైన కృషి తదితర విషయాలపై క్లుప్తంగా వివరించారు. అనంతరం కమిటీ సంస్థల డైరెక్టర్ దాసరి మమతారెడ్డి డిగ్రీ విద్య యొక్క విలువలు ప్రాముఖ్యత విద్యార్థులు సాధించవలసిన నైపుణ్యాల గురించి విలువైన సూచనలను విద్యార్థులకు అందించారు.విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శిస్తూ, సాంస్కృతిక కార్యక్రమాలతో వేదికను కళకళలాడించారు.మొత్తం కార్యక్రమం ఆనందోత్సాహ పూర్వక వాతావరణంలో విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీమతి ఎం. నీథా రెడ్డి , వైస్ ప్రిన్సిపాల్ శ్రీ ఎం. రామచందర్ , బోధనా సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## జీతాలు లేవు.. ఇబ్బందిగా ఉంది

### పీకల్లోతు కష్టాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు

### మూడు నెలలుగా వేతనాలు అందక ఇబ్బందులు



**మంథని, :-** మంథనిలో లక్ష్మీ నరసింహ శివ కిరణ్ గార్డెన్స్ లో ఏఐసీసీ అబ్జర్వర్ మాజీ ఎంపీ జయ కుమార్ ని జిల్లా ఫీల్డ్ అసిస్టెంట్ అసోసియేషన్ కలవడం జరిగింది. ఫీల్డ్ అసిస్టెంట్స్ ఎదుర్కొంటున్న సమస్యల గురించి వివరించడం జరిగింది. ఈ సందర్బంగా ఫీల్డ్ అసిస్టెంట్స్ మాట్లాడుతూ అహర్నిశలు కష్టపడుతున్న మాకు గుర్తింపు లేదు. చాలీచాలని జీతాలతో కాలం వెళ్లదీస్తున్నాం. ఉదయం లేవగానే గ్రామంలో తిరిగి ఎంతోమందికి ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పిస్తున్నాం. పారదర్శకంగా పనిచేస్తున్న మమ్మల్ని ప్రభుత్వం గుర్తించడం లేదు. ఉదయం లేవగానే పని కోసం వచ్చే కూలీలను కలుస్తాం. పని అయిపోగానే ఏదో ఒక సర్వే పేరుతో మమ్మల్ని ప్రభుత్వం ఉపయోగించుకుంటుంది. ఎంత కష్టపడినా రూ.9600 చాలీచాలని జీతమే. అది కూడా నెల నెల రావడం లేదు. మూడు నెలల నుండి జీతాలు రావట్లేదు. దీంతో కుటుంబాలను ఎలా పోషించుకోవాలి. ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి. నిత్యవసర ధరలకు అనుకూలంగా పనికి తగ్గ వేతనం అందించాలి.మా డిమాండ్లను నెరవేర్చి మాకు గుర్తింపునివ్వండి అని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఫీల్డ్ అసిస్టెంట్ అసోసియేషన్ ఐఎన్టీయూసీ అధ్యక్షులు ఆవాల ప్రసాద్, జనరల్ సెక్రెటరీ వేల్పుల దేవేందర్, ఉపాధ్యక్షులు ముప్పిడి నగేష్, డివిజన్ అధ్యక్షులు అరుకుల రమేష్, మంథని మండల అధ్యక్షులు అర్జున్, రామగిరి మండల అధ్యక్షులు పెరవేణి కొమరయ్య, ఎంజాల సతీష్, కొత్త ప్రవీణ్, వెంకటేష్, మంథని పోశం మొదలగు వారు పాల్గొన్నారు.

# జంగల్‌ను వదలి జనంలోకి .....

- ఆయుధాలను వదిలి అనుచరులతో కలసి సరెండర్
- 40 ఏళ్ల సుదీర్ఘ ఉద్యమ పోరాటాన్ని విడిచిన మల్లోజుల వేణుగోపాలరావు
- మల్లోజుల తలపై భారీ రివార్డు ప్రకటించిన చత్తీస్ ఘడ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు





**పెద్దపల్లి ప్రతినిధి :** పీడిత ప్రజల పక్షాన అలుపెరుగని పోరాటం చేసిన సిపిఐ మావోయిస్టు పోలిట్ బ్యూరో మెంబర్ మల్లోజుల వేణుగోపాల్ రావు అలియాస్ అభయ్ అలియాస్ సోను దాదా 40 ఏళ్ల సుదీర్ఘ పోరాటానికి విరామం ప్రకటించి జంగల్ ను వదిలి జనంలోకి వచ్చి మంగళవారం మహారాష్ట్ర లోని గడ్చిరోలి జిల్లా పోలీసుల ముందు ఆయుధాలను వదిలి అనుచరులతో సహా లొంగిపోయినట్లు పోలీసులు ప్రకటించారు. తాడిత పీడిత ప్రజల పక్షాన నమ్మిన సిద్ధాంతాలు ఆశయాల కోసం అలుపెరుగని పోరాటాలు చేసిన మల్లోజుల అడవి బాట విడిచి ఆయుధాలను వదిలి జనజీవన స్రవంతిలోకి రావడం పట్ల కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పెద్దపల్లి పట్టణానికి చెందిన మల్లోజుల మధురమ్మ - వెంకటయ్యల చిన్న కుమారుడైన మల్లోజుల వేణుగోపాల్ తన అన్న కిషన్ జి బాటలోనే 1981 లో అడవి బాట పట్టి ఏటూరు నాగారం దళ సభ్యునిగా ఉద్యమ ప్రస్థానాన్ని ప్రారంభించి మహారాష్ట్రలోని గడ్చిరోలి దండకారణ్య ప్రత్యేక జోనల్ కమిటీ అధిపతిగా, రాజ్ కుమార్ అలియాస్ అజాద్ మరణనంతరం సిపిఐ మావోయిస్టు పార్టీ అధికార ప్రతినిధిగా ఎన్నో కీలక బాధ్యతలు నిర్వర్తించిన మల్లోజుల వేణుగోపాలరావు పలు కేసులలో పోలీసులకు సవాల్ గా మారారు. ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్గఢ్ రాష్ట్రాలు మల్లోజుల తలపై ఆరు కోట్ల రివార్డును కూడా ప్రకటించాయి. 2010 సంవత్సరంలో దంతే వాడ ఘటనలో 76 మంది సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ ( సిఆర్పిఎఫ్) పోలీసుల మరణానికి ప్రధాన సూత్రధారి మల్లోజుల వేణుగోపాల్ రావు అని పోలీస్ ఇంటిలిజెన్స్ వర్గాలు అనుమానించాయి. మల్లోజుల వేణుగోపాలరావు 40 ఏళ్ల సుదీర్ఘ ఉద్యమ పోరాటంలో ఎన్నడు కన్నవారిని, కుటుంబ సభ్యులను పిల్లలను చూడడానికి ఇంటి వైపు కన్నెత్తి చూడలేదు. మావోయిస్టు పార్టీలో అత్యంత కీలక విధులు నిర్వహించిన మల్లోజుల సోదరుడైన కిషన్ జి పశ్చిమబెంగాల్లో 2011 నవంబర్ లో జరిగిన ఎన్కౌంటర్ లో కిషన్ జి మరణించిన, కొడుకు వస్తాడని కళ్ళల్లో ఒత్తులు పెట్టుకొని ఎన్నో ఏండ్లు నిరీక్షించిన మల్లోజుల వేణు తల్లి మధురమ్మ 2022వ సంవత్సరంలో కన్ను మూసిన కడసారి కన్నతల్లి చివరి చూపుకు కూడా మల్లోజుల రాలేదు. ఇటీవల మల్లోజుల వేణుగోపాల్ భార్య తార మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర పద్నావిస్ ముందు లొంగిపోయిన వేణుగోపాల్ మాత్రం ప్రజల పక్షాన పోరాటాలు సాగించారు.కేంద్ర హెూం శాఖ మంత్రి ఆపరేషన్ కగార్ పేరుతో 2026 మార్చి నాటికి మావోయిస్టులు లేకుండా చేస్తామని ప్రకటించి కేంద్ర భద్రతా బలగాలతో అడవులను జల్లెడ పట్టి నక్సల్స్ ను ఏరువేస్తున్న క్రమంలో అనేక ఎన్కౌంటర్లలో మొన్నటి వరకు వందలాదిమంది నక్సలైట్లు ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో మల్లోజుల వేణుగోపాల్ ఆయుధాలను వదిలి పెడతామని ప్రకటించగా మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలలోని కొంత కేడర్ వేణు ప్రకటనకు మద్దతు తెలిపింది. దండకారణ్యం లో కేంద్ర భద్రతా బలగాలు చెట్టు పుట్ట అణువణువును గాలిస్తూ మావోయిస్టు నాయకులను మొదలుకొని దళ సభ్యుల వరకు మట్టు పెడుతూ, పోలీసుల తుపాకుల మోతతో అడవులు దద్దరిల్లుతుండగా ఎట్టకేలకు మల్లోజుల వేణుగోపాల్ రావు ఆయుధాలను వదిలి 60 మంది అనుచరులతో పోలీసులకు లొంగిపోవడం మావోయిస్టు పార్టీకి కోలుకోలేని దెబ్బ అని మావోయిస్టు పార్టీ సానుభూతిపరులు, ప్రజా సంఘాల నాయకులు అంటున్నారు. **బాబాయ్ తిరిగి రావడం సంతోషంగా ఉంది : మల్లోజుల దిలీప్** వేణుగోపాల్ రావు ఆయుధాలు వదిలి జనజీవన స్రవంతిలోకి వస్తున్నాడన్న సమాచారంతో మల్లోజుల అన్న కుమారుడు మల్లోజుల దిలీప్ ఆనంద భాష్పాలు రాల్చుతూ సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పెద్దపల్లి పట్టణంలో పాత్రికేయులతో మల్లోజుల దిలీప్ మాట్లాడుతూ బాబాయ్ జనజీవన స్రవంతిలోకి తిరిగి రావడం ఎంతో సంతోషకరంగా ఉందని, కన్నవారిని కుటుంబాన్ని విడిచి, ప్రేమను దూరం



చేసుకుని నమ్మిన సిద్ధాంతం ఆశయాల కోసం అడవి బాట పట్టిన కొడుకు వస్తాడని ఎన్నో ఏళ్ళు ఎదురుచూసిన నానమ్మ (మల్లోజుల మధురమా) చివరకు కన్నుమూసిన కొడుకు కడసారి చివరి చూపు కోసం కూడా రాలేదని ఎట్టకేలకు వనం విడిచి జనంలోకి రావడం సంతోషంగా ఉంది .

# థింక్-పేర్- షేర్ విధానం పై ఉపాధ్యాయులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలి

- ఉపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష




**పెద్దపల్లి ప్రతినిధి :** థింక్-పేర్- షేర్ విధానంపై ఉపాధ్యాయులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఉపాధ్యాయులకు థింక్-పేర్- షేర్ విధానం పై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలో మౌనంగా ఉండేవాళ్ళు, ఇన్ యాక్టివ్ గా ఉండే విద్యార్థులను కూడా భాగస్వామ్యం చేస్తూ మంచి బోధన అందించేందుకు థింక్ పేర్ షేర్ విధానం అమలకు జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ తెలిపారు. థింక్-పేర్- షేర్ విధానం ప్రభుత్వ పాఠశాలలో అమలు చేయడానికి ముందు ఉపాధ్యాయులు దీనిపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని, వారికి ఉన్న ప్రతి అనుమానాలను శిక్షణ కార్యక్రమంలో నివృత్తి చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. థింక్-పేర్- షేం విధానం వల్ల మౌనంగా ఇన్ ఆక్టివ్ గా ఉండే విద్యార్థులు ఎక్కువ మాట్లాడే వాళ్ళు అందరికీ సమానంగా మాట్లాడే అవకాశం కలిగిస్తుందని అన్నారు. బోధనలో ప్రతి ఒక్కరిని భాగస్వామ్యం చేయడం ద్వారా విద్యార్థుల విద్యా ప్రమాణాలు క్రమంగా మెరుగవుతాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జాప్యం లేకుండా సిఎంపిఎఫ్ సేవలు

- సిఎంపిఎఫ్ రీజినల్ కమిషనర్లు హరిపచౌరి, డా: కె.గోవర్ధన్





**రామగిరి,అక్టోబర్14:-** జాప్యం లేకుండా కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ సేవలను ఉద్యోగులకు అందిం చేందుకు కృషి చేస్తున్నామని సిఎంపిఎఫ్ రీజినల్ కమిషనర్లు హరిపచౌరి, డా: కె.గోవర్ధన్ లు అన్నారు.మంగళవారం జి.ఎం కార్యాలయం నందు సంబంధిత అధికారులు, ఉద్యోగులతో "ప్రయాస్" పై అవగాణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.ముందుగా కమిషనర్ ఎన్ సి డబ్ల్యు ఎ ఉద్యోగుల రివైజ్డ్ పెన్షన్ పేమెంట్ 355 పిపిఓ ఆర్డర్స్ ను రామగుండం-త్రీ ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు కు అందజేశారు. ఈ సందర్భంగా సిఎంపిఎఫ్ రీజినల్ కమిషనర్ హరిపచౌరి మాట్లాడుతూ సిఎంపిఎఫ్ లావాదేవీలు అన్ని సి-కేర్స్ పోర్టల్ ద్వారా మాత్రమే జరుగు తున్నాయన్నారు. ఉద్యోగులు ఎలాంటి మధ్యవర్తులు లేకుండా సిఎంపిఎఫ్ సేవలను పారదర్శకంగా పొందవచ్చని తెలిపారు.సిఎంపిఎఫ్ క్లెయిమ్స్, రివైజ్డ్ పెన్షన్ పై ఉద్యోగులకు అవగాహన కల్పించారు.ఉద్యోగుల సందేహాలకు సమాధానం ఇచ్చారు. పెన్షన్ సీఎంపిఎఫ్ దరఖాస్తులు పెండింగ్ ఉండకుండా చర్యలు చేపట్టామన్నారు. జీరో పెండింగ్ స్థాయికి తీసుకువచ్చేందుకు ప్రతి ఉద్యోగి కృషి చేయాలనీ చెప్పారు. రామగుండం-త్రీ ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు మాట్లాడుతూ ఉద్యోగుల సీఎంపిఎఫ్ వివరాలను చూసే సిబ్బంది సీఎంపిఎఫ్ అధికారులతో సమన్వయంతో పనిచేయాలని, ఉద్యోగుల ఒక్క దరఖాస్తు కూడా పెండింగ్ లేకుండా చూడాలని అందుకు తగిన చర్యలు చేపట్టాలని అన్నారు. కార్యక్రమంలో పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, ఫైనాన్స్ డిజియం సి.జె.సురేఖ, డివై పియం వి.సునీల్ ప్రసాద్, సీనియర్ పిఓ పి.రాజేశం, సివిల్ అధికారి మనోజ్, సిఎంపిఎఫ్ సిబ్బంది కామేశ్వర రావు, అనిత, మనోహర్, ప్రదీప్ రెడ్డి తో పాటు వివిధ గనుల సంక్షేమ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పికిల్‌బాల్ క్రీడకు పెరుగుతున్న ప్రజాదరణ

## ◆ జాతీయ పికిల్‌బాల్ విజేతలకు క్రీడా మంత్రి వాకిటి శ్రీహరి సన్మానం

**హైదరాబాద్, (తారజ్యోతి): అక్టోబర్ 14:** తెలంగాణ రాష్ట్ర క్రీడా, యువజన సేవల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు.రాష్ట్ర వ్యాప్తంగా పికిల్‌బాల్ క్రీడ రోజురోజుకు విశేషమైన ప్రజాదరణను సంపాదిస్తున్నదని అయన అన్నారు. ఇటీవల జమ్మూ, కశ్మీర్‌లో నిర్వహించిన జాతీయ పికిల్‌బాల్ టోర్నమెంట్‌లో విజయం సాధించిన క్రీడాకారులను మంత్రినివాసంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఆయన అభినందించారు. మంత్రి మాట్లాడుతూ, పికిల్‌బాల్ క్రీడ అనేది లాన్ టెన్నిస్, బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్‌ల మేళవింపుగా పుట్టిన ప్రత్యేక క్రీడ అని పేర్కొన్నారు. ఈ క్రీడ తెలంగాణలో వేగంగా అభివృద్ధి చెందుతుందని, జిల్లాస్థాయిలో విస్తరించడానికి ప్రభుత్వం అన్ని విధాలుగా సహకారం అందిస్తుందని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో క్రీడలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని, తెలంగాణ క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధిస్తున్నారని కూడా మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేన రెడ్డి, వైస్ చైర్‌పర్సన్ మేనేజింగ్ డైరెక్టర్ డా. సోనిబాలాదేవి, పికిల్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి జగన్మోహన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పికిల్‌బాల్ విజేతలు:

**బంగారు పతకం:**

35 మిక్స్‌డ్ డబుల్స్ సుచరిత, చక్రపాణి

**వెండి పతకాలు:**

-14 సింగిల్స్ విశ్వ కె

60 పురుషుల డబుల్స్ రమేశ్, భాస్కర్

35 మహిళల సింగిల్స్ సుచరిత

**కాంస్య పతకాలు:**

-14 డబుల్స్ ధన్వంత్ విశ్వ

-16 డబుల్స్ తేజస్, త్రిభువన్

35 మిక్స్‌డ్ డబుల్స్ పుష్యమి, రోహిత్

50 మహిళల సింగిల్స్ సోనిబాలా, దేవి

50 మిక్స్‌డ్ డబుల్స్ సోనిబాలా దేవి, బాలాజీ మురుగన్.



# దేశంలో మొదటి ఎఐ సిటీగా మారనున్న విశాఖ

### - విప్లవాత్మక మార్పులకు ఇదో శుభసూచిక - విజినరీ లీడర్ చంద్రబాబు దూర్దృష్టికి తార్కాణం - ఎక్స్ వేదికగా డిప్యూటీ సీఎం పవన్

**అమరావతి, అక్టోబరు14:** దేశంలోని మొదటి ఎఐ సిటీగా విశాఖ మారబోతోందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఎక్స్ వేదికగా ఆనందం వ్యక్తం చేశారు. సిటీ ఆఫ్ డెస్టినీ నుంచి వికసిత్ భారత్ దిశగా చారిత్రాత్మక అడుగు పడిందన్నారు.. ఈ ప్రాజెక్ట్ అందరకీ ఉపయోగపడుతుంది. యువత, రైతులు, వైద్యులు, మత్స్యకారులు, వ్యాపారవేత్తలు, మహిళలు, విద్యార్థుల జీవితాల్లో విప్లవాత్మక మార్పులు వస్తాయన్నారు. విశాఖపట్నంలో 1 గిగావాట్ హైపర్ స్కేల్ డేటా సెంటర్ ఏర్పాటు కోసం ఢిల్లీ వేదికగా ఏపీ ప్రభుత్వం.. గూగుల్‌తో చారిత్రక ఒప్పందం కుదుర్చుకున్న విషయం విదితమే.. ఏపీ సీఎం చంద్రబాబు, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఐటీ, కమ్యూనికేషన్ల శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్, ఏపీ మంత్రి నారా లోకేష్, గూగుల్ క్లౌడ్ సీఈవో థామస్ కురియన్ సహా పలువురు గూగుల్ ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.. ఇక, విశాఖకు గూగుల్ డేటా సెంటర్‌పై ఎక్స్‌లో పవన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు .. గూగుల్ 15 బిలియన్ డాలర్లతో ఎఐ డేటా సెంటర్‌తో విశాఖకు ప్రపంచ స్థాయి గుర్తింపు పొందుతుందన్నారు. వికసిత్ భారత్ లక్ష్యానికి ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వం ప్రధాన ప్రేరణగా పేర్కొన్నారు పవన్ కల్యాణ్.. విశాఖలో ఎఐ డేటా సెంటర్ సాధన సీఎం చంద్రబాబు నాలుగు దశాబ్దాల విజనరీ లీడర్‌షిప్‌కు నిదర్శనంగా అభివర్ణించిన ఆయన.. ఎఐ టెక్నాలజీతో ప్రతి పౌరుడి జీవన ప్రమాణాలు మెరుగుపరచాలన్న లక్ష్యం.. ప్రభుత్వం మాత్రమే కాదు, ఈ కొత్త ప్రగతి యుగానికి అందరం అవసరం అన్నారు. యువత కొత్త ఆవిష్కరణలు చేయాలి, విద్యావేత్తలు పరిశోధనలో ముందుండాలి.. పౌరులు చురుకుగా పాలుపంచుకోవాలి, పరిశ్రమలు విస్తరణకు ముందుకు రావాలి. భవిష్యత్ భారత నిర్మాణంలో విశాఖ కీలక కేంద్రంగా అవతరించనుంది.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గూగుల్ చారిత్రాత్మక భాగస్వామ్యం అవుతుంది.. 15 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడి వస్తుందన్నారు. ఈ ప్రాజెక్టుతో ఆంధప్రదేశ్, దేశం డిజిటల్ రంగంలో కొత్త దిశగా అడుగుపెట్టనుంది అన్నారు పవన్ కల్యాణ్.. వేలాది ఉద్యోగావకాశాలు సృష్టించబోతున్న డేటా సెంటర్ ప్రాజెక్ట్ ఇది..



యువతకు ఆధునిక టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ స్కిల్స్‌లో కొత్త అవకాశాలు వస్తాయి.. డిజిటల్ యుగంలో భారత స్థాయిని గ్లోబల్ లీడర్‌గా బలోపేతం చేసే ప్రాజెక్ట్ ఇది.. దీనిని సహకారం చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు.. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్, మంత్రి నారా లోకేష్, గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్ సహకారానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ట్వీట్ చేశారు.

## లోన్ పేరుతో సైబర్ మోసం దాదాపు 8లక్షలు పోగొట్టుకున్న వ్యక్తి

**హైదరాబాద్, అక్టోబరు14** సైబర్ మోసాల ఎంతగా అవగాహన కల్పిస్తున్న ప్రజలు మోసపోతునే ఉన్నారు. తాజాగా హైదరాబాద్‌లోని బేగంపేటలో ఓ వ్యక్తిని సైబర్ కేటుగాళ్లు మోసగించారు. ఈ కేసుకి సంబంధించిన వివరాలను హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు మంగళవారం వెల్లడించారు. హైదరాబాద్‌లో ఫేక్ ఎన్జీవో లోన్ స్కామ్ వెలుగులోకి వచ్చింది. ఈ స్కాంలో రూ.7.9 లక్షలు బేగంపేటకు చెందిన 30 ఏళ్ల వ్యక్తి మోసపోయాడు. వాట్సాప్ కాల్‌లో ఫౌండర్ సల్మాన్ ఖాన్ డీపీతో ఓ వ్యక్తి రూ.50 లక్షల లోన్ హామీ ఇచ్చాడు. మొదటగా రూ.10 లక్షలు కట్టాలని అడిగాడు. ఆ తర్వాత లోనుకి కావాల్సిన పైసలు ఇస్తానని నమ్మబలికాడు. ఇది నిజమనుకున్న బాధితుడు రూ.7.9లక్షలు కట్టాడు. ఆ తర్వాత బాధితుడిని నేరగాళ్లు మోసం చేశారు. చివరికి మోసపోయినట్లు గ్రహించి బాధితుడు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.అపరిచిత వ్యక్తుల లోన్ ఆఫర్లను నమ్మవద్దని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు సూచించారు. ముందస్తు ఫీజులు, టాక్సులు కట్టవద్దని తెలిపారు. సెలబ్రిటీ డీపీలు లేదా అనుమానాస్పద అకౌంట్లపై అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ధ్రువీకరించిన రిజిస్టర్ సంస్థల ద్వారా మాత్రమే లోన్ అభ్యర్థించాలని సూచించారు. సైబర్ క్రైమ్ మోసం జరిగితే డయల్ - 1930 ద్వారా లేదా ఫిర్యాదు చేయాలని హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు సూచించారు.

## మంత్రుల మధ్య విభేదాలు అబద్ధం మీడియా చిట్‌చాట్‌లో మంత్రి ఉత్తమ్

**నల్గొండ, అక్టోబరు14** ఇరిగేషన్ శాఖలో అవినీతి ఆరోపణలు అవాస్తవమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. తన శాఖ, తన జిల్లా అభివృధి పనులపై తాను ఫోకస్ పెట్టానని వ్యాఖ్యానించారు. మంత్రుల మధ్య సమన్వయం ఉందని.. విబేధాలు లేవని క్లారిటీ ఇచ్చారు. మంగళవారం ఉత్తమ్ కుమార్ రెడ్డి మీడియాతో చిట్ చాట్ చేశారు. తన శాఖలో బదిలీలు నిబంధనల ప్రకారం జరిగాయని.... ప్రాసెస్ అంతా తానే దగ్గరుండి చూశానని చెప్పుకొచ్చారు. నీటి వాటాల్లో తెలంగాణ హక్కుల కోసం పోరాటం చేస్తూనే ఉన్నామని ఉద్ఘాటించారు. కర్ణాటకలో కాంగ్రెస్, మహారాష్ట్రలో బీజేపీ, ఏపీలో టీడీపీ ఉన్నా తమ హక్కులను వదులుకోబోమని స్పష్టం చేశారు. బనకచర్ల, ఆల్మట్టిపై తాము నిబంధనల ప్రకారం ÷ట్ చేస్తున్నామని తెలిపారు. కృష్ణా, గోదావరిలో నీటి వాటాల కోసం తమ ప్రభుత్వం కమిట్‌మెంట్‌తో పనిచేస్తోందని పేర్కొన్నారు. త్వరలోనే తాము మహారాష్ట్ర వెళ్తున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పుకొచ్చారు. కేసీఆర్ పదేళ్లలో చేసింది ఏమీలేదని ఆక్షేపించారు. కాళేశ్వరం పేరుతో మిగతా ప్రాజెక్టులను కేసీఆర్ పట్టించుకోలేదని ఫైర్ అయ్యారు. కాళేశ్వరం నీళ్లు లేకున్నా... భారతదేశ చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా పంటలు పండాయని నొక్కిచెప్పారు. ధాన్యం కొనుగోలు కోసం రూ.25 వేల కోట్లు రైతులకు కేటాయిస్తున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

## బిసి రిజర్వేషన్లు అడ్డుకున్న బిజెపి, బిఆర్ఎస్

### అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుతో తట్టుకోని బిఆర్ఎస్ మంత్రి కొండా సురేఖ మండిపాటు

**వరంగల్కాం, అక్టోబరు14:** కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై బీఆర్ఎస్ శ్రేణులు సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తున్నారని మంత్రి కొండా సురేఖ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం వరంగల్ తూర్పు నియోజకవర్గంలో మంత్రి కొండా సురేఖ పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి కొండా మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్, బీజేపీ రెండు పార్టీల నేతలు కలిసి స్థానిక ఎన్నికలని అడ్డుకున్నారని ఆరోపించారు. బీసీ రిజర్వేషన్‌కి కట్టుబడి 42శాతం రిజర్వేషన్లు ఇస్తున్నామని..తెలంగాణ అసెంబ్లీలో చర్చజరిపిఆమోదించామని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా తూర్పు నియోజకవర్గంలో సీఎంఆర్ఎఫ్ నిధులు అందించామని స్పష్టం చేశారు. ప్రతి నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ పాఠశాల కోసం రూ.200 కోట్ల నిధులను తమ ప్రభుత్వం కేటాయించిందని ప్రకటించారు మంత్రికొండాసురేఖ.త్వరలోనే ఇంటిగ్రేటెడ్ పాఠశాలలకి భూమి పూజ చేస్తామని వివరించారు. అర్హులైన లబ్దిదారు లందరికీ రేషన్ కార్డులు అందించామని స్పష్టం చేశారు. త్వరలోనే వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ప్రారంభోత్సవం చేస్తామని వెల్లడించారు. దేశంలో ఎక్కడ లేని విధంగా సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని ఉద్ఘాటించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులకు పెద్దపీట వేశామని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు.

## తాలిబన్ నేతను ఎలా స్వాగతిస్తారు ఎక్స్ వేదికగా మండిపడ్డ జావేద్ అఖ్తర్

**న్యూఢిల్లీ, అక్టోబరు14** అఫ్ఘానిస్తాన్ విదేశాంగ మంత్రి, సీనియర్ తాలిబాన్ నాయకుడు అమీర్ ఖాన్ ముత్తకీ భారత పర్యటన సందర్భంగా ఆయనకు లభించిన ఆదరణపై దిగ్గజ బాలీవుడ్ గేయరచయిత జావెద్ అఖ్తర్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. సోషల్ మీడియా వేదికగా స్పందించిన ఆయన.. ప్రపంచంలోనే అత్యంత దారుణమైన ఉగ్రవాద సంస్థగా పేరొందిన తాలిబాన్ ప్రతినిధికి ఉగ్రవాదాన్ని వ్యతిరేకిస్తామని ఉపన్యాసాలు ఇచ్చే బీజేపీ ప్రభుత్వం అందిస్తున్న గౌరవం, స్వాగతం చూస్తుంటే సిగ్గుతో తన తల వాలిపోతుందని జావేద్ తెలిపాడు. అలాగే ఉత్తరప్రదేశ్‌లోని దారుల్ ఉలూమ్ దియోబంద్ ఇస్లామిక్ సెమినరీలో ముత్తకీకి అందించిన గౌరవప్రదమైన స్వాగతంపై కూడా అఖ్తర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అమ్మాయిల విద్యను పూర్తిగా నిషేధించిన వ్యక్తులలో ఒకరైన తమ ఇస్లామిక్ హీరోకు ఇంతటి గౌరవం ఇచ్చిన దియోబంద్‌కు కూడా సిగ్గుండాలి అని ఆయన ఘాటుగా విమర్శించారు. చివరగా, 'నా భారతీయ సోదరీ సోదరులారా! మన దేశంలో ఏం జరుగుతోంది? అంటూ ఆందోళన వ్యక్తం చేశారు. కాగా, ఈ పోస్ట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది.

## డిగ్రీ సెమిష్టర్ ఫీజులు తగ్గించాలి

**హనుమకొండ, అక్టోబరు14** కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, అదిలాబాద్ జిల్లాలలో చదువుతున్న డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థులకు పెంచిన మొదటి సెమిస్టర్ ఫీజులను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు కేయూలో ఆందోళన చేపట్టారు. కేయూ పరిపాలన భవనం ఎదుట బైఠాయించి అధికారులకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. యూనివర్సిటీ ఇచ్చిన ఫీజు పట్టికను అనుసరించకుండా అధిక ఫీజులు తీసుకుంటున్న ప్రైవేటు డిగ్రీ కాలేజీపై చర్యలు తీసుకోవాలని డెమొక్రటిక్ స్టూడెంట్స్?అసోసియేషన్(డీఎస్ఏ) డీఎస్ఏ జిల్లా కన్వీనర్ ఉప్పుల శివ డిమాండ్ చేశారు. కాకతీయ యూనివర్సిటీ విడుదల చేసిన మొదటి సెమిస్టర్ ఫీజు ప్రకటనలో భారీగా మార్పులు జరిగాయని విద్యార్థుల తల్లిదండ్రులు పేద మధ్యతరగతి కుటుంబాలని వారు పొద్దున లేస్తే ఎర్రని ఎండలో పనిచేస్తూ వాళ్ల పిల్లలు బాగా చదువుకోవాలని ఆశతో డిగ్రీలు చదివిస్తుంటే యూనివర్సిటీ అధికారులు మాత్రం ఏమాత్రం కనికరం లేకుండా భారీగాఫీజులుపెంచుతుంటే పేద కుటుంబాల విద్యార్థులు ఎలా చదువుకోవాలని ప్రశ్నించారు. ఇంతకుముందు ఉన్న రిజిస్ట్రేషన్ ఫీజు రూ.80 ఇప్పుడు ఏకంగా రూ.1200 పెంచడం సిగ్గుచేటని, వివిధ రకాల పేర్లతో మొత్తం ఫీజు విద్యార్థులు కట్టాల్సింది రూ.1340 కానీ ఇప్పుడు రూ.3250 పెంచడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. వెంటనే పెంచిన ఫీజులు మొత్తం తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డెమొక్రటిక్ స్టూడెంట్స్ అసోసియేషన్ జిల్లా నాయకులు సంజయ్, జాషువా రాజ్‌కుమార్, శశిధర్, శ్రీధర్, డిగ్రీ విద్యార్థులు పాల్గొన్నారు.

## గాడిద చర్మం నుంచి ఔషధాల తయారీ

**లాహోర్, అక్టోబరు14:** చైనా తాజాగా పాకిస్థాన్ నుంచి రెండు వేల గాడిదలను కొనుగోలు చేసింది. పాకిస్థాన్ నుంచి చైనా అత్యధికంగా గాడిదలను దిగుమతి చేసుకుంటోంది. ఈ నేపథ్యంలో 2024లో ఈ రెండు దేశాల మధ్య డీల్ కుదిరింది. ఈ డీల్ ప్రకారం చైనాకు పాకిస్థాన్ 20 వేల గాడిదలను ఎగుమతి చేయాలి. ఈ నేపథ్యంలో పాకిస్థాన్‌లోని కరాచీ పోర్ట్‌కు సమీపంలో ఓ భారీ కబేళాను నిర్మించాలని చైనా భావిస్తోంది. పాకిస్థాన్‌లో ప్రస్తుతం 52 లక్షల గాడిదలు ఉన్నాయి. ప్రపంచంలో అత్యధిక గాడిదలను కలిగిన మూడో దేశంగా పాకిస్థాన్ ఉంది.ఈ నేపథ్యంలో పాకిస్థాన్ గాడిదలను దిగుమతి చేసుకునేందుకు చైనా గతేడాది ఒప్పందం కుదుర్చుకుంది. గాడిద చర్మంతో చైనాలో సాంప్రదాయ ఔషధాలను తయారు చేస్తారు. గాడిద చర్మాన్ని ఉపయోగించి ఎజియావో అనే సాంప్రదాయ ఔషధాన్ని చైనీయులు తయారు చేస్తారు. ఈ ఔషధం రోగనిరోధక శక్తిని మెరుగుపరచడానికి, అలసట, కణితులను తగ్గించడానికి, రక్తహీనత చికిత్సకు సాయపడుతుందని చైనీయులు నమ్ముతారు. ఎజియావో ఔషధానికి చైనాలో భారీ డిమాండ్ ఉంది . అయితే ఈ ఔషధ తయారీకి తగినన్ని గాడిదలు చైనాలో లేవు. దీంతో గాడిదల కోసం పాకిస్థాన్‌పై ఆధారపడుతున్నారు. అయితే చైనా డీల్ కారణంగా పాక్‌లో గాడిదలకు విపరీతమైన డిమాండ్ పెరిగిందని సమాచారం. ఐదేళ్ల క్రితం ఒక్కో గాడిద ఖరీదు రూ.30 వేలుగా ఉండేదట. ప్రస్తుతం పాక్‌లో ఒక్కో గాడిద ఖరీదు రూ.2 లక్షలకు పైగా పలుకుతోందట. దీంతో గాడిదలను ఉపయోగించి పనులు చేసుకుని పాక్ వాసులు కష్టాలు పడుతున్నారట.

## చెన్నైలో జరిగిన 16వ సౌత్‌జోన్ షాట్‌గన్ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో తెలంగాణకు ఘన విజయం

### - తుమ్మలపల్లి అగస్త్య రెడ్డి బంగారు పతకాన్ని,వెన్న నవీన్‌కుమార్ స్కీట్ ఈవెంట్‌లో కాంస్య పతకం సాధించారు



**హైదరాబాద్, (తారజ్యోతి): అక్టోబర్ 14:** తమిళనాడులోని చెన్నై రైఫిల్ క్లబ్‌లో అక్టోబర్ 11 నుండి 14 వరకు జరిగిన 16వ సౌత్‌జోన్ షాట్‌గన్ షూటింగ్ ఛాంపియన్‌షిప్ 2025లో హైదరాబాద్ షూటర్లు తమ ప్రతిభతో మెరిసారు.తెలంగాణ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించిన తుమ్మలపల్లి అగస్త్య రెడ్డి బంగారు పతకాన్ని,వెన్న నవీన్‌కుమార్ స్కీట్ ఈవెంట్‌లో కాంస్య పతకాన్ని గెలుచుకుని రాష్ట్రానికి గౌరవం తీసుకువచ్చారు.ఈఇద్దరుషూటర్లు హైదరాబాద్‌లోని చేతన్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ పొందారు. పోటీల్లో కర్ణాటక, తమిళనాడు, కేరళ, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, పుదుచ్చేరి రాష్ట్రాలకు చెందిన షూటర్లు పాల్గొన్నారు. విజేతలకు అవార్డులను తమిళనాడు పోలీస్ కమిషనర్ టి.శంకర్ (ఐపీఎస్), తమిళనాడు రైఫిల్ అసోసియేషన్ అధ్యక్షుడు డివిఎస్ రావు, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రాజ్ రాజ్‌గోపాల్ తోడైమాన్, వైస్ ప్రెసిడెంట్ రవి, కార్యదర్శి రాజశేఖర్ పాండియన్ ప్రదానం చేశారు.

## వి6తో హెచ్ సి ఏ లో ఎంపిక అయిన ప్లేయర్స్ పై రాచకొండ సీపీ కి పిర్యాదు చేసిన అనంత రెడ్డి

### - పిర్యాదును ఎంక్వైరీ నిమిత్తం ఉప్పల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు: సిపి సుధీర్ బాబు...

**హైదరాబాద్, (తారజ్యోతి): అక్టోబర్ 14:** ఒక ప్లేయర్‌కు రెండు బర్త్ సర్టిఫికేట్స్ ఏవిధంగా ఉంటాయి. గతంలో ఆ సర్టిఫికెట్లను పరిశీలించి వాటిని ఫేక్ గా ధ్రువీకరించారు.. అయినా సెలక్టర్లు మళ్ళీ వాళ్ళను తీసుకొని ఆడించడం చాలా బాధాకరం... వేరే స్టేట్ వాళ్ళు ఇక్కడ ఆడటం వల్ల తెలంగాణలో ఉన్న వారికి నష్టం జరుగుతుంది... ఈ రోజు ఇచ్చిన పిర్యాదు ప్రకారం పోలీసులు దర్యాప్తు చేసి సెలెక్టర్లపై చర్యలు తీసుకోవాలి.. మెయిన్ టీమ్ ప్రాబబుల్ టీమ్స్ తీసే ముందు కెమరా ఉండాలి. కానీ ఒక్క కెమరా లేదు.. క్రికెట్ చరిత్రలో ఎప్పుడు ఏ మ్యాచ్ క్యాన్సల్ కాదు.కానీ వీరు క్యాన్సల్ చేశారు. ఇప్పుడు డబ్బులు ఉన్నవాళ్లు క్రికెట్ ఆడే పరిస్థితి నెలకొంది...సెలెక్టర్లు ఏ ప్రలోభాలకు లోన్ అవుతున్నారు పోలీసులు ప్రభుత్వము సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

## గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు

### 10వేల కోట్ల పెట్టుబడులు వస్తాయి: పెమ్మసాని

**న్యూఢిల్లీ, అక్టోబరు14:** విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ద్వారా ఏపీ ప్రభుత్వానికి రూ.10 వేల కోట్ల ఆదాయం వచ్చే అవకాశం ఉందని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. దీనితో పాటు ఇతర టెక్ సంస్థలూ విశాఖకు వచ్చే అవకాశం ఉందన్నారు. గూగుల్.. విశాఖకు రావడానికి ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ విశేషంగా కృషి చేశారని చెప్పారు. విశాఖపట్నంలో 1 గిగావాట్ హైపర్ స్కేల్ డేటా సెంటర్ ఏర్పాటుపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గూగుల్‌తో మంగళవారం ఢిల్లీలో చారిత్రక ఒప్పందం కుదర్చుకుంది. ఈ ప్రాజెక్టు ద్వారా గూగుల్ సుమారు 15 బిలియన్ అమెరికన్ డాలర్ల పెట్టుబడి పెట్టనుంది. ఈ సందర్భంగా మంత్రి పెమ్మసాని మాట్లాడుతూ ఇది ఓ పెద్ద ముందడుగు అన్నారు. గూగుఉలతో అనేకమందికి ఉద్యోగావకాశాలు వస్తాయన్నారు. విశాఖ రూపురేఖలు మారుతాయన్నారు.

## ప్రధాని పర్యటనపై మంత్రి మండిపల్లి సమీక్ష

### ప్రత్యేక బస్సులు ఏర్పాటుకు ఆదేశాలు

**అమరావతి, అక్టోబరు14:** ప్రధాని మోదీ పర్యటన ఏర్పాట్లపై రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అధికారులతో సమీక్ష నిర్వహించారు. జీఎస్టీ తగ్గింపుపై మోదీని ఆయన అభినందించారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని తీసుకున్న జీఎస్టీ నిర్ణయం చరిత్రాత్మకమన్నారు. ఈ నెల 16న కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ప్రధాని పర్యటన నేపథ్యంలో ఆర్టీసీ ఏర్పాట్లపై మంత్రి ఆరా తీశారు. ప్రధాని పర్యటన దృష్ట్యా 3,500 బస్సులు సిద్ధం చేయాలని నిర్ణయించారు. కర్నూలు జిల్లా నన్నూరులో నిర్వహించనున్న సభకోసం 3,070 ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయనున్నారు. శ్రీశైలం పర్యటన కోసం అదనంగా 150 బస్సులు సిద్ధం చేయనున్నారు. పోలీసులు, భద్రతా సిబ్బందిరవాణాకోసం80 బస్సులు కేటాయించారు.

## పర్వతారోహకుడు భరత్ రికార్డు మౌంట్ చో ఒయు పర్వతం అధిరోహణ

**అమరావతి, అక్టోబరు14:** కర్నూలుకు చెందిన 36 ఏళ్ల పర్వతారోహకుడు భరత్ తమ్మినేని అరుదైన ఘనత సాధించారు. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన 14 శిఖరాల్లో ఒకటైన చైనాలోని 8,188 మీ ఎత్తున్న మౌంట్ చో ఒయు పర్వతాన్ని అధిరోహించారు. కాగా ఇప్పటికే భరత్ 8 అత్యంత ఎత్తైన పర్వతాలను విజయవంతంగా అధిరోహించినట్లు సమాచారం. తాజాగా మౌంట్ చో ఒయు పర్వతాన్ని ఎక్కి.. ప్రపంచంలోని ఎత్తైన శిఖరాలలో తొమ్మిదింటిని అధిరోహించిన మొదటి భారతీయుడిగా నిలిచాడు. భరత్ తమ్మినేని మే 2017లో మౌంట్ ఎవరెస్ట్.. సెప్టెంబర్ 2018లో మౌంట్ మనస్లు, మే 2019లో మౌంట్ లోట్సే, మార్చి 2022లో అన్నపూర్ణ, ఏప్రిల్ 2022లో కాంచన్‌జంగా, మే 2023లో మకాలు, అక్టోబర్ 2024లో శిశాపాంగ్మా, ఏప్రిల్ 2025లో మౌంట్ ధౌలగిరి....తదితర 8,000 మీటర్లకు పైగా ఎత్తైన శిఖరాలను అధిరోహించినట్లు అధికారులు పేర్కొన్నారు. మంగళవారం ఉదయం 6.55గంటలకు ట్రెక్కింగ్ ప్రారంభించి, 8.55గంటలకు పర్వత శిఖరాన్ని చేరుకున్నట్లు తెలిపారు. దీంతో ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన 14 శిఖరాల్లో తొమ్మిదింటిని విజయవంతంగా అధిరోహించి..రికార్డు నెలకొల్పారు.

## ఎపి హైకోర్టుకు ముగ్గురు న్యాయమూర్తుల బదిలీ

**న్యూఢిల్లీ, అక్టోబరు14:** ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు ముగ్గురు న్యాయమూర్తులు బదిలీ అయ్యారు. గుజరాత్ హైకోర్టు నుంచి జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్, అలహాబాద్ హైకోర్టు నుంచి జస్టిస్ దూండి రమేష్, కలకత్తా హైకోర్టు నుంచి జస్టిస్ సుబేందు సమంత బదిలీ అయ్యారు. ఈ ముగ్గురు జడ్జిలను ఏపీ హైకోర్టుకు బదిలీ చేయాలని గతంలో సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు చేసింది. కొలీజియం సిఫారసు మేరకు ముగ్గురు న్యాయమూర్తుల బదిలీకి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మూ తాజాగా ఆమోదం తెలపగా.. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి.

# స్పోర్ట్స్

# రెండో టెస్టులో భారత్ ఘన విజయం..

**7 వికెట్ల తేడాతో వెస్టిండీస్ పై విక్టరీ**

**గిల్ కెప్టెన్సీలో 2-0తో తొలి సిరీస్ సొంతం**



శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీలో టీమిండియా తొలి టెస్ట్ సిరీస్ నెగ్గింది. ఢిల్లీలో వెస్టిండీస్‌తో జరిగిన రెండో టెస్టులో భారత్ 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది. మొదటి ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్, బౌలింగ్‌లో అద్భుత ప్రదర్శన చేసిన తర్వాత, పర్యాటక జట్టు విండీస్‌ను ఫాలో-ఆన్ ఆడించింది. తొలి టెస్టులో ఎదురైన సీన్ దాదాపు రిపీట్ అయింది. అయితే, వెస్టిండీస్ బ్యాటర్లు రెండో ఇన్నింగ్స్ లో తమ పోరాటాన్ని చూపారు. ఈసారి చాలా ధైర్యంగా, నిలకడగా భారత బౌలర్లను ఎదుర్కొన్న తీరు అమోఘం. అయితే భారత్ ఛేదించడానికి 121 పరుగుల సాధారణ లక్ష్యాన్ని ఇచ్చింది విండీస్ జట్టు. 4వ రోజు ఆట ముగిసే సమయానికి భారత్ ఒక వికెట్ నష్టపోయి 63 పరుగులు చేసింది. ఆరంభంలోనే ఎదురుదెబ్బ తగిలినా, భారత్ సునాయాసంగా విజయం సాధించింది.కేఎల్ రాహుల్ ఈ సిరీస్‌లో అద్భుతంగా రాణించాడు. కీలక సమయాల్లో నిలకడగా బ్యాటింగ్ చేశాడు. మొదటి టెస్ట్ మ్యాచ్‌లో సెంచరీ (100 పరుగులు) సాధించాడు. ఇప్పుడు రెండో మ్యాచ్‌లో వెస్టిండీస్ నిర్దేశించిన స్కోర్‌ను ఛేజింగ్ చేసే క్రమంలో హాఫ్ సెంచరీ చేశాడు. 58 పరుగులతో మ్యాచ్ ముగించాడు. నిన్న మరో ఓపెనర్ యశస్వి జైస్వాల్ త్వరగా అవుట్ అయిన తర్వాత పరిస్థితులను చక్కదిద్దాడు. తాజా ఇన్నింగ్స్ తో టెస్ట్ ఫార్మాట్‌లో రాహుల్ ఖాతాలో 20 అర్ధ సెంచరీలు, 11 సెంచరీలు ఉన్నాయి. సాయి సుదర్శన్ 76 బంతుల్లో 39 పరుగులు చేసి ఔటయ్యాడు. రెండో టెస్ట్ మ్యాచ్ మొదటి ఇన్నింగ్స్‌లోనూ 87 పరుగులతో రాణించాడు. ఫీల్డింగ్ లోనూ మెరిశాడు. మొదటి టెస్ట్‌లో 50 పరుగులు, ఈ మ్యాచ్ మొదటి ఇన్నింగ్స్‌లో 129 పరుగులు చేసిన శుభ్‌మన్ గిల్ 4వ స్థానంలో బ్యాటింగ్‌కు దిగి కేవలం 13 పరుగులు చేసి అవుట్ అయ్యాడు. ఆ తర్వాత ధ్రువ్ జురెల్, కేఎల్ రాహుల్ విజయానికి కావాల్సిన పరుగులు చేశారు.విండీస్‌తో జరిగిన టెస్ట్ సిరీస్‌లో టీమిండియా ఎపెనర్ యశస్వి జైస్వాల్ 219 పరుగులతో సిరీస్‌ను టాప్ స్కోరర్‌గా ముగించాడు. రెండో టెస్ట్ మొదటి ఇన్నింగ్స్‌లో అతను చేసిన 175 పరుగులు సిరీస్ లో అత్యుత్తమ స్కోరు. జైస్వాల్ తర్వాత కేఎల్ రాహుల్ (196 పరుగులు), శుభ్‌మన్ గిల్ (192) ఉన్నారు. వికెట్లలోనూ భారత బౌలర్లు ఆధిపత్యం చెలాయించారు. లెఫ్టార్మ్ స్పిన్నర్, చైనామన్ బౌలర్ కుల్దీప్ యాదవ్ 12 వికెట్లతో అగ్ర స్థానంలో నిలవగా, ఆ తర్వాత స్థానాల్లో ఉన్న మహ్మద్ సిరాజ్, రవీంద్ర జడేజా వరుసగా 10, 8 వికెట్లు తీశారు.భారత్ తొలి ఇన్నింగ్స్ 518/5 వద్ద డిక్లేర్ జైస్వాల్ (175), శుభ్‌మన్ గిల్ (129 నాటౌట్), ధ్రువ్ జురెల్ (44), నితీశ్ రెడ్డి (43) రాణించారు. కుల్‌దీప్ యాదవ్ (5/82), జడేజా (3/46)

భారత్ రెండో ఇన్నింగ్స్ 124/3 వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్ : 248 ఆలౌట్

రెండో ఇన్నింగ్స్: 390 ఆలౌట్ కాంప్‌బెల్ (115), షై హెూప్ (103), జస్టి



## విజయం సాధించాలనే ఫాలో ఆన్ ఆడించాం

**టీమిండియా టెస్ట్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్**

విజయం సాధించాలనే లక్ష్యంతోనే వెస్టిండీస్‌ను ఫాలో ఆన్ ఆడించామని టీమిండియా టెస్ట్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తెలిపాడు. ఆఖరి రోజు విజయానికి కావాల్సిన 6 , 7 వికెట్లు తీయడం కష్టమవుతుందని భావించే ఈ నిర్ణయం తీసుకున్నామని స్పష్టం చేశాడు. న్యూఢిల్లీ వేదికగా మంగళవారం ముగిసిన రెండో టెస్ట్‌లో టీమిండియా 7 వికెట్ల తేడాతో గెలుపొందింది. ఈ విజయంతో రెండు టెస్ట్‌ల సిరీస్‌ను టీమిండియా 2-0తో క్లీన్ స్వీప్ చేసింది. కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్‌కు ఇదే తొలి సిరీస్ విజయం.ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 518/5 భారీ స్కోర్ వద్ద డిక్లేర్ చేసింది. వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్‌లో 248 పరుగులకు ఆలౌట్ కాగా.. భారత్‌కు 270 పరుగుల భారీ ఆధిక్యం దక్కింది. దాంతో విండీస్‌ను ఫాలో ఆన్ ఆడించి ఇన్నింగ్స్ తేడాతో గెలవాలని భారత్ భావించింది. కానీ ఈ వ్యూహం బెడిసి కొట్టింది.బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉన్న వికెట్‌పై వెస్టిండీస్ పోరాడింది. రెండో ఇన్నింగ్స్‌లో 390 పరుగుల భారీ స్కోర్ చేసింది. దాంతో ఆఖరి రోజు టీమిండియా బ్యాటింగ్ చేయాల్సి వచ్చింది. విండీస్ మరో 100-120 పరుగులు చేసి ఉంటే ఈ మ్యాచ్‌లో టీమిండియాకు విజయం కష్టమయ్యేది. ఈ క్రమంలోనే ఫాలో ఆన్ ఆడించడంపై విమర్శలు వచ్చాయి.మ్యాచ్ అనంతరం ఈ నిర్ణయం వెనుక ఉన్న కారణాన్ని శుభ్‌మన్ గిల్ వివరించాడు. 'భారత జట్టుకు సారథ్యం వహించడం గొప్ప గౌరవం. కెప్టెన్సీకి నేను అలవాటు పడుతున్నాను. పరిస్థితులకు తగ్గట్లు నిర్ణయాలు తీసుకుంటున్నాను. కండిషన్స్‌కు తగ్గట్లు ఏ ఆటగాడు పరుగులు చేస్తాడు..? ఏ బౌలర్ వికెట్ తీస్తాడనే విషయాన్ని పరిగణలోకి తీసుకొని ధైర్యంగా నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుంది. మాకు సుమారు 300 పరుగుల ఆధిక్యం లభించింది. మేం మళ్లీ బ్యాటింగ్ చేసి 500 పరుగులు చేసినా.. ఆఖరి రోజు 5, 6 వికెట్లు తీయాల్సి వస్తే కష్టమవుతుందని భావించాం. విజయం సాధించాలనే లక్ష్యంతోనే ఫాలో ఆన్ ఆడించాం. ఆస్ట్రేలియా పర్యటనకు ముందు బ్యాటింగ్ ప్రాక్టీస్ లభించాలనే నితీష్ రెడ్డిని అప్‌దీ ఆర్డర్ ఆడించాం.ఈ మ్యాచ్‌లో అతను బౌలింగ్ చేయలేదు. విదేశాల్లోనే నేరుగా బ్యాటింగ్ చేయాల్సి వస్తే ఆటగాళ్లు ఒత్తిడికి గురవుతారు. అందుకే స్వదేశంలోనే కొందరి ఆటగాళ్లకు అవకాశం ఇచ్చి వారిని విదేశీ పర్యటనకు సిద్ధం చేయాలనుకున్నాం. నేను బ్యాటింగ్ వెళ్లినప్పుడు బ్యాటర్‌గానే నిర్ణయాలు తీసుకుంటాను. నేను 3-4 ఏళ్ల వయసు నుంచి బ్యాటింగ్ చేస్తున్నాను. కాబట్టి బ్యాటర్‌గా ఆలోచిస్తాను. ఏం చేసినా జట్టు విజయం కోసమే చేస్తాను. ఆస్ట్రేలియా పర్యటనకు సంబంధించి ఇంకా ఎలాంటి ప్రణాళికలు రచించలేదు. అది సుదీర్ఘ విమాన ప్రయాణం. ఫ్లైట్‌లో కూడా ప్లాన్ చేసుకోవచ్చు.'అని శుభ్‌మన్ గిల్ చెప్పుకొచ్చాడు.

## బాబర్ అజామ్ ఘోరంగా విఫలం

బాబర్ అజామ్ కష్టకాలం ఇప్పుడిప్పుడే ముగిసేలా లేదు. దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి టెస్ట్ రెండో ఇన్నింగ్స్‌లో కూడా ఈ కుడిచేతి వాటం బ్యాట్స్‌మన్ ఘోరంగా విఫలమయ్యాడు. తొలి ఇన్నింగ్స్‌లో 23 పరుగులకే ఔటయ్యాడు. ఇక రెండో ఇన్నింగ్స్‌లో సెట్ అయిన తర్వాత వికెట్ కోల్పోవడం గమనార్హం. రెండో ఇన్నింగ్స్‌లో బాబర్ అజామ్ 72 బంతులు ఆడి, 42 పరుగులు చేశాడు. కానీ, ఆ తర్వాత కగిసో రబాడ చేతిలో ఎల్బీడబ్ల్యూగా ఔటయ్యాడు. సెట్ అయిన తర్వాత వికెట్ కోల్పోతున్న బాబర్ అజామ్ తీరు చూసి పాక్ జట్టు ఆందోళనకరంగా ఉంది.టెస్ట్ సెంచరీ కోసం బాబర్ ఆజం ఎదురుచూపులు కొనసాగుతున్నాయి. ఈ కుడిచేతి వాటం బ్యాట్స్‌మన్ 74 ఇన్నింగ్స్‌లలో ఒక్క టెస్ట్ సెంచరీ కూడా చేయలేదు. 2023 నుంచి అతని బ్యాటింగ్ సగటు కేవలం 23.75 మాత్రమే. బాబర్ ఆజంకు ఆందోళన కలిగించే అంశం ఏమిటంటే, అతని చివరి 28 టెస్ట్ ఇన్నింగ్స్‌లలో, అతను కేవలం రెండు అర్ధ సెంచరీలు మాత్రమే సాధించాడు. అతను ప్రతిసారీ మంచి ఆరంభాలను పొందినప్పటికీ, వాటిని పెద్ద స్కోర్‌లుగా మార్చలేకపోతున్నాడు. అతని చివరి 15 ఇన్నింగ్స్‌లలో ఉత్తమ స్కోరు 42గా ఉంది.లాహెూర్ టెస్ట్‌లో రెండు ఇన్నింగ్స్‌లలో బాబర్ అజామ్ స్ట్రెయిట్ డెలివరీలతో అవుట్ అయ్యాడు. రెండు ఇన్నింగ్స్‌లలోనూ అతను %వాదీఔ%గా అవుట్ అయ్యాడు. మొదటి ఇన్నింగ్స్‌లో, ఆఫ్-బ్రేక్ బౌలర్ సైమన్ హార్మర్ అతన్ని %వాదీఔ%గా అవుట్ చేశాడు. రెండవ ఇన్నింగ్స్‌లో, రబాడ యాంగిల్ చేసిన డెలివరీ అతన్ని స్టంప్‌ల మధ్య క్యాచ్ చేసింది. బాబర్ ఇన్‌కమింగ్ డెలివరీలతో ఇబ్బంది పడుతున్నాడని స్పష్టంగా తెలుస్తుంది. ఇది సాంకేతిక లోపం వల్ల కావొచ్చు. బాబర్ త్వరలో భారీ టెస్ట్ ఇన్నింగ్స్ ఆడకపోతే, అతను టీ20లలో ఎదుర్కొన్న పరిస్థితినే ఎదుర్కొవాల్సి ఉంటుంది.





## యశస్వి ఓపెనింగ్ చేస్తే రోహిత్‌ను మర్చిపోతారు

**మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా సంచలన వ్యాఖ్యలు**

టీమ్?ఇండియాలో ఇప్పుడు యువ శక్తి మొదలైనట్లు కనిపిస్తోంది. లెజెండరీ ఆటగాళ్ల స్థానాలను భర్తీ చేసేందుకు యంగ్ ప్లేయర్స్ మధ్య తీవ్రమైన పోటీ నడుస్తోంది. ఇటీవల ముగిసిన ఆసియా కప్‌లో యంగ్ లెఫ్ట్ హ్యాండర్ అదరగొట్టే ప్రదర్శనతో 'ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్' అవార్డు గెలుచుకుని, రోహిత్ శర్మకు అసలైన వారసుడు అతడేనని అందరితోనూ అనిపించుకున్నాడు. కానీ, సెలెక్టర్లు మాత్రం అతడికి ఇంకా సమయం పడుతుందని పక్కనపెట్టారు. సరిగ్గా ఇదే టైమ్?లో టీమ్?ఇండియా మాజీ క్రికెటర్ ఒకరు సీన్‌లోకి ఎంట్రీ ఇచ్చి, అసలు సిసలైన వారసుడు అతడు కాదు, మరొకడు ఉన్నాడని చెప్పి పెద్ద ట్విస్ట్ ఇచ్చాడు. ఇటీవల ముగిసిన ఆసియా కప్‌లో తన ఆల్‌రౌండ్ పెర్ఫార్మెన్స్‌తో అదరగొట్టిన యంగ్ ప్లేయర్ అభిషేక్ శర్మ, రోహిత్ శర్మ స్థానానికి సరైనోడని చాలా మంది భావించారు. ఆస్ట్రేలియా 'ఏ'తో జరిగిన సిరీస్‌కు కూడా అతడిని వెంటనే ఎంపిక చేయడంతో, ఆస్ట్రేలియాతో జరగనున్న మెయిన్ సిరీస్‌లో కూడా చోటు ఖాయమని ఊహాగానాలు మొదలయ్యాయి.2027 వన్డే వరల్డ్ కప్‌ను దృష్టిలో ఉంచుకుని, బీసీసీఐ రోహిత్ స్థానంలో అభిషేక్‌ను సిద్ధం చేస్తోందని అందరూ అనుకున్నారు. కానీ, సెలెక్టర్లు మాత్రం అతన్ని ఇంకా వెయిటింగ్ లిస్ట్‌లోనే ఉంచి అందరికీ షాక్ ఇచ్చారు. అభిషేక్ తన అవకాశం కోసం మరికొంత కాలం వేచి చూడక తప్పదని స్పష్టం చేశారు. అభిషేక్ శర్మ గురించి చర్చ జరుగుతున్న సమయంలో టీమ్?ఇండియాలో మాజీ ఓపెనర్, ప్రముఖ కామెంటేటర్ ఆకాశ్ చోప్రా ఒక కొత్త వాదనను తెరపైకి తెచ్చాడు. వన్డేల్లో రోహిత్ శర్మ తర్వాత ఓపెనింగ్ స్లాట్‌కు అభిషేక్ శర్మ కంటే ముందు యశస్వి జైస్వాల్ రేసులో ఉన్నాడని స్పష్టం చేశాడు. ఇప్పటికే టెస్ట్ క్రికెట్‌లో ఓపెనర్‌గా తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్న యశస్వి, త్వరలోనే అన్ని ఫార్మాట్లలో రెగ్యులర్ ప్లేయర్ అవుతాడని జోస్యం చెప్పాడు. "అభిషేక్ శర్మ గురించి చాలా చర్చ జరుగుతోంది, కానీ నా అభిప్రాయం ప్రకారం యశస్వికే మొదట అవకాశం ఇవ్వాలి. అతడిని ఎక్కువ కాలం పక్కన పెట్టలేరు" అని ఆకాశ్ చోప్రా గట్టిగా చెప్పాడు.ఆకాశ్ చోప్రా అంతటితో ఆగకుండా, ఒక సంచలన కామెంట్ చేశాడు. ఒకవేళ శుభ్‌మన్ గిల్, యశస్వి జైస్వాల్ కలిసి వన్డేల్లో ఓపెనింగ్ చేయడం మొదలుపెడితే, వాళ్లిద్దరి దూకుడు ముందు ప్రేక్షకులు రోహిత్ శర్మను కూడా మిస్ అవ్వకపోవచ్చని అన్నాడు. "గిల్ ఇప్పటికే కెప్టెన్సీ బాధ్యతలతో ముందుకు వెళ్తున్నాడు. అతడితో పాటు యశస్వి ఓపెనింగ్ చేస్తే, ఆ కాంబినేషన్ చాలా పవర్‌ఫుల్‌గా ఉంటుంది. అప్పుడు బహుశా రోహిత్ లేని లోటు కూడా ఎవరికీ తెలియకపోవచ్చు" అని చోప్రా తన యూట్యూబ్ ఛానెల్‌లో విశ్లేషించాడు. ఇది రోహిత్ ఫ్యాన్స్‌కు అంతగా నచ్చకపోయినా, టీమ్?ఇండియాలో ఫ్యూచర్ ప్లాన్స్‌కు అద్దం పడుతోంది.ఆకాశ్ చోప్రా కేవలం వన్డేల గురించే కాదు, టీ20 ఫార్మాట్ గురించి కూడా తన అంచనాలను పంచుకున్నాడు. 2026 టీ20 వరల్డ్ కప్ తర్వాత, టీమ్?ఇండియాలో టీ20 ఓపెనింగ్ స్లాట్‌లో పెద్ద మార్పులు జరగవచ్చని అన్నాడు. అప్పటికి, యశస్వి జైస్వాల్, అభిషేక్ శర్మ ఇద్దరూ ఓపెనర్లుగా మారే అవకాశం ఉందని, అప్పుడు శుభ్‌మన్ గిల్‌ను నంబర్ 3 స్థానంలో ఆడించవచ్చని అభిప్రాయపడ్డాడు. యశస్వికి ఎప్పుడు అవకాశం వచ్చినా దాన్ని యూజ్ చేసుకునే ప్రయత్నం చేస్తాడు. ఒకసారి అతను జట్టులో స్థిరపడితే, ఇక ఇతరులను ఎవరూ మిస్ అవ్వరు. నెక్ట్స్ వరల్డ్ కప్ నాటికి అతను టీమ్‌లో రెగ్యులర్ స్టార్టర్ అవుతాడు అని ఆదిత్య చోప్రా తేల్చి చెప్పాడు.

## ఇండియా-వెస్టిండీస్ టెస్ట్ సిరీస్‌లో 5 భారీ రికార్డులు..

రెండు టెస్ట్‌ల సిరీస్‌ను 2-0 తేడాతో గెలుచుకున్న భారత్, వెస్టిండీస్‌పై వరుసగా 10వ టెస్ట్ సిరీస్ విజయాన్ని నమోదు చేసింది. ఢిల్లీ టెస్ట్‌ను 7 వికెట్ల తేడాతో గెలుచుకోవడం ద్వారా రెండు టెస్ట్‌ల సిరీస్‌ను భారత్ క్లీన్ స్వీప్ చేసింది. 1987 తర్వాత ఢిల్లీలో భారత్ ఒక్క టెస్టులోనూ ఓడిపోలేదు. వరుసగా 14 టెస్టుల్లో ఓటమి లేకుండా ఒకే వేదికపై కొత్త రికార్డును నమోదు చేసింది. మొహాలిలో కూడా భారత్ వరుసగా 13 టెస్టుల్లో విజయం సాధించింది.వెస్టిండీస్‌పై టెస్ట్ సిరీస్ విజయం శుభ్‌మాన్ గిల్ కెప్టెన్సీలో భారత జట్టు సాధించిన తొలి టెస్ట్ సిరీస్ విజయాన్ని సూచిస్తుంది. గతంలో ఇంగ్లాండ్‌లో భారత జట్టు నాయకత్వం వహించాడు. కానీ, అక్కడి సిరీస్ 2-2తో డ్రాగా ముగిసింది.వెస్టిండీస్‌పై భారత్ తన స్వదేశంలో టెస్ట్ రికార్డును మరింత మెరుగుపరుచుకుంది. 1994 నుంచి భారత జట్టు వెస్టిండీస్‌పై అజేయంగా ఉంది. ఈ కాలంలో ఇది 10 టెస్టుల్లో గెలిచి, రెండు డ్రాగా ముగిసింది.మొత్తం మీద, 2002 నుంచి భారత జట్టు వెస్టిండీస్‌పై ఒక్క టెస్ట్ కూడా ఓడిపోలేదు. అది స్వదేశంలో అయినా లేదా వెస్టిండీస్‌లో అయినా.

# కోహ్లీ, రోహిత్‌కు ఆస్ట్రేలియా పర్యటన కీలకం

**మాజీ హెడ్ కోచ్ రవిశాస్త్రి అభిప్రాయం**



టీమిండియా మాజీ కెప్టెన్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మల భవితవ్యం ఆస్ట్రేలియా పర్యటనతో తేలనుందని మాజీ హెడ్ కోచ్ రవిశాస్త్రి అభిప్రాయపడ్డాడు. ఈ సిరీస్‌లో మెరుగైన ప్రదర్శన కనబర్చడంతో పాటు ఫామ్, ఫిట్‌నెస్ కొనసాగిస్తే వన్డే ప్రపంచకప్ 2027 వరకు కొనసాగుతారని తెలిపాడు. టీ20, టెస్ట్ ఫార్మాట్లకు రిటైర్మెంట్ ప్రకటించిన కోహ్లీ, రోహిత్ కేవలం వన్డేల్లో మాత్రమే కొనసాగుతున్న సంగతి తెలిసిందే. వన్డే ప్రపంచకప్ 2027 ఆడటమే తమ లక్ష్యమని ఈ ఇద్దరూ ఆటగాళ్లు తెలిపారు. అందుకు సన్నదం కూడా అవుతున్నారు. ఐపీఎల్ 2025 సీజన్ అనంతరం పూర్తిగా ఇంటికే పరిమితమైన ఈ ఇద్దరూ సీనియర్ ఆటగాళ్లు.. ఆస్ట్రేలియా పర్యటనకు సిద్ధమవుతున్నారు. అక్టోబర్ 19 నుంచి ఆస్ట్రేలియాతో మూడు వన్డేల సిరీస్ ప్రారంభం కానుంది.తాజాగా ఓ కార్యక్రమంలో పాల్గొన్న రవిశాస్త్రి.. రోహిత్, కోహ్లీ భవితవ్యంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. 'వన్డే ప్రపంచకప్ ప్రణాళికల్లో ఉన్నందుకే రోహిత్, కోహ్లీ ఆస్ట్రేలియా పర్యటనకు ఎంపికయ్యారు. అయితే ఫామ్, ఫిట్‌నెస్‌పైనే వారి ప్రపంచకప్ భవితవ్యం ఆధారపడి ఉంది. ఫామ్ కొనసాగిస్తూ ఫిట్‌గా ఉంటేనే రెండేళ్ల తర్వాత జరిగే ప్రపంచకప్‌లో చోటు దక్కుతుంది. వారి భవిష్యత్తుపై నిర్ణయం తీసుకునే దిశగా ఆస్ట్రేలియాతో సిరీస్ వారిద్దరికీ కీలకం. ఈ సిరీస్‌తో వారికి వారే తమ కెరీర్‌పై ఓ నిర్ణయానికి రావొచ్చు. కుర్రాళ్ల నుంచి పోటీ పెరుగుతుందని ఈ ఇద్దరికీ తెలుసు. జట్టు ప్రణాళికల్లో ఉండాలంటే ఏం చేయాలో వారికి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు.'అని రవిశాస్త్రి చెప్పుకొచ్చాడు. ఆస్ట్రేలియా పర్యటనకు ఎంపికైన భారత వన్డే జట్టు: శుభ్‌మన్ గిల్(కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్, అక్షర్ పటేల్, కేఎల్ రాహుల్(కీపర్), ధ్రువ్ జురెల్, యశస్వి జైస్వాల్, నితీష్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్, హర్షిత్ రాణా, మహమ్మద్ సిరాజ్, అర్ష్‌దీప్ సింగ్, ప్రసిధ్ కృష్ణ. వన్డే షెడ్యూల్.. తొలి వన్డే: అక్టోబర్ 19(ఆదివారం),పెర్త్, ఉదయం 9 గంటలకు రెండో వన్డే: అక్టోబర్ 23(గురువారం), అడిలైడ్, ఉదయం 9 గంటలకు మూడో వన్డే: అక్టోబర్ 25(శనివారం), సిడ్నీ , ఉదయం 9 గంటలకు

# విశ్వజి



## ఈ కాలంలో ఈ పండు తినండి...
# షుగరు అనేదే రాదు

నేరేడు పండును జామున్ లేదా బ్లాక్ ప్లమ్ అని కూడా అంటారు. ఇది రుచితోపాటు అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉన్న ఒక శక్తివంతమైన పండు. వర్షాకాలంలో లభించే ఈ పండులో విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. నేరేడు పండులో గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉంటుంది. అంటే ఇది రక్తంలో చక్కెర స్థాయిలను త్వరగా పెంచదు. ఇందులో "జాంబోలిన్" అనే సమ్మేళనం ఉంటుంది, ఇది పిండి పదార్థాన్ని చక్కెరగా మార్చడాన్ని నిరోధించడం ద్వారా రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది.


### అంటువ్యాధుల నుంచి రక్షిస్తుంది

నేరేడు పండు, దాని గింజలు మధుమేహ వ్యాధిగ్రస్తులలో అధిక మూత్ర విసర్జన, దప్పిక వంటి లక్షణాలను తగ్గించడంలో సహాయపడతాయి. నేరేడు పండులో పీచు పదార్థం మెండుగా ఉండి జీర్ణక్రియను మెరుగుపరచడంతోపాటు మలబద్ధకం వంటి సమస్యలను నివారిస్తుంది. కడుపునకు సంబంధించిన సమస్యలను తగ్గించి, పేగుల కదలికలను క్రమబద్ధీకరిస్తుంది. నేరేడు పండులో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. ఇది రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేయడానికి సహాయపడుతుంది. శరీరంలో అంటువ్యాధులు, జలుబు, దగ్గు వంటి సాధారణ అనారోగ్యాల నుండి రక్షించడానికి సహాయపడుతుంది.

### ఖాళీ కడుపుతో మాత్రం తినొద్దు

ఐరన్ సమృద్ధిగా ఉంటుంది. ఎర్ర రక్త కణాల ఉత్పత్తిని పెంచి రక్తహీనతను తగ్గించడంలో సహాయపడుతుంది. హిమోగ్లోబిన్ స్థాయిలను పెంచుతుంది. గుండె ఆరోగ్యానికి మంచిది. అలాగే పొటాషియం అధికంగా ఉంటుంది. రక్త నాళాలను విస్తరించి రక్త ప్రవాహాన్ని సులభతరం చేసి రక్తపోటును నియంత్రించడంలో తోడ్పడుతుంది. యాంటీ ఆక్సిడెంట్లు గుండె కండరాలను బలోపేతం చేసి, హృదయ సంబంధ వ్యాధుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. నేరేడు పండులో ఆంథోసైనిన్‌లు, ఫ్లేవనాయిడ్‌లు, పాలిఫెనాల్స్‌తో సహా అనేక రకాల శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. మొటిమలు, ముడతలు తగ్గించడంలో సహాయపడుతుంది. బరువు తగ్గాలనుకునే వారికి ఇది మంచి ఆహార ఎంపిక. నేరేడు పండులో కాల్షియం, మెగ్నీషియం, ఫాస్పరస్ వంటి ఖనిజాలు ఉండటం వల్ల ఎముకలు దృఢంగా ఉండటానికి సహాయపడతాయి. అయితే వీటిని ఎప్పుడూ ఖాళీ కడుపుతో తినకూడదు.

# విటమిన్ ఎ లోపం ఉంటే కనిపించే లక్షణాలు ఇవే..



అసలు రోజుకు ఇది మనకు ఎంత అవసరం..? ఏమేం ఆహారాలను తినాలి..? మన శరీరం ఆరోగ్యంగా ఉండాలంటే అనేక పోషకాలు మనకు అవసరం అవుతాయి. వాటిల్లో విటమిన్ ఎ కూడా ఒకటి. ఇది మన శరీరంలో అనేక జీవక్రియలను నిర్వహిస్తుంది. అలాగే కంటి చూపును మెరుగు పరిచి కళ్లను ఆరోగ్యంగా ఉంచుతుంది. శరీర రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. చర్మాన్ని ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది. మానవ ప్రత్యుత్పత్తి వ్యవస్థ పనితీరుకు కూడా ఉపయోగపడుతుంది. అయితే సాధారణంగా విటమిన్ ఎ లోపం వచ్చే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయి. గతంలో విటమిన్ ఎ లోపం అధికంగా వచ్చేది. కానీ అవగాహన పెరగడంతో ప్రజలు పౌష్టికాహారం తీసుకుంటున్నారు. విటమిన్ ఎ లోపం రాకుండా జాగ్రత్త వహిస్తున్నారు. కానీ కొందరిలో ఈ లోపం పలు అనుకోని కారణాల వల్ల ఏర్పడుతోంది. విటమిన్ ఎ లోపం ముఖ్యంగా గర్భిణీలు, పాలిచ్చే తల్లులు, చిన్నారుల్లో అధికంగా వస్తుందని గణాంకాలు చెబుతున్నాయి. సిస్టిక్ ఫైబ్రోసిస్, క్రానిక్ డయేరియా వంటి వ్యాధులు ఉన్నవారికి కూడా విటమిన్ ఎ లోపం సంభవిస్తుంది.

### విటమిన్ ఎ లోపం ఉంటే కనిపించే లక్షణాలు..

విటమిన్ ఎ లోపం ఉంటే మన శరీరం మనకు పలు లక్షణాలను, సంకేతాలను తెలియజేస్తుంది. విటమిన్ ఎ లోపం వల్ల చర్మ కణాలు కొత్తగా ఏర్పడడం తగ్గుతుంది. దీంతో చర్మ సమస్యలు వస్తాయి. ముఖ్యంగా చర్మం ఎల్లప్పుడూ పొడిగా మారి నిర్జీవంగా కనిపిస్తుంది. అలాగే ఎగ్జిమా, దురద, గజ్జి, తామర వంటి చర్మ సమస్యలు కూడా తరచూ వస్తుంటాయి. విటమిన్ ఎ లోపం ఉన్నవారిలో కంటి సమస్యలు తరచూ వస్తుంటాయి. ముఖ్యంగా కళ్లలో నీరు తగ్గిపోతుంది. దీంతో కళ్లు పొడిగా మారి దురదలు పెడతాయి. దీర్ఘకాలంలో ఇది అంధత్వానికి దారి తీసే ప్రమాదం కూడా ఉంటుంది. విటమిన్ ఎ లోపం మరీ అధికంగా ఉంటే రేచీకటి సమస్య వస్తుంది. రాత్రి పూట చూపు మందగిస్తుంది. విటమిన్ ఎ లోపించిందని చెప్పేందుకు దీన్ని ప్రధాన కారణంగా భావించవచ్చు. అలాగే విటమిన్ ఎ లోపం ఉన్న స్త్రీ, పురుషుల్లో సంతానం కలగదు. ప్రత్యుత్పత్తి అవయవాల పనితీరు సరిగ్గా ఉండదు. కనుక సంతాన లోపం సమస్య ఉంటుంది. పిల్లల్లో ఎదుగుదల లోపం ఉండడం, తరచూ గొంతు లేదా ఛాతి ఇన్‌ఫెక్షన్లు వస్తుండడం, మొటిమలు తరచూ అధికంగా వస్తుండడం వంటివి కూడా విటమిన్ ఎ లోపం ఉందని తెలియజేసే లక్షణాలుగా అర్థం చేసుకోవాలి.

### ఎవరికి ఎంత అవసరం..?

విటమిన్ ఎ వయస్సును బట్టి రోజుకు నిర్దిష్టమైన మోతాదులో అవసరం అవుతుంది. అప్పుడే పుట్టిన శిశువుల నుంచి 6 నెలల వయస్సు ఉన్నవారికి రోజుకు 400 మైక్రోగ్రాముల విటమిన్ ఎ అవసరం. 7 నుంచి 12 నెలలు ఉన్నవారికి 500 మైక్రోగ్రాములు, 1 నుంచి 3 ఏళ్ల వారికి 300 మైక్రోగ్రాములు, 4 నుంచి 8 ఏళ్ల వారికి 400 మైక్రోగ్రాములు, 9 నుంచి 13 ఏళ్ల వారికి 600 మైక్రోగ్రాములు, 14 నుంచి 18 ఏళ్ల వారికి (బాలురు అయితే) 900 మైక్రోగ్రాములు, 14 నుంచి 18 ఏళ్ల వారికి (బాలికలు అయితే) 700 మైక్రోగ్రాములు, పురుషులకు 900 మైక్రోగ్రాములు, స్త్రీలకు 700 మైక్రోగ్రాములు, గర్భిణీలకు 770 మైక్రోగ్రాములు, పాలిచ్చే తల్లులకు రోజుకు 1300 మైక్రోగ్రాముల విటమిన్ ఎ అవసరం అవుతుంది. విటమిన్ ఎ మనకు పలు ఆహారాల్లో లభిస్తుంది.

### విటమిన్ ఎ ఉండే ఆహారాలు..

పాలకూర, బ్రొకొలి, గ్రేప్ ఫ్రూట్, మిరపకాయలు, చీజ్, యాప్రికాట్స్, పిస్తాపప్పు, యాపిల్స్, క్యారెట్లు, కోడిగుడ్లు, అవకాడో, బొప్పాయి, చిలగడదుంపలు, చేపలు తదితర ఆహారాల్లో విటమిన్ ఎ పుష్కలంగా లభిస్తుంది. విటమిన్ ఎ ఉండే ఆహారాలను రోజూ తీసుకుంటే ఈ లోపం నుంచి బయట పడవచ్చు. అలాగే విటమిన్ ఎ లోపం ఉన్నవారు డాక్టర్లు ఇచ్చే మందులను కూడా క్రమం తప్పకుండా వాడాల్సి ఉంటుంది. విటమిన్ ఎ ట్యాబ్లెట్లను కేవలం డాక్టర్లు సూచించిన కాల పరిమితి వరకు మాత్రమే వాడాలి. వీటిని అధికంగా వాడితే దుష్పరిణామాలు ఎదురవుతాయి. ఇలా జాగ్రత్తలను పాటిస్తూ ఆయా ఆహారాలను తీసుకుంటుంటే విటమిన్ ఎ లోపం నుంచి సులభంగా బయట పడవచ్చు. దీంతో అన్ని విధాలుగా ఆరోగ్యంగా ఉంటారు. రోగాలు రాకుండా ఉంటాయి.

# బాదం తింటే మంచిదే... కానీ వీటితో కలిపి తింటేనే ప్రమాదం!



బాదం పప్పులు... ఆరోగ్యానికి మారుపేరు! వీటిని ప్రతిరోజు గుప్పెడు తింటే చాలు, ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు మీ సొంతం అవుతాయి. విటమిన్లు, మినరల్స్, యాంటీ ఆక్సిడెంట్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు, ఫైబర్... ఇలా పోషకాల గని ఈ బాదం. అందుకే వీటిని సూపర్ ఫుడ్ అని కూడా అంటారు. కానీ, ఎంత ఆరోగ్యకరమైన ఆహారమైనా, కొన్నిసార్లు సరైన పద్ధతిలో తీసుకోకపోతే అది విషంగా మారుతుంది. అలాగే, బాదం పప్పులను వాటి పూర్తి ప్రయోజనాలను పొందవచ్చు. బాదం తినేటప్పుడు కొన్ని ఆహారాలను కూడా సమయపూర్వకంగా దూరంగా పెట్టాలి. లేదంటే, మంచి అనుకున్న బాదం కూడా మన ఆరోగ్యానికి మింగుడుకాని ముద్దవుతుంది. అలాంటి ఆహారాలేంటో ఇప్పుడు తెలుసుకుందాం. అధిక ప్రొటీన్ ఆహారాలు.. బాదంలో ఇప్పటికే పుష్కలంగా ప్రొటీన్ ఉంటుంది. బాదం తినే సమయంలో ఎగ్, మాంసం, పన్నీర్ వంటి అధిక ప్రొటీన్లు ఉన్న ఆహారాలు ఒకేసారి తీసుకుంటే జీర్ణ సమస్యలు తలెత్తవచ్చు. కడుపులో ఉబ్బరం, గ్యాస్ వంటి సమస్యలు ఎక్కువయ్యే అవకాశం ఉంటుంది. పెరుగుతో కలిపి తినటం.. పెరుగులోనూ బాదంలోనూ రెండు విభిన్న రకాల ప్రొబయాటిక్స్, పోషకాలు ఉంటాయి. వీటిని కలిపి తింటే కొంతమందికి అలర్జీ, జీర్ణ సమస్యలు, అసిడిటీ రావచ్చు. పైగా, ఇది శరీర ఉష్ణోగ్రతను అసమతుల్యం చేస్తుంది. ఉప్పు గల ఫుడ్స్.. బాదం తినేటప్పుడు ఉప్పు ఎక్కువగా ఉండే ఆహారాలను – చిప్స్, పాకెటెడ్ ఫుడ్స్, పాప్కార్న్ – తినకూడదు. బాదం లో కూడా కొంతమేర సోడియం ఉండే అవకాశం ఉంది, ముఖ్యంగా రోస్టెడ్, సాల్టెడ్ బాదం అయితే. ఇది బీపీ సమస్యలు కలిగించవచ్చు. ఖాళీ కడుపున బాదం తినడం.. ఖాళీ కడుపున బాదం తినటం వల్ల కొంతమందికి గ్యాస్ట్రిక్, అసిడిటీ సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. బాదం కొవ్వు పదార్థాల వల్ల కడుపులో గోరువెచ్చదనం పెరగవచ్చు. కావున కొంచెం తినిపిన తర్వాత తీసుకోవడం మంచిది. ఆమ్లత కలిగించే ఆహారాలు.. టమోటా, సిట్రస్ ఫలాలు (నిమ్మ, కిన్మం), పెరుగు వంటి ఆహారాలు బాదం తిన్న తర్వాత తీసుకుంటే అసిడిటీ పెరగొచ్చు. ఇది శరీరంలో జీర్ణ క్రియలపై ప్రభావం చూపుతుంది. చాక్లెట్ లేదా కాఫీ... బాదం తిన్న తర్వాత మళ్లీ చాక్లెట్ లేదా అధిక కాఫీ తీసుకుంటే, ఇది నిద్రలేమి, గుండె వేగం పెరగడం వంటి సమస్యలు`లిగించవచ్చు. ఇవి రెండు కూడ ఉత్సాహ వర్ధకాలు కావడం వల్ల శరీరంపై ఒత్తిడి పెరుగుతుంది. బాదం పప్పులు ఎప్పుడు తినాలి. బాదం పప్పులను తినడానికి సరైన మార్గం ఏమిటంటే, వాటిని నానబెట్టి తినడం. రాత్రిపూట బాదం పప్పులనుని సరైన రీతిలో తీసుకోవడం చాలా ముఖ్యం. నీటిలో నానబెట్టి, ఉదయం వాటి తొక్క తీసి తినడం చాలా మంచిది. నానబెట్టిన బాదం పప్పులు జీర్ణం అవుతాయి.కొన్ని ఆహారాలతో బాదం పప్పులను కలిపి తినడం వల్ల పోషకాల శోషణ తగ్గుతుంది . బాదం పప్పులను ఉదయం ఆరోగ్యకరమైన చిరుతిండిగా తీసుకోవడం ఉత్తమం. ఉదయం ఖాళీ కడుపుతో లేదా భోజనం మధ్యలో స్నాక్ గా తినవచ్చు. బాదం నిజంగా ఒక సూపర్ ఫుడ్. కానీ దాన్ని ఏ విధంగా, ఎప్పుడూ, ఎటువంటి ఆహారాలతో పాటు తీసుకుంటున్నామనేది కూడా అత్యంత కీలకం. మీరు ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవాలంటే, సరైన సమయానికి, సరైన పద్ధతిలో బాదం తీసుకోండి. పై చెప్పిన ఆహారాలను ఒకేసారి మిక్స్ చేయడం వల్ల ఆరోగ్యాన్ని నష్టపోవచ్చు. చిన్న అలవాట్లు, పెద్ద సమస్యల్ని దూరం చేస్తాయి. మీకు నిర్దిష్ట ఆరోగ్య సమస్యలు ఉంటే, వీటిని తినే ముందు మీ వైద్యుడిని లేదా పోషకాహార నిపుణుడిని సంప్రదించడం ఉత్తమం.


# మార్కెట్

## ఈ ఏడాది 5 వేల నియామకాలు..
### గుడ్‌న్యూస్ చెప్పిన ఇ-కామర్స్ దిగ్గజం

ఆర్థిక అస్థిరతతో గ్లోబల్ మార్కెట్లలో ఒత్తిడి, టారిఫ్ వార్, లాభాల క్షీణత, ఏఐ వినియోగం పెరగడం.. వెరసి ప్రపంచ వ్యాప్తంగా కంపెనీలు ఖర్చులు తగ్గించుకునేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఇందులో భాగంగా పెద్ద ఎత్తున ఉద్యోగులను తొలగిస్తున్నాయి. అయితే, వాల్‌మార్ట్‌కు చెందిన ఇ–కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్ మాత్రం ఉద్యోగులకు గుడ్ న్యూస్ చెప్పింది. ఈ ఏడాది వేల సంఖ్యలో నియామకాలు చేపట్టనున్నట్లు ప్రకటించింది. ఈ ఏడాది 5 వేల మందిని నియమించుకోనున్నట్లు తెలిపింది. ఈ విషయాన్ని తాజాగా కంపెనీ ఏర్పాటు చేసిన సమావేశంలో ఫ్లిప్‌కార్ట్ చీఫ్ హ్యూమన్ రిసోర్సెస్ ఆఫీసర్ సీమా నాయర్ ఈ నియామక ప్రణాళికలను ప్రకటించారు. క్విక్ కామర్స్, ఫిన్‌టెక్, కృత్రిమ మేధ రంగాల్లో విస్తరణపై దృష్టి సారించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నట్లు తెలిపారు. ఇప్పటికే 'మినిట్స్' పేరిట క్విక్ కామర్స్ సేవలు అందిస్తున్న ఫ్లిప్‌కార్ట్ తన వ్యాపారాన్ని వేగంగా విస్తరిస్తోంది. వినియోగదారులకు వేగవంతమైన డెలివరీ సేవలు అందించేందుకు కృషి చేస్తోంది. యూపీఐ పేమెంట్స్ జరిపేందుకు సూపర్.మనీ పేరుతో తీసుకొచ్చిన అప్లికేషన్‌పై దృష్టి సారించింది. ఈ విభాగాల్లో డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో నూతన నియామకాలు చేపట్టేందుకు సన్నద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.




# అతిపెద్ద మార్కెట్ క్రాష్ ఈ ఏడాదే




### ప్రముఖ రచయిత రాబర్ట్ కియోసాకి హెచ్చరిక

న్యూఢిల్లీ, అక్టోబర్ : ప్రపంచ చరిత్రలో అతిపెద్ద మార్కెట్ క్రాష్ ఈ ఏడాది సంభవించబోతున్నదని ప్రముఖ రచయిత రాబర్ట్ కియోసాకి హెచ్చరించారు. రికార్డు స్థాయిలో దూసుకు పోతున్న అతి విలువైన లోహాల్లో ప్రస్తుతం పెట్టుబడులు పెట్టడం శ్రేయస్కరం కాదని, ఇవి ఎప్పుడైనా కూలిపోయే ప్రమాదం ఉన్నదని రిచ్ డాడ్ పూర్ డాడ్ రచయిత ఆయన ఎక్స్‌లో హెచ్చరించారు. ఈ ఏడాది అతి విలువైన లోహాలపై పెట్టుబడులు పెట్టడం మంచి పరిణామం కాదన్నారు. కాగితం ఆధారిత పెట్టుబడుల నుంచి స్పష్టమైన ఆస్తులకు మారాలనే తన నిరంతర సలహా అని సూచించారు. ముఖ్యంగా వెండి, ఎథెరియంను ఆచారణాత్మక పారిశ్రామిక అనువర్తనాలేనని, వీటిని తక్కువ విలువ కలిగిన వస్తువులు మాత్రంగా గుర్తించనని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా పొదుపు చేసేవారికి నిరాశ తప్పదని తన అభిప్రాయాన్ని నొక్కి చెప్పారు. బంగారం, వెండి, బిట్‌కాయిన్, ఎథెరియం వంటి భౌతిక, వర్చ్యువల్ ఆస్తులలో పెట్టుబడులు పెట్టాలని ఆయన ప్రజలకు సూచించారు. నిజమైన ఆస్తుల్లో మాత్రమే పెట్టుబడులు పెట్టాలని, వీటిలో రియల్ ఎస్టేట్ కీలకమని, భవిష్యత్తులో భూమి బంగారంగా మారుతున్నదనే అభిప్రాయాన్ని ఆయన వ్యక్తంచేశారు. అలాగే వెండి, ఎథెరియంలు సంపద సంరక్షణ సాధనాలుగా మాత్రమే కాకుండా పరిశ్రమలో కూడా ఉపయోగించబడుతాయని చెప్పారు.

## ఐటీ రిటర్న్స్ ఫైలింగ్ కోసం గడువు
# పొడిగింపు

న్యూఢిల్లీ: ఆదాయం పన్ను శాఖ కీలక ప్రటకన చేసింది. ఇన్‌కం ట్యాక్స్ రిటర్న్స్ కోసం ఫైలింగ్ తేదీ గడువును పెంచారు. 2025-26 సీజన్ కోసం ఐటీ రిటర్న్స్ దాఖలు కోసం జూలై 31 నుంచి గడువును సెప్టెంబర్ 15వ తేదీ వరకు పెంచినట్లు ఐటీశాఖ చెప్పింది. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ ట్యాక్సెస్(సీబీడీటీ) ఇవాళ ఓ ప్రకటన రిలీజ్ చేసింది. ఐటీఆర్ దాఖలు విషయంలో విస్తృత స్థాయిలో మార్పులు జరిగాయని, అయితే కొత్త తరహా ఐటీఆర్‌ను తెలుసుకునేందుకు గడువును పెంచుతున్నట్లు ఐటీశాఖ పేర్కొన్నది. పన్నుదారులకు సరళమైన రీతిలో ఫైలింగ్ జరిగేందుకు గడువును పెంచుతున్నట్లు వెల్లడించారు. దీనిలో భాగంగానే జూలై 31 వరకు ఉన్న ఐటీఆర్ ఫైలింగ్ తేదీని సెప్టెంబర్ 15కు పొడిగిస్తున్నట్లు సీబీడీటీ తెలిపింది.



# బాణసంచా విక్రయదారులు తస్మాత్ జాగ్రత్త..

## నిబంధనలు ఉల్లంఘిస్తే షాప్ సీజ్, లైసెన్స్ రద్దే..

## కలెక్టర్ డా. జి.లక్ష్మీశ.



విజయవాడ,అక్టోబర్14 : బాణసంచా అమ్మకదారులు ప్రభుత్వ నిబంధనలను తప్పకపాటించాలని నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిల్వలు, అమ్మకాలు నిర్వహించే వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు షాప్ సీజ్, లైసెన్స్ రద్దుకు వెనకాడబోమని జిల్లా కలెక్టర్ డా .జి.లక్ష్మీశ హెచ్చరించారు. దీపావళి పండుగ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ మంగళవారం నగరంలోని భవానిపురం ఐరన్ యార్డ్‌లోగల బాణసంచా గోడౌన్‌లను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 20వ తేదీన దీపావళి పండుగ సందర్భంగా ప్రజలు పెద్దయెత్తున కోనుగోలు చేస్తారన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని బాణసంచ విక్రయదారులు అక్రమ నిల్వలు చేయడంతో పాటు అనుమత్తులు లేకుండా విక్రయించే అవకాశం ఉంటుందన్నారు. అటువంటి వారిని గుర్తించేందుకు ప్రత్యేక నిఘా బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు. రెవెన్యూ, పోలీస్, మునిసిపల్, అగ్నిమాపక, పౌర సరఫరాలు, విద్యుత్ తదితర శాఖల అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి అక్రమ నిల్వలు అమ్మకాలు చేసేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించామన్నారు. అమ్మకందారులు ప్రభుత్వం నుండి తప్పనిసరిగా లైసెన్స్ పొందాల్సి ఉంటుందని అధికారులు గుర్తించిన మైదానాలలో మాత్రమే బాణసంచా దుకాణాల ఏర్పాటుకు ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. పట్టణ ప్రాంతాల్లో టౌన్ ప్లానింగ్ ... మేజిస్ట్రేట్ నుంచి ముందుగానే అనుమతికి ధరఖాస్తు చేసుకోవాలన్నారు. గతం లో జింఖానా మైదానంలో బాణసంచా విక్రయాలు నిర్వహించిన సందర్భంలో భద్రతాపరమైన లోపాల వలన అగ్నిప్రమాదం సంభవించిన సంఘటనను దృష్టిలో పెట్టుకుని అలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ముందుగానే పటిష్ట చర్యలు తీసుకోవాలని పోలీసు, రెవెన్యూ, అగ్ని మాపక శాఖ అధికారులను ఆదేశించారు.బాణసంచ విక్రయ కేంద్రాల వద్ద ఫైర్ ... పరికరాలను ఏర్పాటు చేయాలని అగ్ని మాపక అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. విద్యుత్ అధికారులు షార్ట్ సర్క్యూట్ వంటి సంఘటనలకు తావులేకుండా ముందుగానే తనిఖీలను నిర్వహించి అమ్మకందారులు తగు జాగ్రత్తలు తీసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. దుకాణానికి దుకాణానికి మధ్య 3 మీ. దూరం ఉండేవిధంగా చూడటంతో పాటు దుకాణాలు ఎదురెదురుగా ఉండకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రెసిడెన్షియల్ ఏరియాకు ... అనుమతివ్వాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామన్నారు. మైదానంలో 50కి మించి దుకాణాలకు అనుమతించబోమన్నారు. జన సంచారం లేని సమయంలో మాత్రమే బాణసంచా ఎగుమతులు దిగుమతులు జరపాలని అదే సమయంలో అని ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ లక్ష్మీశ విక్రయదారులకు సూచించారు.

# ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు లంచం డిమాండ్

## ఎసిబికి చిక్కిన విద్యుత్ లైన్÷-మెన్

నాగర్‌కర్నూల్,అక్టోబరు14 : నాగర్‌కర్నూల్ జిల్లాలో ఓ అవినీతి అధికారి ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. జిల్లాలోని వంగూర్ మండలం మాచినోనిపల్లి గ్రామం టీజీఎస్‌పీడీసీఎల్‌కు చెందిన లైన్‌మెన్ తోట నాగేంద్ర మంగళవారం రూ.15 వేలు లంచం తీసుకుంటూ చిక్కాడు. వ్యవసాయానికి సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు కోసం రైతులు లైన్‌మెన్‌ను సంప్రదించగా లంచం డిమాండ్ చేశాడు. దీంతో బాధిత రైతు మహబూబ్‌నగర్ పరిదిలోని ఏసీబీని ఆశ్రయించగా మంగళవారం అధికారులు పట్టుకున్నారు. అవినీతికి పాల్పడ్డ లైన్‌మెన్‌పై కేసు నమోదు చేసి నాంపల్లి ఏసీబీ కోర్టులో ప్రవేశపెట్టామని అధికారులు వివరించారు. ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు ఎవరైనా ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా అవినీతికి పాల్పడే వారి సమాచారాన్ని ఏసీబీ టోల్ ఫ్రీ 1064 నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు. వాట్సప్ నంబర్ 9440446106కు తెలంగాణ ఏసీబీ ఫేస్‌బుక్, ట్విట్టర్ ద్వారా గాని ఫిర్యాదు చేయవచ్చని వెల్లడించారు.

# ప్రధాని పర్యటనపై మంత్రి మండిపల్లి సమీక్ష

## ప్రత్యేక బస్సులు ఏర్పాటుకు ఆదేశాలు

అమరావతి,అక్టోబరు14 : ప్రధాని మోదీ పర్యటన ఏర్పాట్లపై రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అధికారులతో సమీక్ష నిర్వహించారు. జీఎస్టీ తగ్గింపుపై మోదీని ఆయన అభినందించారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని తీసుకున్న జీఎస్టీ నిర్ణయం చరిత్రాత్మకమన్నారు. ఈ నెల 16న కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ప్రధాని పర్యటన నేపథ్యంలో ఆర్టీసీ ఏర్పాట్లపై మంత్రి ఆరా తీశారు. ప్రధాని పర్యటన దృష్ట్యా 3,500 బస్సులు సిద్ధం చేయాలని నిర్ణయించారు. కర్నూలు జిల్లా నన్నూరులో నిర్వహించనున్న సభకోసం 3,070 ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయనున్నారు. శ్రీశైలం పర్యటన కోసం అదనంగా 150 బస్సులు సిద్ధం చేయనున్నారు. పోలీసులు, భద్రతా సిబ్బంది రవాణా కోసం 80 బస్సులు కేటాయించారు.

# పర్వతారోహకుడు భరత్ రికార్డు

మౌంట్ చో ఒయు పర్వతం అధిరోహణ

అమరావతి,అక్టోబరు14 : కర్నూలుకు చెందిన 36 ఏళ్ల పర్వతారోహకుడు భరత్ తమ్మినేని అరుదైన ఘనత సాధించారు. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన 14 శిఖరాల్లో ఒకటైన చైనాలోని 8,188 మీ ఎత్తున్న మౌంట్ చో ఒయు పర్వతాన్ని అధిరోహించారు. కాగా ఇప్పటికే భరత్ 8 అత్యంత ఎత్తైన పర్వతాలను విజయవంతంగా అధిరోహించినట్లు సమాచారం. తాజాగా మౌంట్ చో ఒయు పర్వతాన్ని ఎక్కి.. ప్రపంచంలోని ఎత్తైన శిఖరాలలో తొమ్మిదింటిని అధిరోహించిన మొదటి భారతీయుడిగా నిలిచాడు. భరత్ తమ్మినేని మే 2017లో మౌంట్ ఎవరెస్ట్.. సెప్టెంబర్ 2018లో మౌంట్ మనస్లు, మే 2019లో మౌంట్ లోట్సే, మార్చి 2022లో అన్నపూర్ణ, ఏప్రిల్ 2022లో కాంచన్‌జంగా, మే 2023లో మకాలు, అక్టోబర్ 2024లో శిశాపాంగ్మా, ఏప్రిల్ 2025లో మౌంట్ ధౌలగిరి....తదితర 8,000 మీటర్లకు పైగా ఎత్తైన శిఖరాలను అధిరోహించినట్లు అధికారులు పేర్కొన్నారు. మంగళవారం ఉదయం 6.55గంటలకు ట్రెక్కింగ్ ప్రారంభించి, 8.55గంటలకు పర్వత శిఖరాన్ని చేరుకున్నట్లు తెలిపారు. దీంతో ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన 14 శిఖరాల్లో తొమ్మిదింటిని విజయవంతంగా అధిరోహించి..రికార్డు నెలకొల్పారు.

# ఎక్స్ వేదికగా చంద్రబాబు ఆసక్తికర పోస్ట్

## గూగుల్ కమ్స్ టు ఏపి అంటూ హ్యాష్ ట్యాగ్

న్యూఢిల్లీ,అక్టోబరు14 : ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోషల్ మీడియా ప్లాట్ ఫామ్ ఎక్స్ వేదికగా చేసిన ఓ ఆసక్తికర పోస్ట్ అందరినీ ఆకర్శిస్తోంది. ఓకే గూగుల్..సింక్రనైజ్ ఫర్ వికసిత్ భారత్ అంటూ సీఎం ఎక్స్ లో పోస్ట్ చేశారు. ఇక్కడ 'ఓకె గూగుల్' అనేది గూగుల్ అసిస్టెంట్ ను ప్రారంభించే వాయిస్ యాక్టివేటెడ్ ట్రిగ్గర్. దీన్ని వాడి సీఎం చంద్రబాబు నాయుడు పెట్టిన పోస్ట్ అందరిని ఆకట్టుకుంటోంది. అలానే 'గూగుల్ కమ్స్ టు ఏపీ'హ్యాష్ ట్యాగ్‌తో చేసిన పోస్టులో ఆయన పలువురు ప్రముఖులకు ట్యాగ్ చేశారు. విశాఖపట్నంలో 1 గిగావాట్ హైపర్ స్కేల్ డేటా సెంటర్ ఏర్పాటుపై ఏపీ సర్కార్ గూగుల్‌తో చారిత్రక ఒప్పందం కుదర్చుకుంది. ఈ క్రమంలో మంగళవారం ఢిల్లీలోని తాజ్‌మాన్‌సింగ్ హోటల్‌లో ఓ ముఖ్య కార్యక్రమం జరిగింది. ఈ ప్రోగ్రామ్ లో ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఐటీ మంత్రి అశ్వినీ వైష్ణవ్, రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ పాల్గొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మంత్రులతో పాటు గూగుల్ క్లౌడ్ సీఈఓ థామస్ కురియన్, గ్లోబల్ ఇన్‌ఫ్రాస్టక్చర్ వైస్ ప్రెసిడెంట్ బికాస్ కోలే, గూగుల్ క్లౌడ్ ఆసియా ఫసిఫిక్ విభాగం అధ్యక్షుడు కరణ్ బజ్వాలు పాల్గొన్నారు. విశాఖలో రూ.87,520 కోట్ల పెట్టుబడులతో ఏఐ డేటా సెంటర్‌ను గూగుల్ ఏర్పాటు చేయనుంది. ఒక గిగా వాట్ కెపాసిటీతో ఏఐ డేటా సెంటర్ ర్పాటుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఈ డేటా సెంటర్ వైద్యారోగ్యం, విద్య, వ్యవసాయం, పరిశ్రమలు తదితర రంగాల్లో సేవలు అందించనుంది.

# కల్తీమద్యం కేసులో ఎవ్వరినీ వదలబోం

## కుట్రదారులు ఎక్కడ దాక్కున్నా పట్టుకుంటాం

## విజయవాడలో మద్యం దుకాణాల్లో మంత్రి ఆకస్మిక తనిఖీలు

విజయవాడ,అక్టోబరు14 : కల్తీ మద్యం అంటూ కుట్రకు తెరలేపిన ఏ ఒక్కరినీ వదలమని మంత్రి కొల్లు రవీంద్ర వార్నింగ్ ఇచ్చారు. కుట్రకు పాల్పడ్డ నిందితులు ఎక్కడ దాక్కున్నా పట్టుకొచ్చి శిక్షిస్తామని అన్నారు. శవరాజకీయాల్లో ఆరితేరిన జగన్ కులాల మధ్య చిచ్చు పెట్టాలని చూస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వంపై కుట్రలు పన్నుతూ వైసీపీ నకిలీ మద్యం అంటూ ప్రజల్ని భయపెట్టాలని చూస్తోందన్నారు. వైసీపీ చేస్తున్న ఫేక్ ప్రచారాలపై వాస్తవాలు అన్నీ బహిర్గతం చేస్తున్నామని తతెలిపారు. విజయవాడలో మద్యం దుకాణాల్లో మంత్రి కొల్లు రవీంద్ర మంగళవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిన ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్ అమలును మంత్రి స్వయంగా పరిశీలించారు. యాప్ ఉపయోగాలపై వినియోగదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గతంలో జోగి రమేష్.. చంద్రబాబు ఇంటికి వచ్చినందుకే వైసీపీ నేతలు డిపాజిట్లు కోల్పోయి పార్టీ అడ్రెస్ గల్లంతైందన్నారు. మళ్లీ చంద్రబాబు ఇంటికొస్తా అంటున్న జోగిరమేష్ కారుకూతలు కూస్తే తోలు తీస్తామని హెచ్చరించారు. ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు కుట్ర పన్నారని జనార్దన్ రావు స్పష్టమైన వాంగ్మూలం ఇచ్చారన్నారు. బందరు పిచ్చోడు పేర్ని నాని రాత్రులు ఆంబోతులా రంకెలు వేసి ఉదయం అదే పోలీసుస్టేషన్‌కు వెళ్లి గడ్డాలు పట్టుకోవటం చూశామన్నారు. ఇప్పటి వరకూ 19వేల మంది యాప్ డౌన్లోడ్ చేసుకున్నారని.. ఎక్సైజ్ విధానాన్ని ప్రభుత్వం పారదర్శకంగా అమలు చేస్తోందని తెలిపారు. గత ప్రభుత్వం విధ్వంసం చేసిన వ్యవస్థను గాడిలో పెట్టామని.. శాఖాపరంగా ఎవరు తప్పు చేసినా వదిలి పెట్టమని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు.

# గూగుల్ రాకతో పెరిగిన ఎపి ప్రతిష్ట

## చంద్రబాబు నాయకత్వ పటిమే ఇందుకు కారణం

## రెవెన్యూ శాఖమంత్రి అనగాని సత్యప్రసాద్

కర్నూలు,అక్టోబరు14 : విశాఖపట్నానికి గూగుల్ ఏఐ హబ్ రావడం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రతిష్టను మరింత పెంచుతుందని ఏపీ రెవెన్యూ శాఖమంత్రి అనగాని సత్యప్రసాద్ వ్యాఖ్యానించారు. ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన గూగుల్ టెక్ సంస్థ విశాఖపట్నానికి రావడం నవ్యాంధ్రప్రదేశ్‌కు శుభపరిణామమని అభివర్ణించారు. మంగళవారం కర్నూలు జిల్లాలో మంత్రి అనగాని సత్యప్రసాద్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం చంద్రబాబు ఆనాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మైక్రోసాఫ్ట్ వంటి దిగ్గజ సంస్థలని తీసుకువచ్చి హైదరాబాద్‌ని అభివృద్ధి చేశారని.. ఇవాళ విశాఖకు గూగుల్‌ని తీసుకువచ్చి ఆంధ్రప్రదేశ్ ముఖచిత్రాన్ని మార్చుతున్నారని ప్రశంసించారు. పరిశ్రమలకు అనుకూలమైన వాతావరణం, సమర్థవంతమైన నాయకత్వం ఉండటంతో ఏపీకి గూగుల్, టీసీఎస్, ఆక్సెంచర్ వంటి టెక్ దిగ్గజాలు వస్తున్నాయని మంత్రి అనగాని సత్యప్రసాద్ వివరించారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ రాత్రింబవళ్లు కష్టపడుతూ వివిధ కంపెనీల ప్రతినిధులతో గంటల కొద్దీ చర్చలు జరిపి ఏపీకి పరిశ్రమలను తీసుకొస్తున్నారని కొనియాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ 16 నెలల్లో ఏపీకి రూ.11.20 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు 9.5 లక్షల ఉద్యోగావకాశాలు వచ్చాయని వెల్లడించారు. గూగుల్ కంపెనీ రాకతో యువతకు ప్రపంచస్థాయి అవకాశాలు అందుతాయని తెలిపారు. సిటీ ఆఫ్ డెస్టినీగా ఉన్న విశాఖ నగరం.. నేడు ఏఐ, డిజిటల్ సిటీకి రాజధానిగా మారతుందని మంత్రి అనగాని సత్యప్రసాద్ పేర్కొన్నారు.

# దేశంలో మొదటి ఎఐ సిటీగా మారనున్న విశాఖ

## విప్లవాత్మక మార్పులకు ఇదో శుభసూచిక

## విజనరీ లీడర్ చంద్రబాబు దూర్ధృష్టికి తార్కాణం

## ఎక్స్ వేదికగా డిప్యూటి సిఎం పవన్

అమరావతి,అక్టోబరు14(ఆర్ఎన్ఎ): దేశంలోని మొదటి ఎఐ సిటీగా విశాఖ మారబోతోందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఎక్స్ వేదికగా ఆనందం వ్యక్తం చేశారు. సిటీ ఆఫ్ డెస్టినీ నుంచి వికసిత్ భారత్ దిశగా చారిత్రాత్మక అడుగు పడిందన్నారు.. ఈ ప్రాజెక్ట్ అందరకీ ఉపయోగపడుతుంది. యువత, రైతులు, వైద్యులు, మత్స్యకారులు, వ్యాపారవేత్తలు, మహిళలు, విద్యార్థుల జీవితాల్లో విప్లవాత్మక మార్పులు వస్తాయన్నారు. విశాఖపట్నంలో 1 గిగావాట్ హైపర్ స్కేల్ డేటా సెంటర్ ఏర్పాటు కోసం ఢిల్లీ వేదికగా ఏపీ ప్రభుత్వం.. గూగుల్‌తో చారిత్రక ఒప్పందం కుదుర్చుకున్న విషయం విదితమే.. ఏపీ సీఎం చంద్రబాబు, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఐటీ, కమ్యూనికేషన్ల శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్, ఏపీ మంత్రి నారా లోకేష్, గూగుల్ క్లౌడ్ సీఈవో థామస్ కురియన్ సహా పలువురు గూగుల్ ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.. ఇక, విశాఖకు గూగుల్ డేటా సెంటర్‌పై ఎక్స్‌లో పవన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు .. గూగుల్ 15 బిలియన్ డాలర్లతో ఎఐ డేటా సెంటర్‌తో విశాఖకు ప్రపంచ స్థాయి గుర్తింపు పొందుతుందన్నారు. వికసిత్ భారత్ లక్ష్యానికి ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వం ప్రధాన ప్రేరణగా పేర్కొన్నారు పవన్ కల్యాణ్.. విశాఖలో ఎఐ డేటా సెంటర్ సాధన సీఎం చంద్రబాబు నాలుగు దశాబ్దాల విజనరీ లీడర్‌షిప్‌కు నిదర్శనంగా అభివర్ణించిన ఆయన.. ఎఐ టెక్నాలజీతో ప్రతి పౌరుడి జీవన ప్రమాణాలు మెరుగుపరచాలన్న లక్ష్యం.. ప్రభుత్వం మాత్రమే కాదు, ఈ కొత్త ప్రగతి యుగానికి అందరం అవసరం అన్నారు. యువత కొత్త ఆవిష్కరణలు చేయాలి, విద్యావేత్తలు పరిశోధనలో ముందుండాలి.. పౌరులు చురుకుగా పాలుపంచుకోవాలి, పరిశ్రమలు విస్తరణకు ముందుకు రావాలి. భవిష్యత్ భారత నిర్మాణంలో విశాఖ కీలక కేంద్రంగా అవతరించనుంది.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గూగుల్ చారిత్రాత్మక భాగస్వామ్యం అవుతుంది.. 15 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడి వస్తుందన్నారు. ఈ ప్రాజెక్టుతో ఆంధప్రదేశ్, దేశం డిజిటల్ రంగంలో కొత్త దిశగా అడుగుపెట్టనుంది అన్నారు పవన్ కల్యాణ్.. వేలాది ఉద్యోగావకాశాలు సృష్టించబోతున్న డేటా సెంటర్ ప్రాజెక్ట్ ఇది.. యువతకు ఆధునిక టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ స్కిల్స్‌లో కొత్త అవకాశాలు వస్తాయి.. డిజిటల్ యుగంలో భారత స్థాయిని గ్లోబల్ లీడర్‌గా బలోపేతం చేసే ప్రాజెక్ట్ ఇది.. దీనిని సహకారం చేసిన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు.. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్, మంత్రి నారా లోకేష్, గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్ సహకారానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ట్వీట్ చేశారు.



# హర్యానాలో మరో పోలీస్ అధికారి ఆత్మహత్య

## చనిపోయిన పూరన్ కారణమంటూ సూసైడ్ లేఖ

చండీఘడ్,అక్టోబర్14 : హరియాణాలో ఇటీవల సీనియర్ ఐపీఎస్ అధికారి పూరన్ కుమార్ బలవన్మరణానికి పాల్పడటం తీవ్ర కలకలం సృష్టించిన సంగతి మరవక ముందే...తాజాగా మరో పోలీసు అధికారి తనను తాను తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడటం చర్చనీయాంశంగా మారింది. పూరన్‌ను లక్ష్యంగా చేసుకుని ఆ అధికారి తన సూసైడ్ నోట్‌లో ఆరోపణలు చేసినట్లు వార్తలు వచ్చాయి. ఏఎస్సై సందీప్‌కుమార్ రోహ్‌తక్ సైబర్ సెల్‌లో విధులు నిర్వహిస్తున్నారు. పూరన్ కుమార్‌పై ఉన్న ఓ అవినీతి కేసును ఆయన దర్యాప్తు చేస్తున్నారు. ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ పూరన్ కుమార్‌పై తన సూసైడ్ నోట్‌లో ఆరోపణలు చేశారు. నిజాలు వెలుగులోకి రావడం కోసం తన జీవితాన్ని త్యాగం చేస్తున్నట్లు రాశారు. పూరన్ కుమార్ ఇటీవల చండీగఢ్‌లోని తన నివాసంలో రివాల్వర్‌తో కాల్చుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. కుల వివక్ష, వేధింపులు, అవమానాలతోనే బలవన్మరణానికి పాల్పడుతున్నట్లు ఆయన సూసైడ్ నోట్‌లో పేర్కొన్నారు. ఇందులో ఎనిమిది మంది అధికారుల పేర్లను చేర్చారు. ఈ కేసుకు సంబంధించి వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న డీజీపీ శత్రుజీత్ కపూర్‌ను రాష్ట్ర ప్రభుత్వం సెలవుపై పంపించింది. రోహ్‌తక్ ఎస్పీ నరేంద్ర బిజార్నియాను బదిలీ చేసింది. ఈ క్రమంలో తాజగా ఓ ఎఎస్సై ఆత్మహత్య చేసుకోవడం, అందుకు పూరన్ కారణమంటూ పేర్కొనడం కలకలం రేపుతోంది.

# నీటిపాదరుదల శాఖలో కుదపు

## 106మంది ఇంజనీర్ల తక్షణ బదిలీ

హైదరాబాద్,అక్టోబర్14 : నీటిపారుదల శాఖలో అవినీతి అధికారుల వ్యయహారం కలకలం రేపుతున్న తరుణంలో ..హైదరాబాద్ సర్కిల్‌తోపాటు రాష్ట్ర వ్యాప్తంగా 106 మంది ఇంజినీర్లను బదిలీ చేస్తూ నీటిపారుదలశాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్‌వోసీల జారీ విషయంలో ఇంజినీర్లపై వచ్చిన ఆరోపణల ఆధారంగా ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. బదిలీ అయిన ఇంజినీర్లలో ఈఈలు, డీఈఈలు, ఏఈఈలు ఉన్నారు. గతంలో వచ్చిన ఆరోపణలతోపాటు, క్షేత్ర స్థాయిలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు రావడంతో సమూల ప్రక్షాళన చేసేందుకు ప్రభుత్వం క్షేతస్థాయి ఇంజినీర్లను బదిలీ చేసింది. హైదరాబాద్ సర్కిల్ పరిధిలోనే 60 మందికిపైగా ఇంజినీర్లపై బదిలీ వేటు వేయడం గమనార్హం. వీరంతా ఒకేచోట తిష్టవేసి అక్రమలకు పాల్పడుతున్నారని ప్రభుత్వానికి నివేదికలు అందాయి. దీంతో వీరిని బదిలీలతో సమస్యకు చెక్ పెట్టాలని చూస్తోంది.

# పోలీసులను తప్పించుకోబోగా ప్రమాదం

## బిల్డింగ్‌పై నుంచి దూకడంతో తీవ్ర గాయాలు

విజయవాడ,అక్టోబర్14 : పోలీసుల నుంచి తప్పించుకునేందుకు అపార్ట్‌మెంట్‌పై నుంచి దూకి ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన కలకలం రేపింది. విజయవాడ వాంబేకాలనీలోని ఏ బ్లాక్‌లో ఘటన చోటు చేసుకుంది. గంజాయి కేసులో నిందితుడుగా ఉన్న దోమల సంగీతరావు వాంబేకాలనీ జీ ప్లస్ -3 అపార్ట్ మెంట్ ఏ బ్లాక్‌లో నివాసం ఉంటున్నాడు. గంజాయి కేసులో విచారణ చేసేందుకు నున్న గ్రామీణ పోలీసులు మధ్యాహ్నం సంగీతరావు ఇంటికి వచ్చారు. పోలీసుల నుంచి తప్పించుకునే క్రమంలో నిందితుడు భవనంపై నుంచి దూకేశాడు. తీవ్ర గాయాలు కావడంతో విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. నున్న గ్రామీణ పోలీసులే సంగీత రావుని భవనంపై నుంచి తోసేశారని బాధితుడి కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. చేయని తప్పునకు అతన్ని వేధిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

# విశాఖలో గూగుల్ అడుగు

## ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో ఎపి ఒప్పందం

న్యూఢిల్లీ,అక్టోబర్14 : విశాఖపట్నంలోకి గూగుల్ అడుగుపెడుతోంది. ఐటి హబ్గా విశాఖను అభివృద్ధి చేస్తామన్న సిఎం చంద్రబాబు ఆ మేరకు గూగుల్‌తో మొదలు పెట్టారు. 1 గిగావాట్ హైపర్ స్కేల్ డేటా సెంటర్ ఏర్పాటుపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దిల్లీలో గూగుల్‌తో చారిత్రక ఒప్పందం కుదర్చుకుంది. తాజ్‌మాన్‌సింగ్ హోటల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ఐటీ, కమ్యూనికేషన్ల శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్, గూగుల్ క్లౌడ్ సీఈఓ థామస్ కురియన్, గ్లోబల్ ఇన్‌ఫ్రాస్టక్చర్ వైస్ ప్రెసిడెంట్ బికాస్ కోలే, గూగుల్ క్లౌడ్ ఆసియా ఫసిఫిక్ విభాగం అధ్యక్షుడు కరణ్ బజ్వాలు పాల్గొన్నారు. వైజాగ్‌ను ఏఐ సిటీగా మార్చేందుకు పునాది వేసే ఈ ప్రాజెక్టు ద్వారా గూగుల్ సుమారు 15 బిలియన్ అమెరికన్ డాలర్ల పెట్టుబడి పెట్టనుంది. ఆసియాలో ఆ సంస్థ ఏర్పాటు చేస్తున్న అతి పెద్ద ప్రాజెక్టు ఇదే. ఈ ప్రాజెక్టు ద్వారా 2028-32 మధ్య రాష్ట్ర స్థూల ఉత్పత్తికి ఏటా రూ.10,518 కోట్లు సమకూరుతుందని, 1,88,220 ఉద్యోగాల కల్పనకు అవకాశం ఏర్పడుతుందని అంచనా. గూగుల్ క్లౌడ్ ఆధారిత కార్యక్రమాల ద్వారా ఏటా రూ.9,553 కోట్ల చొప్పున ఐదేళ్లలో రూ.47,720 కోట్ల ఉత్పాదకత జరుగుతుందని అంచనా వేస్తున్నారు.



# సినిమాల్లో విఎఫ్ఎక్స్ కీలక భూమిక

ఈ మధ్య అనేక సినిమాలు ఆలస్యం కావడం..దానికి విఎఫ్ఎక్స్ కోసం ఆలస్యం అయ్యిందని దర్శకులు చెప్పడం చూస్తున్నాం. సినిమాల్లో ఇప్పుడు విఎఫ్ఎక్స్ కీలకంగా మారింది. సినిమాలలెవల్ పెంచేది అవే. టాలీవుడ్ సినిమాల లెవెల్ తారాస్థాయికి చేరడంలో వీటి పాత్ర ఎందో ఉందనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. సినిమా మేకింగ్ లో కొత్త టెక్నాలజీస్ ముఖ్య పాత్ర వహిస్తున్నాయి. ముఖ్యంగా పాన్ ఇండియా మూవీలలో 'గ్రాఫిక్స్' ప్రేక్షకుల కోసం భారీ విజువల్ ఎక్స్పీరియన్స్ ఇవ్వడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఈ మధ్య సినిమాలను గమనిస్తే.. భారీ చిత్రాలు చెప్పిన టైంలో ప్రేక్షకులు ముందుకు రావడం కష్టం అవుతుంది. భారీ విజువల్ ఎఫెక్ట్స్ తో రూపొందుతున్న పాన్-ఇండియా సినిమాల రీసెంట్ రిలీజ్‌లు గ్రాఫిక్స్ ఆలస్యాల కారణంగా వాయిదా పడడం సాధారణంగా మారింది.ప్రస్తుతం సినిమాలలో విజువల్ ఎఫెక్ట్స్ కీ రోల్ ప్లే చేస్తూ.. ఇండియన్ సినిమాను గ్లోబల్ రేంజ్‌కి తీసుకెళ్తున్నాయి. ముఖ్యంగా పీరియాడిక్, హిస్టారికల్ సినిమాల్లో గ్రాఫిక్స్ మరింత కీలకంగా మారుతోంది. మేకర్స్ ఈ క్రాఫ్ట్‌పై ఎక్కువ టైం కేటాయిస్తూ భారీగా ఖర్చులు పెట్టుతున్నారు. అయితే కొంతమంది మేకర్స్ ఈ పరిస్థితిని తక్కువ బడ్జెట్‌లో బెస్ట్ క్వాలిటీ అవుట్‌పుట్ ఇవ్వడం ద్వారా ప్రేక్షకులను ఆశ్చర్య పరుస్తున్నారు. 'మిరాయి' వంటి సక్సెస్ స్టోరీస్ టాలీవుడ్‌కు కొత్త దిశను చూపించాయని అనవచ్చు. ఇదివరకు 'హనుమాన్' సినిమా కూడా అంతే. ఈ నేపథ్యంలో పాత గ్రాఫిక్స్ టీమ్స్ స్థానంలో కొత్త టీమ్స్ ఎంపిక చేయడం జరుగుతోంది. ఇలా రాబోయే సినిమాల్లో గ్రాఫిక్స్ విషయంలో కొత్త ట్రెండ్ ఏర్పడుతోంది. చివరికి ఈ ఫార్ములా అన్ని సినిమాలకు వర్క్ అవుతుందా అనే సందేహం మాత్రం కొనసాగుతూనే ఉంది.



# అన్ని ఉద్యోగాలు వేరు.. నటన వేరు


## టూమచ్ వ్యాఖ్యలపై కాజోల్ క్లారిటీ

ఇటీవల సెలబ్రిటీ టాక్ షో 'టూ మచ్'లో బాలీవుడ్ నటి కాజోల్ చేసిన వ్యాఖ్యలు చర్చకు దారితీసిన విషయం తెలిసిందే. నటీనటులు ఒత్తిడికి గురవుతారని తెలుపుతూ కార్పొరేట్ ఉద్యోగస్థులతో పోల్చారు. ఈ అంశం తీవ్ర చర్చకు దారితీసింది. తాజాగా ఆమె తన వ్యాఖ్యలపై క్లారిటీ ఇచ్చారు. ప్రతి వృత్తిని తాను గౌరవిస్తానని తెలిపారు. అన్ని ఉద్యోగాలు వేరు, నటన వేరు. షూటింగ్ సమయంలో నటీనటులు ఎప్పుడూ అందుబాటులో ఉండాలి. మేం 'ది ట్రయిల్' రెండో సీజన్ కోసం ఒక ప్రాంతానికి వెళ్లాం. 40 రోజులు విరామం లేకుండా చిత్రీకరించాం. ఆ రోజుల్లో మేం ఎప్పుడూ అందుబాటులో ఉండాలి. అలాగే క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. సరిగ్గా తినాలి. ఎప్పుడూ ఒకే లుక్‌లో ఉండాలి. అలా ఉండడం చాలా ఒత్తిడిగా ఉంటుంది. ఇది మిగతా ఉద్యోగులకు ఉండదు. ఆ ఉద్దేశంతోనే నేను పోలిక చెప్పాను. ఆఫీసులలో ఉన్నట్లు నటీనటులకు బ్రేక్ టైం ఉండదు. 9 నుంచి 5 వరకూ ఉద్యోగం చేసేవారు మధ్యలో టీ బ్రేక్ తీసుకోవచ్చు. లేదంటే కొంత సమయం విశ్రాంతి తీసుకోవచ్చు. యాక్టర్స్ అలా చేయలేరు. షూటింగ్ లో విరామ సమయంలో కూడా అందరి కళ్లు నటీనటుల పైనే ఉంటాయి. నవ్వినా, కదులుతున్నా, కూర్చున్నా.. ఏం చేసినా ప్రతిక్షణం పరిశీలిస్తూనే ఉంటారు' అని కాజోల్ తెలిపారు.




# 20నుంచి ఓటిటిలోకి మళయాల మిరాజ్

మలయాళ సినిమా ఇండస్ట్రీలో థ్రిల్లర్ జానర్‌కు పెట్టింది పేరు జీతు జోసెఫ్. 'దృశ్యం' సిరీస్‌తో పాన్ ఇండియా లెవెల్‌లో గుర్తింపు సాధించిన ఈ దర్శకుడు ప్రస్తుతం 'దృశ్యం 3' షూటింగ్‌లో బిజీగా ఉన్నాడు. అయితే అతని దర్శకత్వంలో ఇటీవల ప్రేక్షకుల ముందుకు వచ్చిన చిత్రం 'మిరాజ్'. ఆసిఫ్ అలీ, అపర్ణ బాలమురళి లీడ్ రోల్స్‌లో నటించిన ఈ చిత్రం ఇటీవలే ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి విజయాన్ని అందుకుంది. తాజాగా ఈ చిత్రం ఓటీటీని లాక్ చేసుకుంది. ప్రముఖ ఓటీటీ వేదిక సోని లివ్‌లో ఈ చిత్రం అక్టోబర్ 20 నుంచి మలయాళంతో పాటు తమిళం, కన్నడ, హిందీ, తెలుగు భాషల్లో స్ట్రీమింగ్ కాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. అభిరామి (అపర్ణ బాలమురళి) తన ప్రేమికుడు కిరణ్ (హకీమ్ షాజహాన్)ను పెళ్లి చేసుకోవాలని ప్లాన్ చేస్తుంది. అయితే అభిరామికి పోలీస్ స్టేషన్ నుంచి కబురు రాగా.. సడన్‌గా పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన అభిరామికి కిరణ్ రైలు ప్రమాదంలో మరణించాడనే షాకింగ్ న్యూస్ వస్తుంది. ఇంకా ఆ షాక్ నుంచి తేరుకోకముందే.. ఓ పోలీస్ ఆఫీసర్ (సంపత్ రాజ్), రౌడీ (శరవణన్), ప్రైవేట్ ఇన్వెస్టిగేటర్ (ఆసిఫ్ అలీ) వంటి వ్యక్తులు అభిరామిని ఓ మిస్టీరియస్ హార్డ్ డిస్క్ గురించి ప్రశ్నల వర్షం కురిపిస్తారు. అయితే ఆ హార్డ్ డిస్క్‌లో ఏముంది? కిరణ్ మరణం వెనుక రహస్యం ఏమిటి? అభిరామి ఈ డేంజర్ నుంచి ఎస్కేప్ అవుతుందా? అనేది ఈ సినిమా ఇతివృత్తం.





# ధమకు పోటీగా వస్తోన్న 'ఏక్ దీవానేకి దీవానియాత్'

మడాక్ హారర్ కామెడీ యూనివర్స్‌లో ఫిఫ్త్ ఇన్ స్టాల్ మెంట్ మూవీగా వస్తున్న థమ అక్టోబర్ 21న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఆయుష్మాన్ ఖురానా, రష్మిక హీరో హీరోయిన్లుగా నటిస్తున్న ఈ సినిమాకు ముంజ్య ఫేం ఆదిత్య సర్పోత్థర్ దర్శకుడు. సికిందర్ ఫ్లాప్ తర్వాత నేషనల్ క్రష్ నుండి వస్తోన్న బాలీవుడ్ ఫిల్మ్ ఇదే. ఈ సినిమా కోసం భారీగా ఖర్చుపెట్టింది మడాక్ ఫిల్మ్స్. బాలీవుడ్ ప్రేక్షకులు ఈ ఏడాది హిస్టారికల్ డ్రామా తర్వాత కాస్తో కూస్తో ఆడియన్స్ కనెక్ట్ అయ్యారంటే అవి రొమాంటిక్ లవ్ స్టోరీలకే. సైయారాకు బ్లాక్ బస్టర్ హిట్టిచ్చిన బీ టౌన్ ఆడియన్స్. గతంలో ఫ్లాపైన రొమాంటిక్ స్టోరీ 'సనమ్ తేరీ కసమ్'ను ఈ ఏడాది రీ రిలీజ్ చేస్తే సూపర్ హిట్ చేశారు. ఈ సినిమా ఇచ్చిన స్ఫూర్తితో హర్షవర్థన్ రాణెళి మరో సారి రొమాంటిక్ డ్రామా 'ఏక్ దీవానేకి దీవానియాత్' తో థమకు పోటీగా అక్టోబర్ 21నే దిగబోతున్నాడు. థమతో హిట్ కొట్టాలని గట్టింగా కోరుకుంతుంది రష్మిక. అందుకోసం అందాలు కూడా ఆరబోసింది. మరి నార్త్ ఆడియన్స్ ఈ దీవాళికి ఎవరి ఖాతాలో హిట్టాస్తారే చూడాలి.



# చిరుతో జత కట్టేందుకు వస్తున్న వెంకీ

టాలీవుడ్‌లో తనదైన శైలిలో కామెడీ, ఎమోషన్ మేళవించి ప్రేక్షకులను మెప్పించిన సూపర్‌హిట్ దర్శకుడు అనిల్ రావిపూడి. మెగాస్టార్ చిరంజీవితో కలిసి 'మన శంకర వరప్రసాద్ గారు' అనే టైటిల్ తో ఒక కమర్షియల్ కామెడీ ఎంటర్‌టైనర్‌ను తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. వచ్చే ఏడాది సంక్రాంతి బరిలో రిలీజ్ చేసేందుకు రెడీ అవుతున్న ఈ చిత్రంపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. మెగాస్టార్ చిరంజీవి, అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో సినిమా వస్తుందన్న వార్తతోనే ఫ్యాన్స్ ఉత్సాహంలో మునిగిపోయారు. వెంకటేష్‌తో 100 కోట్ల క్లబ్‌లో చేరిన అనిల్.. ఈసారి చిరుతో మరింత భారీ సక్సెస్ అందుకోవడం ఖాయమని మెగా అభిమానులు నమ్ముతున్నారు. ఇకపోతే ఫిలిం సర్కిల్స్‌లో ఈ సినిమా గురించి మరో సెన్సేషనల్ అప్డేట్ హల్‌చల్ చేస్తోంది. అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో హ్యాట్రిక్ హిట్లు ఇచ్చిన విక్టరీ వెంకటేష్, ఇప్పుడు చిరు సినిమాలోనూ కీలక పాత్రలో కనిపించబోతున్నట్లు సమాచారం. ఈ వార్త చాలా రోజులుగా చర్చనీయాంశమవుతున్నా.. వెంకటేష్ షూటింగ్‌లో పాల్గొనకపోవడంతో కొంత అనుమానం నెలకొంది. అయితే ఇప్పుడు ఆ సందేహాలన్నిటికీ చెక్ పెడుతూ వెంకటేష్ అక్టోబర్ 21 నుంచి మెగాస్టార్‌తో కలిసి షూటింగ్‌లో జాయిన్ కానున్నారు. అనిల్ రావిపూడి మార్క్ ఫన్‌తో పాటు ఎమోషన్ కలబోసిన పాత్రలో వెంకటేష్ కనిపించబోతున్నారని మేకర్స్ చెబుతున్నారు. దీంతో చిరు, వెంకీ కాంబినేషన్ మళ్లీ తెరపై చూడబోతున్న అభిమానులు సూపర్ ఎక్సైటెడ్‌గా ఉన్నారు. మొత్తానికి, మన శంకర వరప్రసాద్ గారు చిత్రం టాలీవుడ్‌లో సంక్రాంతి బరిలో భారీ సంచలనాన్ని సృష్టించబోతుందనే నమ్మకం పెరుగుతోంది.



# 23న ఓటిటిలోకి ఓజి మూవీ

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటించిన భారీ చిత్రం 'ఓజి సాహో ఫేమ్ సుజీత్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో ప్రియాంక మోహన్ హీరోయిన్ గా నటించగా బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మీ విలాన్ గా నటించాడు. డివివి దానయ్య నిర్మించిన ఈ సినిమా భారీ అంచనాల మధ్య సెప్టెంబరు 25న వరల్డ్ వైడ్ గా రిలీజ్ అయింది. ఈ సినిమా భారీ వసూళ్లు రాబడుతూ ఇంకా థియేటర్స్ లో రన్ అవుతోంది. ఇప్పటి వరకు వరల్డ్ వైడ్ గా రూ. 310 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసింది. ఇంతటి సంచనాలు సృష్టించిన ఓజి ఇప్పుడు ఓటీటీ స్ట్రీమింగ్ కు రెడీ అవుతోంది. ఈ సినిమా డిజిటల్ రైట్స్ ను రిలిజ్ కు ముందే భారీ ధరకు కొనుగోలు చేసింది ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్ ఫ్లిక్స్. ఇప్పుడు తమ ఓటిటీలో స్ట్రీమింగ్ చేసేందుకు డేట్ ఫిక్స్ చేసింది. ఈ నెల 23నుండి నెట్ ఫ్లిక్స్ లో స్ట్రీమింగ్ కు రానుంది ఓజి. 28 రోజుల థియేటర్ రన్ తర్వాత ఓటీటీ స్ట్రీమింగ్ కు వస్తోంది. తెలుగు, తమిళ్, మలయాళం, కన్నడతో పాటు హిందిలోను డిజిటల్ రిలిజ్ కాబోతుంది. థియేటర్స్ లో సంచలనం సృష్టించిన ఈ సినిమా క్షిలో ఎలాంటి వ్యూస్ రాబడుతుందో చూడాలి.

# మిత్రమండలి కుటుంబ కథా చిత్రం

ఈసారి దీపావళి పండగ సంబరాల్ని తొందరగా థియేటర్లలోకి తీసుకొస్తున్నామని, అందరూ కుటుంబంతో కలిసి మా సినిమా చూస్తూ ఆనందంగా సమయాన్ని గడపొచ్చన్నారు ప్రియదర్శి. ఆయన కథానాయకుడిగా తెరకెక్కిన చిత్రం 'మిత్రమండలి'. నిహారిక.ఎన్.ఎమ్ కథానాయిక. రాగ్ మయూర్, విష్ణు ఓయ్, ప్రసాద్ బెహరా ప్రధాన పాత్రధారులు. విజయేందర్ దర్శకత్వం వహించారు. కల్యాణ్ మంతెన, భాను ప్రతాప, విజయేందర్ రెడ్డి తీగల నిర్మాతలు. ఈ చిత్రం ఈ నెల 16న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా సోమవారం రాత్రి హైదరాబాద్‌లో విడుదలకు ముందస్తు వేడుకని నిర్వహించారు. కథానాయకుడు శ్రీవిష్ణు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రియదర్శి మాట్లాడుతూ ఈ సినిమా నచ్చకపోతే, తదుపరి వచ్చే నా సినిమా చూడకండి. నాకు నాని అన్న నేర్పించిన మాట ఇది. సినిమాని ఎలా ప్రేమించాలో నేర్పించిన అన్న ఆయన. సినిమాపై నాకున్న నిబద్ధతతో, ప్రేక్షకులపై నాకున్న ప్రేమతో చెబుతున్న మాట ఇది. వచ్చే నా సినిమా ఏదైనా సరే, ఇది నచ్చకపోతే మాత్రం చూడకండి. సినిమాని చూసుకున్నాక నాకు కలిగిన నమ్మకంతోనే ఈ మాట చెబుతున్నా అన్నారు. చిత్ర సమర్పకులు బన్నీ వాస్ మాట్లాడుతూ స్వచ్ఛమైన కుటుంబ వినోదం ఉన్న సినిమా ఇది. పిల్లలతో కలిసి సినిమా చూస్తూ హాయిగా ఆస్వాదించవచ్చు. దీపావళికి ముందు మేమే వస్తున్నాం.




Printed, Published & Owned by Dr. JBL, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S), RNI NO. APTEL/2006/19056